


కర్నాటక శ్రావణబెళగొళలో 58 అడుగుల ఎత్తైన గోమటేశ్వరుని విగ్రహం మహామస్తకాభిషేకానికి శుక్రవారం సిద్ధం చేస్తున్న దృశ్యం

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి: 62 • సంచిక: 38 •శనివారం 17 ఫిబ్రవరి 2018 • విజయవాడ ❋ పేజీలు: 14 • వెల: 5.00 •Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ విదియ తె. 4.07 వరకు, అనంతరం తదియ; నక్షత్రం: శతభిషం ఉ. 11.04 వరకు, అనంతరం పూర్వాభాద్ర ; అమృతకాలం: తె. 3.50 నుండి 5.30 వరకు; వర్జ్యం: సా. 5.43 నుండి 7.23 వరకు; దుర్ముహూర్తం: ఉ. 6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;

ఢిల్లీ పిలుపు!

పీఎంవో వర్తమానం

• 21న హస్తినకు రండి • దిద్దుబాటు చర్యలకు కేంద్రం శ్రీకారం • హస్తిన పెద్దల కసరత్తు • సమగ్ర వివరాలతో వెళ్లండి • అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర బడ్జెట్ అనంతర పరిణామల నేపథ్యంలో ఈ నెల 21న అన్ని వివరాలతో ఢిల్లీకి రావల్సిందిగా ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి రాష్ట్రప్రభుత్వానికి శుక్రవారం పిలుపు అందినట్టు సమాచారం. విభజన చట్టం హామీలు, బడ్జెట్ కేటాయింపులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, 2014 నుంచి రాష్ట్రా నికి అందిన నిధులు, ప్రాజెక్టుల సమగ్ర నివేదికలు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, ఇతర వివరాలతో హస్తినకు రావల్సిందిగా రాష్ట్రప్రభుత్వాన్ని కేంద్రం కోరింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 8 కీలక శాఖలకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఆర్థిక శాఖ కార్యదర్శి ,ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, జనవనరుల శాఖ, మానవ వనరుల, రవాణా, గనులు, సీఆర్‌డీఏ, పరిశ్రమలు, తదితర శాఖల కార్యదర్శులు హాజరు కానున్నారు. కాగా కేంద్ర వర్తమానం పంపిన నేపథ్యంలో ఈనెల 21,22 తేదీలలో ఢిల్లీలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు పూర్తి వివరాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కేంద్రంలో బడ్జెడ్ ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్రంలో రాజకీయ వేడిని రగిల్చిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. మిత్ర భేదాన్ని చాటి వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన కేంద్ర బడ్జెట్ అనంతర పరిణామాలను ఒక కొలిక్కి తెచ్చేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. తాజా పరిణామాలతో తెరమరుగైన ప్రత్యేక హోదా అంశం మళ్ళీ తెరమీదకు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇటీవలే ➩ 3వ పేజీలో...



మంత్రులు, అధికారులతో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రీ బడ్జెట్ సమావేశం

కేంద్రం హామీలు నెరవేర్చకున్నా... అవసరమైన నిధులివ్వకున్నా...

స్వశక్తితో ముందుకు

2 లో

మార్చి 5 నుంచి అసెంబ్లీ... 8న బడ్జెట్



విభజన హామీలపై

రాజీలేని పోరు!

• అందరినీ కలుపుకు పోదాం • కేంద్రంపై ఒత్తిడి తెద్దాం • సమాచార సేకరణకు త్రిసభ్య కమిటీ • 11 హామీలపై నేడు చర్చ • పవన్‌కల్యాణ్ జేఎఫ్‌సీలో విస్తృత చర్చ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని అంశాలు, ప్రత్యేక హోదా హామీని సాధించడంపై జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో కదలిక తెచ్చింది. హామీల అమలు, నిధుల మంజూరుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న పరస్పర ప్రకటనలపై అధ్యయనం చేసేందుకు జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణన్ అధ్యక్షతన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్‌తో పాటు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, విశ్రాంత ఐఏఎస్ అధికారులు పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, మహారాష్ట్ర క్యాడర్‌కు చెందిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన సమావేశంలో భవిష్యత్తు ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ➩ 8వ పేజీలో...

ఏ రాజకీయ నిర్ణయాన్నైనా

ఎదుర్కొంటాం!

• పవన్ కమిటీకి విశ్వసనీయత లేదు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు



8 లో

కేంద్రం ఇచ్చిన నిధులపై

శ్వేతపత్రం ఇస్తాం!

• హరిబాబు గణాంకాలపై బహిరంగ చర్చకు సిద్ధం: మంత్రి గంటా





సీఎం అంటే ఇలా ఉండాలి!

• చంద్రబాబుపై తమిళ మీడియా ప్రశంసల జల్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సీఎం అంటే ఇలా వుండాలి.. చంద్రబాబును తెగ పొగిడేస్తున్న తమిళ మీడియా.. ఇది రాష్ట్రం నుంచి వెలువడే తెలుగు పత్రిక కాదు.. అంతకన్నా మాసపత్రిక కాదు.. చెన్నై ➩ 3వ పేజీలో...

విషవాయువుకు

ఏడుగురు బలి



• డ్రైనేజీ శుభ్రం చేయడంలో దుర్ఘటన • మరో ఇద్దరు ఆస్పత్రికి తరలింపు • చిత్తూరు జిల్లాలో విషాదం

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: ఒక ప్రైవేటు హేచరీస్ కు సంబంధించిన డ్రైనేజిను శుభ్రం చేయడానికి ప్రయత్నించే క్రమంలో విషవాయువుల తీవ్రతకు ఏడుగురు దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం ఉదయం చిత్తూరు జిల్లా పలమనేరు వద్ద జరిగింది. ఈ సంఘటన పూర్వాపరాలు ఇలా వున్నాయి. పలమనేరు మండలం మొరం గ్రామం వద్ద తమిళనాడుకు చెందిన వారు వేంకటేశ్వర హేచరీస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ పనిచేసేవారి జనవాసాలకు, హేచరీస్ కోళ్ల ఫారానికి కలిపి ఒకే డ్రైనేజి ఏర్పాటు చేశారు. తరచుగా ఆ డ్రైనేజిలో మురుగు సమస్య ఏర్పడడం, సంబంధిత సిబ్బంది డ్రైనేజి సంప్‌లో దిగి శుభ్రం చేయడం జరుగుతూ ఉంటుంది. ఇదే క్రమంలోనే శుక్రవారం ఉదయం ఎం రమేష్32), ➩ 5వ పేజీలో...




ఎన్నికల ఫలితాలెలా ఉన్నా...

ప్రజాసేవ చేస్తా!

• ప్రజలకు ఇవ్వడంపైనే నా దృష్టి • ఎన్నికలు కేవలం ఉప ఉత్పత్తులు • అదే నా రాజకీయ పంథా • శ్రద్ధ, ఆత్మవిశ్వాసంతో నెగ్గవచ్చు • పరీక్షా పే చర్చలో విద్యార్థులతో ప్రధాని నరేంద్రమోడీ

న్యూఢిల్లీ: "ఫలితాలు, మార్కులు పరీక్షల తాలూకు ఉప ఉత్పత్తులు. పరీక్షలకు వెళ్ళేవారెవరైనా సరే వారికి తెలిసినంతవరకు ఉత్తమమైనదాన్ని అందించడంపై శ్రద్ధ పెట్టాలి. నేను రాజకీయాల్లో అదే పద్ధతి అనుసరిస్తుంటాను. నా తోటి భారతీయులకు నా దగ్గరున్న ప్రతిదీ ఇవ్వడంపైనే దృష్టి పెడుతుంటాను. ఫలితాల గురించి మీరెక్కువగా ఆలోచించిన పక్షంలో అది ఇతర విషయాలను సాధించే మార్గానికి అడ్డుపడుతుంది. ఎన్నికలు, ఫలితాలు వస్తుంటాయి.. పోతుంటాయి. అవి ఉప-ఉత్పత్తులు లాంటివి. మీరు బోర్డు పరీక్షల్లో బాగా రాణించాలని శుభాకాంక్షలు చెబుతున్నాను. నా బోర్డు పరీక్షల విషయానికి వస్తే, 125 కోట్ల మంది భారతీయుల శుభాకాంక్షలు నాతో ఉన్నాయి..." పరీక్షా పే చర్చ కార్యక్రమం సందర్భంగా 2019లో తన పరీక్షకు తన సొంత సన్నాహకాల గురించి ప్రధాని నరేంద్ర మోడీ అన్న మాటలివి. ప్రధాని ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చ కార్యక్రమం శుక్రవారం ఇక్కడి తాల్‌కటోర స్టేడియంలో జరిగింది. దేశ వ్యాప్తంగా 10, 12వ తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న 3,000 మందికి పైగా విద్యార్థినీవిద్యార్థులతో నరేంద్ర మోడీ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వారు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ముందుగానే ప్రకటించిన కార్యక్రమం కావడంతో ప్రధాని కార్యాలయానికి వేలాదిగా ప్రశ్నలు వచ్చాయి. ఒత్తిడి, తల్లిదండ్రుల ➩ 8వ పేజీలో...



కూలిన జీవితాలు

• రోడ్డుపాలైన మృతుల కుటుంబాలు 5 లో

మళ్లీ కావేరి జగడం

• సుప్రీం కోర్టు తీర్పుతో రగిలిన కుంపటి 5 లో

తత్కాల్ టిక్కెట్లకు ఇక రిఫండ్



• ఐదు సందర్భాల్లో 100 శాతం వాపస్

వివరాలు 5లో...

ఆదాయ లెక్కలు చెబితేనే పోటీకి



• సంచలన తీర్పు వెలువరించిన సుప్రీం

వివరాలు 5లో...

మెరుపుదాడి చేశాం: పాక్ ఒట్టిదే!: భారత్



వివరాలు 5లో...

కేంద్రం హామీలు నెరవేర్చకున్నా... అవసరమైన నిధులు ఇవ్వకున్నా...

స్వశక్తితో ముందుకు

మార్చి 5 నుంచి అసెంబ్లీ... 8న బడ్జెట్

- జనాన్ని మోసగిస్తే గుణపాఠాలే
- కాంగ్రెస్‌కు తగిన శాస్తి చేశారు
- రేపు ఎవరైనా అంతే!
- పంటలకు ఖచ్చితంగా నీళ్లిస్తున్నాం
- ముతక ధోరణి బడ్జెట్‌కు చరమగీతం
- నవ్యాంధ్రకు నవ బడ్జెట్ ప్రవేశపెడతాం
- 15% వృద్ధే ఇక లక్ష్యం
- అన్ని శాఖల్లో సంస్కరణలు తప్పవ్
- బడ్జెట్ ప్రిపరేటరీ సమావేశంలో సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్రం న్యాయబద్ధంగా అవసరమైన నిధులను సైతం ఇవ్వలేదని, కనీసం ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అయినప్పటికీ క్రమశిక్షణతో కష్టపడి ముందజ వేయగలుగుతున్నామని అన్నారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ఆయన ఏపీ ప్రీ బడ్జెట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇష్టారీతిన రాష్ట్ర విభజనకు పాల్పడిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ప్రజల్లో ఒక నిశ్చిత అభిప్రాయం వస్తే వారి తీసుకునే నిర్ణయాలు కఠినంగా ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాత ముతక పద్ధతులతో ఏమి సాధించలేమని, నూతన విధానాలకు పట్టం కట్టాలని పేర్కొన్నారు. ఏపీని విజ్ఞాన భాండగారంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అన్ని శాఖల్లో సంస్కరణలు తీసుకువస్తున్నామని పాత చట్టాలను అవసరమైతే రద్దు చేసుకోవడమే కాకుండా కొత్త చట్టాలను అమలులోకి తెస్తున్నామంటూ ఆయా శాఖల లక్ష్యాలకు అనుగుణంగా ఎంత నిధులు అవసరమో అంచనాలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ అభివృద్ధిలో ఎక్కడ లోపం ఉందో స్వీయ విశ్లేషణ చేసుకోవాల్సిందేనని, 15 శాతం వృద్ధి సాధించాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అందుకోవాలని చెప్పారు. జీఎస్‌డీపీ కంట్రిబ్యూషన్‌ను మూడు నెలలకు ఒకసారి విశ్లేషించి లక్ష్యాలను నిర్ణయించుకుంటున్నామని అయినప్పటికి కొన్ని శాఖల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదన్నారు. అలాంటి చోట పనితీరును మెరుగుపరుచుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. జలవనరుల శాఖ మంచి ఫలితాలు సాధించిందని వర్షపాతం తక్కువగానే ఉన్నప్పటికి విద్యుత్ వినియోగం బాగా తగ్గిందని, భూగర్భ జలాలు పెంచుకోగలిగామన్నారు. విద్యుత్ వినియోగంబాగా తగ్గిందని 7 లక్షల పంట సంజీవని ఫామ్ ఫాండ్స్ తవ్వించినట్లు గుర్తు చేశారు. కొన్ని లక్ష్యాలు నిర్దేశించుకొని పనిచేయాల్సిన పరిస్థితులు ఇప్పుడున్నాయంటూ ప్రభుత్వ శాఖల పనితీరుపై కొన్ని ఏజెన్సీలు ర్యాకింగ్‌లు ఇస్తున్నట్లు తెలియజేశారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అన్ని వనరులు ఉన్నప్పటికీ వృద్ధిలో వెనుకబడి ఉండడం ఆందోళన కలిగించే అంశమని వివరించారు.

మొదటి వారంలో బడ్జెట్ సమావేశం

మార్చి తొలి వారంలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి సమీక్ష సమావేశంలో వెల్లడించారు. మార్చి 5న సభలో గవర్నర్ ప్రసంగం ఉంటుందని, 8న బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని పేర్కొన్నారు. ఒకప్పుడు సేద్యం చేయడానికి వెనుకాడే పరిస్థితులు ఉండేవని, తాజాగా పంటలకు ఖచ్చితంగా నీరు ఇవ్వగలుగుతున్నామని అన్నారు. ఓడీఎఫ్ తరహాలో రాష్ట్రంలో పాట్ హోల్స్‌ఫ్రీకి వెళ్ళాలని నిర్దేశించుకున్నామని చెప్పారు. పెద్ద ఎత్తున రహదారుల అభివృద్ధి పనులు జరుగుతుండగా మరోవైపు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో రాష్ట్రం ముందుంజలో ఉందని సీఎం తెలియజేశారు. ఎక్కడా రాజీపడేది లేదని అవసరమైతే కొత్త చట్టాలు, కొత్త విధానాలు తీసుకురావడానికి వెనుకంజ వేయమని స్పష్టం చేశారు.

పంచాయతీరాజ్ భేష్

శాఖల వారీగా చూసినప్పుడు పంచాయతీరాజ్‌లో అనేక పురస్కారాలు వచ్చాయని అన్నారు. ఇదే బాటలో మిగిలిన శాఖలు కూడా పయనించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మూడేళ్ళ సరాసరి వృద్ధి రేటు 11 నుంచి 12 శాతం మధ్య ఉందని ఇప్పటికే నూరు శాతం గ్యాస్‌ను అందించామని ఓడీఎఫ్ సాధించామని, నిధుల వినియోగం బాగా జరుగుతోందని తెలియజేశారు. కొన్ని శాఖల్లో తీసుకున్న నిర్ణయాలు సానుకూల ఫలితాలను ఇచ్చాయని ఒకప్పుడు విద్యుత్ శాఖలో మంచి ఫలితాలు సాధించామని సంస్కరణలు ప్రారంభించి సఫలమయ్యామని అంటూ ఒరిస్సా, ఏపీ కంటే ముందే సంస్కరణలు ప్రారంభించి విఫలమైందని గుర్తు చేశారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం

సుస్థిర అభివృద్ధి, ఆర్థికవృద్ధి, ప్రజల సంతృప్తే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఇంటర్నేషనల్ బెంచ్ మార్క్ చేరుకోవడానికి కృషి చేస్తున్నామని సీఐఐ భాగస్వామ్య సదస్సులో దీనిపై ప్రత్యేకంగా ఒక సెషన్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వంతో చర్చించడం జరుగుతుందని తెలిపారు. వాస్తవం తెలుసుకొని అధికారులు అవసరమైన స్ఫూర్తిని పొంది లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఇది వారికి పరీక్ష సమయమని ముఖ్య మంత్రి గుర్తు చేశారు. సమావేశంలో ఆర్థిక మంత్రి యనమల, పంచాయతీరాజ్, ఐటీ మంత్రి లోకేష్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

తొలి త్రైమాసికంలో

అదనపు బడ్జెట్‌కు నో

- స్థిరాస్తులకు కేటాయించిన నిధులను రెవెన్యూ ఖర్చులకు మళ్లించొద్దు
- సీఎం హామీలకు ప్రాధాన్యత
- ప్రీ బడ్జెట్ సమీక్షలో ఆర్థిక మంత్రి యనమల





అమరావతి, ఆంధ్రప్రభ ; ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అదనపు బడ్జెట్‌ను అడగవద్దని, ముఖ్యమైన ప్రాజెక్టులు ఏమైనా ఉన్నట్లయితే బడ్జెట్‌లోనే ప్రస్తావించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. అదనపు బడ్జెట్ కావాల్సిన పక్షంలో చివరి త్రైమాసికంలోనే కేటాయించనున్నట్లు తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన ప్రీ బడ్జెట్ సమీక్షలో పాల్గొన్న ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో స్థిరాస్తి ఖర్చులు పెంచనున్నట్లు పేర్కొన్నారు. కేటాయించిన నిధులు ఖర్చు చేసిన అనంతరం మాత్రమే అదనపు నిధులు అడగాల్సి ఉంటుందని వివిధ శాఖల అధికారులతో, మంత్రులతో యనమల అన్నారు. ప్రతి శాఖ ముఖ్యమంత్రి హామీలను, ఇంటింటి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని అందుకు అవసరమైన నిధులను మాత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పనులు పంచాయతీరాజ్ శాఖలో ఎక్కువగా ఉంటాయని, ఇది చాలా ముఖ్యమైన శాఖ అని పేర్కొన్నారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులను అవసరాన్ని బట్టి ఇతర పథకాలు, ప్రాజెక్టులకు వినియోగించే వెసులుబాటు ఇచ్చామని అన్నారు. అయితే స్థిరాస్థులకు, రెవెన్యూ ఖర్చులకు మళ్ళించకూడదని ఆదేశించారు.

రోడ్లు, తాగునీరు, భూగర్భ, మురుగునీటి పారుదల పనులను పూర్తి చేయాలని చెప్పారు. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అప్పటికి ఉన్న జనాభా ప్రాతిపదికన నీటి పథకాలను రూపొందిస్తారని, జనాభా పెరిగిన అనంతరం ఆ పథకాలు సరిపోవని మంత్రి అన్నారు. అవి పాతబడిపోయి ప్రస్తుత అవసరాలను తీర్చలేవని గుర్తు చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పథకాలను చేపట్టాలని అధికారులకు, మంత్రులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే పథకాలకు నిష్పత్తి ప్రకారం ఎంత ఖర్చు అయినా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మానవాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ఆరోగ్యం మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో, గిరిజన ప్రాంతాలలో వైద్యులు అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేయాలని, డాక్టర్ పోస్టులను త్వరగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోటి ఎకరాలకు నీరు: మంత్రి దేవినేని

రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల ద్వారా ఖరీఫ్‌లో కోటి ఎకరాలకు నీరు అందించినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. రాయలసీమకు 160 టీఎంసీలు, కొత్త ఆయకట్టు 70 వేల ఎకరాలకు 40 టీఎంసీల నీరు అందించినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో మొట్టమొదటి సారిగా రబీ పంట వేశారని, చెరువులు కూడా నింపినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో ఇరిగేషన్ శాఖకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా అదనపు కార్యక్రమాలు చేపట్టేందుకు మరిన్ని నిధులు కేటాయించాలని దేవినేని ఉమామహేశ్వరరావు కోరారు.

పంచాయతీల్లో 80 శాతం సీసీ రోడ్లు పూర్తి: మంత్రి లోకేష్

ప్రీ బడ్జెట్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో 80 శాతం సీసీ రోడ్లు పూర్తయినట్లు తెలియజేశారు. ఇందుకోసం 430 కోట్లు ఖర్చు అయ్యాయని అన్నారు. రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని, నివాస ప్రాంతాలకు మెటల్ రోడ్లు కూడా వేసినట్లు తెలిపారు. ఐటీ విభాగంలో వచ్చే ఏడాది కొత్త ప్రాజెక్టు చేపడుతున్నామని, అదే విధంగా విద్యుత్, జీఎస్టీ ఉత్పత్తి, ఇన్సెంటివ్‌లు వంటి రాయితీలు ఇవ్వాల్సి ఉన్నందు వల్ల అదనపు నిధులు కేటాయించాలని లోకేష్ కోరారు. నీటి పథకా లను భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 25 ఏళ్ళ దాకా పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందిస్తున్నట్లు వివరించారు. వైద్య ఆరోగ్య సేవలు ఫాన్స్‌కాన్ వంటి 5 అంతర్జాతీయ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌కు రానున్నట్లు మంత్రి వివరించారు. తిరుపతిలో కూడా ఐటీ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరిస్తూ దీంతో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

నవంబర్ నాటికి ఆన్‌లైన్‌లో వీధి బల్బులు

ఎన్టీఆర్ సుజల పథకానికి లెడ్ బల్బులకు నిధులు పెంచాలని ఇదే సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రతిపాదించారు. వచ్చే నవంబర్ నాటికి రాష్ట్రంలో వీధి బల్బులన్ని ఆన్‌లైన్‌కు ఎక్కుతాయని అదే విధంగా విద్యుత్ కనెక్షన్లు కూడా కంప్యూటరైజేషన్ అయిపోతాయని, మాన్యువల్ ఏమి ఉండదని వివరించారు. ఎలక్ట్రానిక్, ఐటీ పాలసీలతో పాటు డిటిపి, సైబర్ వంటి కొత్త పాలసీలు ప్రకటించామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఈ ప్రగతి, స్టార్టప్ కంపెనీలు, మౌలిక వసతులు, సబ్సిడీల తదితర సంబంధించిన అవసరం ఉన్నందు వల్ల తమ శాఖకు ఎక్కువ నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ కోరారు. మేజర్ కంపెనీలు అనేకం వస్తున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా ప్రత్యక్షంగా 42 మందికి ఉపాధి కల్పించామని చెప్పారు. వచ్చే ఏడాది కోటి మందికి డిజిటల్ లిటరేచర్‌పై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టనున్నామని చంద్రబాబుకు వివరించారు. ఎంఎంఆర్ వ్యాక్సిన్ వేయడం దేశంలో మన రాష్ట్రం 4వ ర్యాంకులో ఉన్నట్లు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. డయాలసిస్ కేంద్రాలు మరో 14 ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నామని, అవుట్ పేషంట్ల సంఖ్య పెరిగిందని మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఆమె ముఖ్యమంత్రికి వివరించారు. ప్రీ బడ్జెట్ సమీక్ష సమావేశంలో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.రవీచంద్ర, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి కె.జవహర్ రెడ్డి, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ బి.రామాంజనేయులు, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శులు కెవివి.సత్యనారాయణ, హేమ మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్కారీ ఆసుపత్రుల్లో వసతులు: మంత్రి కామినేని

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్‌కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీలో వైద్య ఆరోగ్య సేవలు ప్రజలందరికీ అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నాయకత్వంలో వైద్య విద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ భవిష్యత్తు అవసరాల రీత్యా ప్రాధాన్యత ప్రాతిపదికన ఎక్కువగా నిధులు కేటాయించాలని మంత్రి కామినేని శ్రీనివాస్ ఆర్థిక శాఖ మంత్రిని కోరారు.

సీఎంతో జీ గ్రూపు అధినేత భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రముఖ పారిశ్రామికవేత్త, జీ గ్రూపు అధినేత సుభాష్ చంద్ర భేటీ అయ్యారు. శుక్రవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి ఆయన మంత్రి గంటా శ్రీనివాసరావుతో కలిసి వచ్చారు. సుమారు మూడు గంటలపాటు సీఎంతో సమావేశం అయిన ఆయన అగ్రిగోల్డ్, అమరావతిలో మీడియా సిటీ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. అగ్రిగోల్డ్ సంస్థను జీ గ్రూపు అధీనంలోకి తీసుకుంటానని గతంలోనే ప్రకటించిన సుభాష్ చంద్ర ఈ విషయం కోర్టు పరిధిలో ఉండడంతో కొంత వెనక్కి తగ్గారు. అయితే అగ్రిగోల్డ్ బాధితుల పోరాటం రోజురోజుకీ ఉధృతమవుతున్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారికి తగిన న్యాయం చేసే దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మరోసారి జీ గ్రూపు అధినేత సుభాష్ చంద్రతో భేటీ అయినట్లు సమాచారం.

ముఖ్యమంత్రితో సుప్రీంకోర్టు న్యాయవాది సమావేశం

అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ డి.వి.రావు సచివాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రితో మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. సమర్థవంతమైన నాయకత్వం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి తలమానికంగా నిలిచిందని కొనియాడారు. రాష్ట్ర విద్యార్థులు మీలా క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి పనిచేస్తే ఉజ్వలమైన భవిత ఉంటుందన్నారు. వ్యాపారులు కేవలం తమ వ్యాపారాలే కాకుండా సామాజిక బాధ్యతను తీసుకోవాలన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మీరు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం సుప్రీంకోర్టులో పూర్తిగా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని డాక్టర్ డి.వి.రావు చంద్రబాబుకు హామీ ఇచ్చారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి డి.వి.రావును అభినందించి పేదల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. అనంతరం సుప్రీంకోర్టు న్యాయవాది డి.వి.రావు ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

నేడు బెంగళూరుకు ముఖ్యమంత్రి

అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం బెంగళూరుకు వెళ్ళనున్నారు. తొలుత గుంటూరు జిల్లా కొటప్పకొండ, నరసరావుపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం అక్కడి నుంచి నేరుగా మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ప్రత్యేక విమానంలో గన్నవరం నుంచి బెంగళూరుకు బయలుదేరి వెళతారు. అక్కడ హడిల్-2018 కార్యక్రమంలో ఫ్యూచర్ ఆఫ్ ది సౌత్ అనే అంశంపై ప్రసంగించనున్నారు. తిరిగి రాత్రి బెంగళూరు నుంచి అమరావతి చేరుకుంటారు.

గ్రామాభివృద్ధికి అస్త్రం 'ఉపాధి'

- ఇప్పటివరకు 18 కోట్ల 40 లక్షల పని దినాలు పూర్తి
- లక్ష్యాలపై దృష్టి పెట్టాలి
- వారంలో కేంద్రం నుంచి నిధులు
- కలెక్టర్లతో మంత్రి లోకేష్ వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, ఆంధ్రప్రభ : గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ఒక అస్త్రంలా ఉపయోగపడుతోందని రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన ఉపాధి హామీ పథకం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఎల్ఈడీ లైట్లు, గ్రామీణ నీటి సరఫరాపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్‌తో అవస్థ పడుతున్న నేపథ్యంలో మన గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకోవాలంటే మనకు ఉన్న ఒకే ఒక అస్త్రం ఉపాధి హామీ పథకం అని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రం లోటు బడ్జెట్‌తో సహా అనేక సమస్యలతో సతమతమవుతున్నామని అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ సంవత్సరం 24 కోట్ల పని దినాలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గనిర్దేశం చేశారని, అయితే ఇప్పటికే ఇందుకు సంబంధించి 18 కోట్ల 40 లక్షల పని దినాలు పూర్తి చేశామని చెప్పారు. ఇంకా 5 కోట్ల 60 లక్షల పని దినాలు ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుని ముందుకుపోతున్నదని అన్నారు. అయితే గత రెండు నెలలుగా ఇందుకు సంబంధించి కొన్ని జిల్లాల్లో పెర్ఫార్మెన్స్ కొంత తగ్గిందని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇంకా 45 రోజులు మాత్రమే మిగిలాయని, ఈలోపు మిగతా లక్ష్యాన్ని సాధించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ 45 రోజుల్లో ప్రతి రోజూ 13 లక్షల పని దినాలు లక్ష్యంగా చేసుకుని పని చేయాలని లోకేశ్ ఆదేశించారు. వేతనదారుల సగటు వేతనం పెరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పనితీరు మెరుగుపర్చుకోవాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న వెయ్యికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం వచ్చే వారం రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వేతన బకాయిలు మరో వారం రోజుల్లో వస్తాయని అన్నారు. కేంద్ర మంత్రి తోమర్‌తో మాట్లాడినప్పుడు మరో వారం రోజుల్లో నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

మెటీరియల్ బకాయిలు కూడా మరో నాలుగు రోజుల్లో రాబోతున్నాయని మంత్రి లోకేశ్ తెలిపారు. కనుక ఈ 45 రోజులూ అధికారులు ఫీల్డ్‌లోనే ఉండి, పనులు చూడాలని అన్నారు. కొన్ని జిల్లాల్లో ఫార్మ్‌పాండ్స్, వర్మి కంపోస్ట్ కేంద్రాల నిర్మాణం పనులు అనుకున్నంత వేగంగా జరగడం లేదని అన్నారు. ఇప్పటికే కాలాతీతమైందని, ఇకనుంచైనా పనుల్లో వేగాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. వివిధ విభాగాల్లో టార్గెట్లు ఇచ్చామని, దీనికి అందరూ అంగీకరించారన్నారు. అయితే టార్గెట్లు ఎవరికీ వారు తగ్గించుకునే అవకాశం లేదన్నారు. ముందుగా ఇచ్చిన లక్ష్యాలను సాధించేలా అంతా పని చేయాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు ప్రారంభించిన అన్ని గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి,పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

వేసవిలో తాగునీటి సరఫరా, ట్యాంకర్ల పర్యవేక్షణ కోసం అధునాతన టెక్నాలజీతో యాప్‌ను సిద్ధం చేశామని తెలిపారు. దీని ద్వారా అన్ని జిల్లాల్లో నీటి సరఫరా వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని స్పష్టంచేశారు. గ్రామీణ గృహ నిర్మాణ పథకం కోసం ఉపాధి హామీ పథకం ద్వారా ఇవ్వాల్సిన రూ. 61 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ రామాంజనేయులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సర్టిఫికెట్‌లెస్ గవర్నెన్స్

- ఆర్టీజీతో ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం
- రిలయన్స్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ సమావేశం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో సర్టిఫికెట్‌లెస్ గవర్నెన్స్ తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. శుక్రవారం సచివాయలంలో రియల్ టైం గవర్నెన్స్ సెంటర్‌లో రిలయన్స్ గ్రూప్ ప్రతినిధులతో నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున రియల్‌టైం గవర్నెన్స్‌ను అమలు చేస్తూ పరిపాలనలో అభివృద్ధిని సాధిస్తున్నామని చెప్పారు. రియల్‌టైం గవర్నెన్స్ ద్వారా ప్రజల సమస్యలను రియల్‌టైంలో తెలుసుకుని అతి తక్కువ సమయంలోనే త్వరగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. మిగిలిన దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల తలసరి ఆదాయం తక్కువగా ఉందన్నారు. ఈ సమస్యను అధిగమించి 15 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని, ముందుకుపోతున్నామని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ 2022 నాటికి దేశంలోనే అభివృద్ధి చెందిన మొదటి మూడు రాష్ట్రాల్లో ఒక్కటిగానూ, 2029 నాటికి దేశంలో నెంబర్ వన్ స్థానంలోనూ, 2050 నాటికి ప్రపంచంతోనూ పోటీ పడాలని లక్ష్యంగా పెట్టుకుని పరుగులు తీస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో 7 మిషన్స్, 5 గ్రిడ్‌లను ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధన కోసం పని చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ప్రజలకు ఇంటర్నెట్ సదుపాయం హక్కుగా మారబోతున్నదని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఫైబర్ గ్రిడ్ ఏర్పాటు చేశామని, రూ. 149లకే వైఫై,ఇంటర్నెట్, టెలివిజన్ కనెక్షన్ అందిస్తున్న ఘనత ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా రియలన్స్ సంస్థ ప్రతినిధులు స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న రియల్ టైం గవర్నెన్స్ నుంచి తాము ఎంతో నేర్చుకోవాల్సి ఉందని, అందుకే సెంటర్‌ను పరిశీలించి రమ్మని తమ అధినేత ముఖేష్ అంబానీ చెప్పారని పేర్కొన్నారు. ఏపీ అమలు చేస్తున్న రియల్ టైం గవర్నెన్స్ తమ అధినేతను ఎంతగానో ఆకట్టుకుందని, అందుకే సెంటర్ పనితీరును పరిశీలించి రమ్మని పంపారని తెలిపారు.



రిలయన్స్ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ భేటీ

ఢిల్లీ పిలుపు!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర మంత్రి సుజనా చౌదరి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తదితరులతో జరిపిన సమావేశానికి కొనసాగింపుగా తాజా పిలుపు వచ్చినట్లు భావిస్తున్నారు. ఇరు పార్టీల మధ్య ఏర్పాటైన సంబంధాన్ని దెబ్బతీసిన కేంద్ర బడ్జెట్ దరిమిలా విభజన సమస్యలు, పెండింగ్ నిధులు, ఇతర ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించడం ద్వారా వివాదం సమసిపోయే విధంగా చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ వివాదం జాతీయ స్థాయిలో ఎన్డీఏకు మచ్చ తెచ్చే విధంగా మారిన నేపథ్యంలో తాజా ఘర్షణకు ఇక ముగింపు పలకాలని దిశగా హస్తిన పెద్దలు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.

ముఖ్యమంత్రి ఆదేశం

ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అందిన వర్తమానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వాగతించినట్లు సమాచారం. శుక్రవారం ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించిన అనంతరం ఈ విషయాన్ని ప్రత్యేకంగా ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ సి.కుటుంబరావు తదితరులతో చర్చించి, అన్ని వివరాలను సిద్ధం చేయాల్సిందిగా ఆదేశించారని తెలిసింది. పర్యవసానంగా కేంద్రాన్ని నిలదీయడంలో కూడా వెనుకాడరాదని నిర్ణయానికి వచ్చిన ముఖ్యమంత్రి అధికారులకు ఢిల్లీలో వ్యవహరించాల్సిన వైఖరి, చర్చించాల్సిన అంశాలకు సంబంధించి నిర్మాణాత్మకంగా వ్యవహరించాలంటూ దిశా నిర్దేశం చేశారు. కాగా ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ప్రభుత్వానికి పిలుపు రావడం తాజా రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

సీఎం అంటే ఇలా ఉండాలి!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంగా వెలువడే ఇన్సైడెన్ ఏరుకున్నవెండుం మద్దుల్లారే పోటియ తలైమురై అనే తమిళ వారపత్రిక.. ఏమి రాసిందో తెలుసా... ఏపీ సీఎం చంద్రబాబు ఫోటోతో కవర్ పేజీని వేసి ముఖ్యమంత్రి అంటే ఇలా ఉండాలి అంటూ పెద్ద వ్యాసం రాసింది. ఇదేదో ఆషామాషీ విషయం కాదండోయ్.. తమిళులు అంత సామాన్యంగా పక్కనున్న వాళ్లను పొగడరు. చంద్రబాబు మన అవకాశాలు తీసుకుని పోతున్నారని కోపం కూడా ఉంటుంది. అయినా అటువంటి విఖ్యాత ముఖ్యమంత్రి అంటే ఇలా ఉండాలంటూ భారీ వ్యాసాన్ని ప్రచురించింది ఆ మ్యాగజైన్.. అందులో చంద్రబాబు ఎంత సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారు.. ఆయన పట్టుదల.. దేశ, విదేశాల నుంచి తీసుకువస్తున్న పెట్టుబడులు.. నూతన రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన అహర్నిశలు కృషి చేస్తున్న వైనం.. చిత్తూరు జిల్లాలో శ్రీసిటీ అభివృద్ధికి ఆయన ఎలా దోహదపడుతున్నది వివరిస్తూ కథనంలో రాశారు. తమిళ నాయకులు చంద్రబాబును చూసి ఏమి నేర్చుకోవాలి.. ఆయనకున్న పట్టుదల, రాత్రింబవళ్లు ఏ విధంగా కష్టపడుతున్నది.. ఇలా నాలుగు పేజీల ఆర్టికల్ రాశారు. దిస్ ఈజ్ హౌ ఏ చీఫ్ మినిస్టర్ హ్యాజ్ టూ బీ అంటూ గ్రోయింగ్ ఆంధ్రా గ్రోయింగ్ ఆంధ్రా అంటూ హెడ్డింగ్ పెట్టి ఈ వ్యాసాన్ని ప్రచురించారు.

నేడు పలు ప్రాజెక్టులు సీఎంచే ప్రారంభం



అమరావతి, ఆంధ్రప్రభ: పర్యాటక రంగానికి, విద్యకు తలమానికం లాంటి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలకు శనివారం తన నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర శాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ తెలియజేశారు. శుక్రవారం ఆయన సీఎం పర్యటన ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం వివరాలను మీడియాకు వెల్లడించారు. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోటప్ప కొండలో టూరిజం కాంప్లెక్స్ను ప్రారంభించడంతోపాటు రూ.7 కోట్లతో ఏర్పాటు చేయనున్న రోప్వే, పార్కు, యాంపి థియేటర్, చెరువు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు సీఎం చేస్తారని తెలిపారు. అలాగే నూతనంగా అభివృద్ధి చేసిన ఎకో టూరిజం పార్కును సందర్శించి, కొండపై వెలసిన త్రికుటేశ్వర స్వామి వారిని చంద్రబాబు దర్శించుకుంటారని చెప్పారు. అనంతరం నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని కాకాని గ్రామంలో 86 ఎకరాల సువిశాల స్థలంలో ఏర్పాటు చేయనున్న ప్రసిద్ధ జెఎన్టీయూ కళాశాల భవనాలకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. అలాగే పెట్లూరి పాలెం నుంచి కోటప్పకొండ వరకు రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న రహదారి పనులకు, దళిత బాలికల గురుకుల పాఠశాల నిర్మాణానికి, నరసరావు పేటలోని స్టేడియం ప్రాంతంలో రూ.12 కోట్లతో నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జిలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం జెఎన్టీయూ వద్ద భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో సభకు తరలి వస్తున్న ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు భారీ భద్రతా, సౌకర్యాలు, మౌలిక వసతులను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

గుంటూరు ఘటనపై విచారణ : కామినేని

అమరావతి, ఆంధ్రప్రభ: అత్యాధునిక వైద్య సౌకర్యా లకు నిలయాలుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతు న్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలియజేశారు. ఇటీవల గుంటూరు జీజీహెచ్లో సెల్ఫోన్ వెలుతురుతో ఆపరేషన్ చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కామినేని మాట్లాడుతూ కార్పొరేట్కు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలను అందిస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల జీజీహెచ్లో కరెంటు పోయిన సమయంలో సెల్ఫోన్ వెలుతురుతో ఆపరేషన్ చేసిన ఘటనపై సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు అందిన వెంటనే తక్షణమే విచారణ చేపట్టమని డీఎమ్ఈని ఆదేశించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయి తనిఖీలతో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని స్వయంగా పరిశీలనకు వచ్చానని తెలిపారు. కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన మహిళకు ఆపరేషన్ చేస్తున్న సమయంలో కరెంటు పోయిందని, దీనితో వైద్యులు అత్యవసర పరిస్థితి కావడంతో అందుబాటులోని సెల్ఫోను వెలుతురుతో ఆపరేషన్ చేసినట్లుగా తెలుస్తోందన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 25 ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయని, సంఘటన జరిగిన ఆపరేషన్ థియేటర్ను రూ.30 లక్షలతో ఆధునీకరించినట్లు తెలిపారు. ఈ థియేటర్కు జనరేటర్ సౌకర్యంతో పాటు రూ.15 లక్షల విలువైన విద్యుత్ లైట్ల సౌకర్యం ఉందన్నారు. అనంతరం ఆయన బాధిత మహిళను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ లక్ష్మీపతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజునాయుడు, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎస్తోనియాతో ఏపీ దోస్తీ

● సాంకేతిక సహకారంలో ముందడుగు: ముఖ్యమంత్రి



అమరావతి ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్లో నాలుగోవంతు భూభాగం ఉన్న ఎస్తోనియా దేశం డిజిటల్ వేదికపై సాధించిన విజయం నవ్యాంధ్రప్రదేశ్కు స్ఫూర్తిగా తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు వచ్చిన బడ్జెట్ సన్నాహక సమావేశంలో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్న ఎస్తోనియా ప్రభుత్వ ప్రతినిధులను ఉన్నతాధికారులకు పరిచయం చేస్తు సాంకేతిక అంశాల్లో ఏపికి సహకరించేందుకు ఈ చిన్నదేశం ముందుకొచ్చిందని చెప్పారు. పాలనా వ్యవహారాల్లో వారు అక్కడ అమలు చేస్తున్న అత్యుత్తమ అభ్యాసాలను నవ్యాంధ్రప్రదేశ్కు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని సీఎం తెలిపారు. రిలయన్స్ జియో, ఎస్తోనియా, ఏపి కలిసి ఒక అవగాహన ఒప్పందం చేసుకోబోతున్నట్లు ప్రకటించారు. అంతకుముందు సీఎంతో భేటీలో ఎస్తోనియా ప్రతినిధుల బృందం 15 ఏళ్ల వ్యవధిలో తమ దేశం సాంకేతికంగా ఎలా అభివృద్ధి చెందింది వివరించారు. డిజిటల్ ప్లాట్ఫారంపై 15 ఏళ్లలో తాము సాధించిన విజయాలకంటే కేవలం మూడున్నరేళ్లలో నవ్యాంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతి తమను మరింత ఆశ్చర్యపరుస్తోందని వారి సందర్భంగా ముఖ్యమంత్రిని ప్రశంసించారు. 13 లక్షల జనాభా, ప్రజల్లో డిజిటల్ వ్యవహారాలపట్ల ఉన్న ఆసక్తి తమకు కలిసొచ్చింది, ఏపిలో ఆ స్థాయిలో అభివృద్ధి చెందేందుకు ముఖ్యంగా ప్రజానీకంలో మార్పు రావాల్సి ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఆధార్, బయోమెట్రిక్, ఇ-గవర్నెన్స్ తరహా విధానాలన్ని తమ దేశంలో ఇంతకుముందే అమలు చేశామని, ప్రభుత్వపాలనా వ్యవస్థమొత్తం ఆన్లైన్ ద్వారా నడిపించిన తొలిదేశం తమదేనని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎస్తోనియా మాజీ సిఐఓ టావీకోట్కా, ఆర్థిక వ్యవహారాల ప్రతినిధి మైలా మస్టోపు , రిలయన్స్ సంస్థ ప్రతినిధులు అనీషా, రాజన్ ఉద్యా, సురభి సంచేటి, కిరణ్థామస్, మాధవరావు, సదాబాబు, మహేష్కుమార్, నిరంజన్ తదితరులు కూడా ఉన్నారు.

అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలు
స్వయం సమృద్ధి సాధించాలి

● ఛైర్మన్లతో భేటీలో సీఎం చంద్రబాబు



అమరావతి ఆంధ్రప్రభ: అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలు స్వయం సమృద్ధిని సాధించుకునేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రభుత్వం ఇందుకు సంబంధించి అన్ని విధాలుగా ప్రోత్సహించనున్నట్లు ప్రకటించారు. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్లు ఇటీవల నవీ ముంబై లోని సిటీ అండ్ ఇండస్ట్రీయల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, అహ్మదాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, పంచకుల, గ్రేటర్ నోయిడా ఇండస్ట్రీయల్ డెవలప్మెంట్ అథారిటీ, జైపూర్ డెవలప్మెంట్ అథారిటీల్లో స్టడీ టూర్ నిర్వహించిన సందర్భంగా పలువురు ఛైర్మన్లు శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అత్యుత్తమ పద్ధతుల్లో అభివృద్ధి పనులు చేపట్టి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో ఆస్తులను మరింతగా పెంచాలని కోరారు. అంతేగాక ప్రతి అథారిటీ ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించుకునేందుకు కృషి చేయాలని కోరారు. ఇందు నిమిత్తం నెల రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని రావాలని ముఖ్యమంత్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్లను కోరారు. ప్రభుత్వం నుంచి ఏ అవసరం కావాలన్నా అదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. పెరుగుతున్న అవసరాలరీత్యా ప్రభుత్వం అర్బన్ డెవలప్ మెంట్ ఆథారిటీలను ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. సాంకేతిక హంగులను అందిపుచ్చుకుని ఛైర్మన్లు ఆయాప్రాంతాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఆయా కార్పొరేషన్ల పరిధిలో తాము అధ్యయనం చేసిన వివరాలను ఛైర్మన్లు ముఖ్యమంత్రికి సోదాహరణంగా వివరించారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి కార్పొరేషన్లు తీసుకుంటున్న చర్యలను పరిశీలించామని ఛైర్మన్లు ముఖ్యమంత్రికి తెలిపారు. కొన్ని ఉత్తమ పద్ధతులను అక్కడ అనుసరించిన విధానాన్ని వారు సిఎంకు వివరించారు. ఈ సమావేశంలో పురపాలకశాఖ మంత్రి పి నారాయణ కూడా పాల్గొన్నారు.

నారాయణరెడ్డి హత్య కేసులో
కేఈ కుమారుడికి అరెస్ట్ వారెంట్

డోన్, ప్రభ న్యూస్: కర్నూలు జిల్లా వైకాపా నేత చెరుకులపాడు నారాయణ రెడ్డి హత్య కేసులో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కేఈ.కృష్ణమూర్తి తనయుడు, హత్యకు గార్డెన్ పత్తికొండ టీడీపీ ఇంఛార్జి కేయి.శ్యాంబాబు, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఎస్సై తులసీ నాగప్రసాద్లపై నారాయరణరెడ్డి భార్య కంగాటి శ్రీదేవి ఫిర్యాదు మేరకు డోన్ మెజిస్ట్రేట్ ఇ.అంజినేయులు ముద్దాయిలుగా చేర్చుతూ శుక్రవారం అరెస్టు వారెంట్ జారి చేసినట్లు తెలిపారు. వివరాలలోకి వెలితే 2017 మే21 పత్తికొండ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకులపాడు నారాయణరెడ్డి (55), ఆయన అనుచరుడు సాంబశివుడు(40)లు దారుణ హత్యకు గురైన సంఘటన క్రిష్ణగిరి మండలంలో చోటుచేసుకుంది.

అప్పట్లో నంద్యాలలో జరిగిన ఒక వివాహ వేడుకలలో పాల్గొని తన వాహనంలో తిరిగి వెల్దుర్తి, కొసనపల్లె గ్రామాలలో జరిగిన వివాహ కార్యక్రమంలో హాజరైయ్యారు. క్రిష్ణగిరి మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో జరిగే వైకాపా నాయకుడి సోదరుడి వివాహ వేడుకకు రెండు వాహనాలలో బయలుదేరారు. తొగర్చేడు హంద్రినీవా సబ్స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు పనులు జరగడంతో వాహనం నెమ్మదిగా పోవాల్సి వచ్చింది. అప్పట్లో కేఈ.శ్యాంబాబు, కప్పట్రాళ్ళ బొజ్జమ్మ, వెల్దుర్తి ఎస్సై తులసీ నాగప్రసాద్ ప్రోత్సాహంతోనే నారాయణరెడ్డి హత్యకు కారణమని నారాయణరెడ్డి భార్య కంగాటి శ్రీదేవి డోన్ కోర్టులో ఫిర్యాదు చేయగా, శుక్రవారం కేఈ.శ్యాంబాబు, కప్పట్రాళ్ళ బొజ్జమ్మ, ఎస్సై తులసీ నాగప్రసాద్లపై డోన్ కోర్టు జడ్జీ అరెస్ట్ వారెంట్ జారీ చేశారు.

నేనొస్తా... అన్నీ ఇస్తా

● ప్రకాశం జిల్లా పాదయాత్రలో ప్రజలకు జగన్ హామీ



ఒంగోలు, ప్రభన్యూస్ బ్యూరో: అధికారంలోకి రాగానే వెనుకబడిన ప్రకాశం జిల్లా సమస్యలన్నీ పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్రెడ్డి అన్నారు. ప్రజాసంకల్పయాత్ర 89వరోజు ప్రకాశం జిల్లాల్లోకి ప్రవేశించింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి పాదయాత్ర ప్రారంభించిన జగన్ 9.20 గంటలకు లింగస ముద్రం మండలం రాళ్లపాడు ప్రాజెక్టు వద్దకు చేరుకోగానే జిల్లానేతలు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. కొత్తపేట దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితుల ఆశీర్వాదంతో జగన్ పాద యాత్రను ప్రారంభించారు. జిల్లాలో తొలుత రాళ్లపాడు ప్రాజెక్టును పరిశీలించారు. ఆయకట్టు రైతులు తమ సమస్యలను జగన్కు వివరించారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల రాళ్లపాడు ప్రాజెక్టులో నీరు ఎండిపోతుందని, సోమశిల ప్రాజెక్టు పూర్త యితేనే, రాళ్లపాడు ప్రాజెక్టుకు నీళ్లు వస్తాయని రైతాంగం జగన్కు చెప్పారు. ఆయకట్టు పరిధిలో కంది, వరి పంట లు పండించే రైతాంగాన్ని జగన్ పలుకరించారు. తాను అధికారంలో వస్తే రాళ్లపాడు ప్రాజెక్టు పరిధిలో రెండు పంటలు పండించేందుకు అవసరమైన నీరు ఇస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేయగానే 1200 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా రామ కృష్ణాపురం వద్ద మొక్కను నాటారు. జగన్ పెంట్రాల, వెంకమల్లవారిపాలెం, లింగసముద్రం, బలిజపాలెం, రామకృష్ణాపురం వరకు పాదయాత్ర కొనసాగించారు. మధ్యలో పార్టీ జెండా ఆవిష్కరణలు చేస్తూ మహిళలను పలకరిస్తూ ఉత్సాహంగా ముందుకుసాగారు. వికలాంగులు, కల్లుగీత కార్మికులు, వడ్రంగి పనివారితో సంభాషించారు. వారి జీవనోపాధి ఎలా ఉంది ? ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో ప్రశ్నించారు.

లింగసము ద్రంలో వికలాంగులు తమ పింఛన్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఉపయోగంలేదని, వడ్రంగి పనిచేస్తున్న ఓ కార్మికుని వద్దకు వెళ్లి జగన్ ప్రశ్నించగా, తనకు బ్యాంకు రుణం రాలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలోనూ మహిళలు పెద్ద సంఖ్యలో జగన్ను చూడటా నికి ఆసక్తి చూపారు. పలుచోట్ల ప్రజలు నెత్తిమీద ముద్దాడుతూ పంపారు. చాలా మంది సమస్యలు చెప్పుకున్నా... నేను అధికారంలోకి వస్తా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని, నవరత్నాల ద్వారా ఎంతో మేలు జరుగుతుందని చెబుతూ పాదయాత్ర కొనసాగించారు. పాదయాత్రలో జగన్ వెంట ఎంపీలు వైవీసుబ్బారెడ్డి, రాజమోహన్రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, శాసనసభ్యులు ఆదిమూలపు సురేష్, జంకె వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

పెన్నా కేసులో జగన్కు ఈడి సమన్లు

మార్చి 16 న హాజరు కావాలని ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అక్రమాస్తుల కేసుల విచారణలో భాగంగా వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డికి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడి) ప్రత్యేక కోర్టు శుక్రవారం సమన్లను జారీ చేసింది. మార్చి 16 వ తేదీన కోర్టుకు హాజరు కావాలని కోర్టు తన ఆదేశాలలో పేర్కొంది. జగన్తో పాటు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, పెన్నా గ్రూప్ అధినేత ప్రతాప్రెడ్డి తదితరులకు కోర్టు సమన్లను జారీ చేసింది.

కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతాం

● విభజన హామీలు సాధిస్తాం ● మంత్రి కాల్వ శ్రీనివాసులు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వ మెడలు వంచైనా విభజన హామీ లు సాధిస్తామని సమాచార గృహ నిర్మాణ శాఖా మంత్రి కాల్వ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సాయంత్రం సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కాల్వ మాట్లాడుతూ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్రం చేస్తున్న జాప్యాన్ని ప్రపంచానికి, ప్రజలకు చెప్పాం, రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ముందుకు వెళతాం, రాజీలేని పోరాటం సాగిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి బడ్జెట్లో సరైన కేటాయింపులు చేయలేదని బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసింది తెలుగుదేశం పార్టీయేనన్నారు. రాష్ట్రం హక్కుగా రావాల్సిన సహాయ సహకారాలు అందించడంలో కేంద్రం తీవ్ర అలసత్వం వహిస్తోందని ఆరోపించారు. 'రెక్కలు విరిచి ఎగుర మంటే ఏవిధంగా ఎగురుతారని' ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలోనే బడ్జెట్ కేటాయింపులపై తన అసంతృప్తిని వ్యక్తం చేయడం విదితమేనన్నారు. విపక్షనేత జగన్ టీడీపీ ఎంపీలతో రాజీనామా చేయించి మాతోపాటు కలిసి పోరాటం చేయండని పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సీబీఐ కేసుల్లో నిందితుడిగా ఉండి ఆర్థిక నేరస్థుడి గా ముద్ర పడిన జగన్తో తెలుగు ప్రజల ప్రయోజ నాలే పరమావధిగా ఉన్న టీడీపీని కలవమని చెప్ప డం నవ్వాలో ఏడవాలో అర్థంకావడంలేదన్నారు.

బాధ్యతా రహితంగా వైకాపా

రాష్ట్ర ప్రయోజనాల బాధ్యతను ప్రతిపక్ష వైకాపా విస్మరించి కుట్రలు, కుతంత్రాలకు తెరలేపడం దుర దృష్టకరమన్నారు. రాష్ట్ర సమస్యలపై జగన్ కేంద్రం తో ఇప్పటి వరకు పోరాడిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల సమయంలో హోదాపై ప్రశ్నించకుండా జగన్ మద్దతు ఎందుకు ప్రకటించారని నిలదీశారు. హామీలు నెరవేర్చలేదని ఢిల్లీలో పోరాటం చేయాలన్నారు. కువిమర్శలు రాజ కీయ కుట్రలతో ప్రతిపక్షం హోదాను తాకట్టు పెట్టిం దని ధ్వజమెత్తారు. వైకాపా ఎంపీలు ఎప్పుడో రాజీనా మాలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకూ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాజ్యసభలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి రాష్ట్ర సమస్యలపై ఎందుకు ప్రశ్నిం చలేదన్నారు. విపక్ష వైకాపా బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

పవన్ విజ్ఞప్తులను స్వాగతిస్తాం

పవన్ కళ్యాణ్ నిజాయితీగా నిజనిజాలను విశ్లే షిస్తే స్వాగతిస్తామన్నారు. ఇప్పటి వరకు పవన్ కళ్యాణ్ నుంచి తమకు లిఖితపూర్వక విజ్ఞప్తులు రాలేద న్నారు. ప్రభుత్వం వద్ద ఎలాంటి దాపరికంలేదనీ, ఎలాంటి సమాచారం కావాలన్నా సమాచారశాఖ మంత్రిగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ విభజన హామీలు, రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్సింగ్ చేసిన ప్రకటనలు ఏరకంగా అమలవుతున్నాయనే విషయంపై పవన్కు వివరాలు పంపడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం కావాలన్నా పవన్కళ్యాణ్కు ఇచ్చేం దుకు సుముఖంగా ఉన్నట్లు మంత్రి వెల్లడించారు.

నకిలీ సర్టిఫికెట్లతో లెక్చరర్ ఉద్యోగాలు

అమరావతి, ఆంధ్రప్రభ: నకిలీ సర్టిఫికెట్లతో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్కు టోకరా వేసిన ఘన కార్యమొకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. విజిలెన్స్ దర్యాప్తులో ఇందుకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయంటున్నారు. వివరాల్లోకి వెళితే ఓ ఇద్దరు వ్యక్తులు అయిదేళ్లక్రితం ఏపీపీఎస్సీ ద్వారా లెక్చరర్ ఉద్యోగాలు పొందినట్లు సమాచారం. ఆ ఇరువురు ఆ ఉద్యోగాల ఎంపిక సమయంలో నకిలీ సర్టిఫికెట్లు ఏపీపీఎస్సీ అధికారులకు ఇచ్చినట్లు సమా చారం. దీంతో ఏపీపీఎస్సీ అధికారులు కూడా అవేవి పట్టించుకోకుండానే వారి ద్దరి కీ ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిసింది. వారిద్దరూ ఉద్యోగాలు పొంది , అయిదే ళ్లుగా జీతం రూపంలో లక్షలాది రూపాయలు డ్రా చేస్తున్నా ఎవరూ గుర్తించలేక పోవడం గమనార్హం. పీహెచ్డీ కంప్యూటర్ సైన్స్ చదవకుండానే మగధ యూని వర్శిటీ నుంచి నకిలీ పత్రాలు సమర్పించి ప్రభుత్వ కళాశాలల్లో లెక్చరర్ కొలువులు పొందినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఇలా కొలువులు పొందిన ఇద్దరిలో ఒకరు మొవ్వ డిగ్రీ కళాశాలలోను, మరొకరు విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాలలోపని చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు లోతుగా విచారించడంతో ఈ వ్యవహారం గుట్టురట్టయింది. వీరిద్దరూ గత అయిదేళ్లుగా ఎటువంటి డోకా లేకుండా లక్షలాది రూపాయలను జీతం రూపంలో డ్రా చేశారు. దాదాపు రూ.40 లక్షల వరకు వేతనం పొందినట్లు తెలిసింది. ఈ విషయమై విజి లెన్స్ అధికారులు ఈ ఇద్దరిపై చర్యకు ప్రభుత్వానికి నివేదించారు. వారిద్దర్ని ఉద్యో గాల నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి సిఫార్స్ చేసినట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు వ్యక్తులు 2011- 12 బ్యాచ్కు చెందిన వారంటున్నారు.

జగన్ వెంట జైలుకు వెళ్లాలా?

● వాక్ విత్ జగన్ అంటే అదేనా : మంత్రి సోమిరెడ్డి

తిరుపతి, ప్రభన్యూస్ బ్యూరో: ఆర్థిక నేరాల కేసుల ఊబిలో చిక్కుకుపోయిన జగన్తో కలిసి నడవాలని ఆ పార్టీ వారు ఇస్తున్న పిలుపును చూస్తే వెంట నడిచేవారందరినీ జైలుకు తీసుకువెళ్తారనే సందేహం కలుగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11 ఆర్థికపరమైన నేరాలకు సంబంధించి దాఖలైన 14 చార్జిషీట్లలో నిందితుడుగా ఉన్న వైకాపా అధినేత జగన్ వంటి రాజకీయ నాయకుడు ప్రపంచ రాజకీయ చరిత్రలో మరెక్కడా ఉండబోరన్నారు. ఇందులో అటు యుపీఏ హయాంలో, ఇటు ఎన్డీయే హయాంలో నమోదైన 11 సీబీఐ కేసులు, 14 ఈడీ కేసులున్నాయని పేర్కొంటూ తరచుగా ఆయన ఆస్తుల జప్తులు, సీజ్ జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇటువంటి ఘన చరిత్ర ఉన్న జగన్ తన అధికార దాహానికి రాష్ట్రప్రయోజనాలను కూడా తాకట్టు పెట్టడానికి సిద్ధమవుతునారన్నారు. అలాంటి జగన్ కు తోడుగా రమ్మని పిలుస్తూ వైకాపా నాయకులు వాక్ విత్ జగన్ అని పిలుపునివ్వడాన్ని మంత్రి సోమిరెడ్డి ఎద్దేవా చేస్తూ ఆయన వెంట వెళ్తే జైలుకు తీసుకెళ్తారనే అర్థం వచ్చేలా వేర్ విత్ జగన్(జగన్ తో ఎక్కడికి) అని మార్చుకుంటే సరిపోతుందని సూచించారు. వచ్చే మార్చి 5న తెలుగుదేశం పార్టీ ఎంపీలందరూ రాజీనామాలు చేస్తారన్న రాష్ట్రమంత్రి ఆదినారాయణరెడ్డి ప్రకటన గురించి ప్రశ్నిస్తూ ఆ విషయాన్ని ఆయన్నే అడగాలని చెప్పి తప్పించుకున్నారు. రాష్ట్రప్రభుత్వం కేంద్రం ఇప్పటివరకు ఇచ్చిన నిధుల లెక్కలు చెప్పాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేస్తున్న డిమాండ్ గురించి ప్రస్తావించగా ఆన్ లైన్ గురించి పూర్తి అవగాహన ఉన్న సహచరుల ద్వారా ఆ వివరాలన్నీ తెలుసుకునే అవకాశం పవన్ కళ్యాణ్కు ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్న తిరుపతి శాసన సభ్యురాలు ఎం సుగుణమ్మ మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా కేంద్రంతో పోరాడుతున్న చంద్రబాబుకు, క్విడ్ ప్రోకో కేసుల్లో నుంచి బయటపడేందుకు నాటకాలాడుతున్న జగన్ కు ఉన్న తేడాను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తెలుగుదేశం నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్, పుష్పావతి, బుల్లెట్ రమణ, డాక్టర్ సుధారాణి, గుణశేఖర్ నాయుడు, శ్రీనివాసులు కూడా పాల్గొన్నారు.



జగన్తో జత కట్టడమా.. సిగ్గుచేటు : మంత్రి నక్కా ఆనందబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా కోసం మాతో జత కట్టాలని విపక్షనేత జగన్ పిలుపునివ్వడం సిగ్గుచేటని సాంఘిక సంక్షేమ శాఖామంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. సచివాలయంలో శుక్రవారం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ పత్రికల్లో ఒక పేజీలో ఎంపీలు రాజీనామాలు చేయాలని, మరో పేజీలో సీబీఐ కేసుల్లో జగన్కు నోటీసులని ప్రచురించారని మరి ఎటువెళ్లాలని ఎద్దేవా చేశారు. జగన్ 16 నెలల జైలు అనుభవం ఉందని బెయిల్పై జైలు నుంచి బయటకు వచ్చారని సెటైర్ విసిరారు. మచ్చలేని మహానాయకుడు చంద్రబాబు, ఆర్థిక నేరస్థుడు జగన్ వెంట నడవటమా అని ప్రశ్నించారు. ప్రత్యేక హోదాకు, ప్యాకేజీకి తేడాలేదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్జైట్లీ ప్రకటించిన విధంగా హోదాకు ధీటుగా ఇచ్చిన ప్యాకేజీని అమలు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. టీడీపీ ఒత్తిడి కారణంగా కేంద్రం మార్చి 5 నాటికి హామీలు నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కడప స్టీల్ ప్లాంట్పై మెకాన్ నివేదిక

● ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై నివేదికలో పలు సూచనలు

● రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొస్తే ఏర్పాటుకు అవకాశాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో స్టీల్ ప్లాంట్లు నెలకొల్పడంపై మెకాన్ సంస్థ తమ ముసాయిదా నివేదికను కేంద్రానికి అందజేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కడప వద్ద, తెలంగాణ రాష్ట్రంలోని బయ్యారం వద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ రెండు స్టీల్ ప్లాంట్ల ఏర్పాటు కోసం తొలుత అధ్యయనం చేసిన కమిటీలు ఫీజిబిలిటీ లేదు అని నివేదికలిచ్చాయి. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి తగ్గట్టు నాణ్యమైన ఖనిజం లేకపోవడం సహా పలు ఇతర కారణాలను ఇందులో ప్రస్తావించారు. అయితే రెండు రాష్ట్రాలూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటూ కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్లో తాజాగా జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో కడప స్టీల్ ప్లాంట్ భావోద్వేగపూరిత అంశంగా మారింది. ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ సాధ్యపడని పరిస్థితుల్లో స్పాంజ్ ఐరన్ ప్లాంట్ లేదా రీసైకిలింగ్ స్టీల్ ప్లాంట్ వంటి ప్రత్యామ్నాయాలపైనా కేంద్రం దృష్టి పెట్టింది. మరోవైపు ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి వీలుకాకుండా చేస్తున్న పరిస్థితులు, వాటిని సరిదిద్దే అంశం గురించి కూడా చర్చ జరిగింది. ఈ దశలో తెలంగాణ రాష్ట్రానికి ఆనుకుని ఉన్న చత్తీస్ఘడ్ బైలడిల్ల ఇనుప ఖనిజం గనుల్లో నాణ్యమైన ముడి ఖనిజం లభిస్తుంది కాబట్టి, బయ్యారం స్టీల్ ప్లాంటు కోసం ఈ ఖనిజాన్ని కేటాయించి ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తద్వారా అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని సూచించింది. దాదాపు ఇదే రీతిలో ఆంధ్రప్రదేశ్ సర్కారు స్పందించింది. దీంతో కేంద్రం మెకాన్ సంస్థతో కూలంకశంగా అధ్యయనం చేయించాలని నిర్ణయించింది. దీంతో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయా లంటే ఏమేం చేయాలన్న విషయాలపై మెకాన్ సంస్థ అధ్యయనం చేసింది. ఆ మేరకు కేంద్రానికి ముసాయిదా నివేదికను అందజేసింది. ఈ నివేదికలో సూచించిన అంశాలపై కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలతో చర్చించి, తదుపరి నిర?యం తీసుకోనుంది. ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏయే సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందో ఈ నివేదికలో పేర్కొన్నట్టు తెలుస్తోంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 17 ఫిబ్రవరి 2018

మాల్యా సరసన నీరవ్!

దేశంలో రెండో అతి పెద్ద బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకును బురిడీ కొట్టించిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ అందరికళ్ళ ముందే విదేశాలకు జారుకున్న తీరు విజయ్ మాల్యా, లలిత్ మోడీ పరారీ ఉదంతాలను గుర్తుకు తెస్తోంది. మాల్యా, లలిత్‌లకు రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలుండేవి. క్రికెట్ పోటీల పేరిట రాజకీయ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో ఫోటోలు దిగడం, ప్రారంభోత్సవాలకు హాజరు కావడంతో సెలబ్రిటీలుగా గుర్తింపు పొందారు. నీరవ్ వ్యాపారానికే పరిమితమైన వ్యక్తి. అయినప్పటికీ, 11 వేల కోట్లు పైగా పిఎన్‌బి నుంచి రుణాలు ఎలా సంపాదించాడన్నది అంతుచిక్కని విషయమే. ద్వితీయ శ్రేణి అధికారులు, దిగువసిబ్బందిని మంచి చేసుకుని ఆయన ఈ పెద్ద మొత్తాన్ని చేజిక్కించుకున్నట్టు దర్యాప్తు సంస్థల అధికారులు అందిస్తున్న సమాచారం సంతృప్తికరంగా లేదు. ఈ కుంభకోణం వెనక ఇంకా చాలా మంది ఉండి ఉంటారనీ, ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతోనే వారు ఈ మోసానికి పాల్పడి ఉంటారని ప్రజలు అనుమానిస్తున్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, చిట్ ఫండ్ సంస్థల మోసాలకు విలవిల్లాడుతున్న మధ్యతరగతి వర్గాల కష్టార్జితానికి ఇంతవరకూ భరోసా ఇస్తున్న బ్యాంకులకే ఇంతపెద్ద మొత్తంలో టోపీ పెట్టే ఘనులు తయారైన ఉదంతాలు సామాన్యుల నమ్మకాన్ని చెదర గొడుతున్నాయి. రైతులు రుణాల కోసం కాళ్లు అరిగేలా తిరిగినా కనికరించని బ్యాంకులు బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలకు ఇంత పెద్ద మొత్తాల్లో రుణాలు ఎలా ఇస్తున్నాయన్న ప్రశ్న సహేతుకమైనదే. ఇంతకీ ఇంత పెద్ద కుంభకోణానికి దిగువ స్థాయి ఉద్యోగులు ఇద్దరు మాత్రమే బాధ్యులను చేయడ మంటే మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమే. నీరవ్ మోడీకి చెందిన ఐదువేల పైగా కోట్ల రూపాయిల ఆస్తులనూ, వజ్రాలనూ స్వాధీనం చేసుకున్నామని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. బ్యాంకుల మొండి బకాయిల గురించి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ మధ్యనే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రస్తావించారు. బ్యాంకుల మూల ధనాన్ని పెంచేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యల గురించి ఆర్థికమంత్రి జైట్లీ సోదాహరణగా వివరించారు. ఇవన్నీ సామాన్యులకు బ్యాంకులు మళ్ళీ పూర్వపు వైభవంతో పనిచేస్తాయన్న నమ్మకం కలిగించే ప్రకటనలే. యూపీఏ హయాంలో బ్యాంకింగ్ వ్యవస్థ చెదలు పట్టి పోయిందని చెప్పిన ప్రధానమంత్రి మోడీ తన హయాంలో ఇంత పెద్ద కుంభకోణం వెలుగు చూడటంపై ఎలా స్పందిస్తారో చూడాలి. దీనికి కూడా యూపీఏ హయాంలోనే బీజాలు పడ్డాయని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఎదురు దాడి చేస్తున్నారు. అది అసత్యం కాకపోవచ్చు కానీ, యూపీఏ హయాంలో జరిగిన అక్రమాలను సరిదిద్దుతున్నట్టు అదే పనిగా ప్రధాని, మంత్రులూ ఒక వంక హోరెత్తిస్తున్న తరుణంలో ఈ కుంభకోణం వెలుగులోకి రావడం, ప్రధాన సూత్రధారి చల్లగా విదేశాలకు జారుకోవడం విడ్డూరమే. కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా జరిగే బ్యాంకింగ్ లావాదేవీలను పిఎన్‌బి సిబ్బంది కోడ్‌ల ఆధారంగా ఎలా నిర్వహించారో నిగ్గు తేలాలి. అదికూడా ప్రధాన బ్యాంకుల లావాదేవీలపై రిజర్వు బ్యాంకు కన్నేసి ఉంచినా ఈ మోసం జరిగిందంటే, కేంద్రబ్యాంకు సమర్థతపై అనుమానాలు రేకెత్తే ప్రమాదం ఉంది. పెద్ద నోట్ల రద్దు పర్యవసానంగా దేశంలోని బ్యాంకుల్లో నగదు నిల్వలు చాలినన్ని లేకపోవడంతో ఎటిఎంల వద్ద మళ్ళీ నోకేష్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బ్యాంకుల్లో నగదు నిండుకుందనీ, తక్షణం ఐదువేల కోట్ల రూపాయిలను పంపమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి ఈ మధ్యనే లేఖ రాశారు. దాచుకున్న డబ్బును వాపస్ తీసుకోవడానికి ఖాతాదారులు ఒక వంక నానా అగచాట్లు పడుతుండగా, ఘరానా మోసగాళ్ళు వేల కోట్ల రూపాయలను బ్యాంకుల నుంచి ఎలా పొందుతున్నారన్నది అంతుచిక్కని విషయమే. నీరవ్ మోడీ రాజకీయ సంబంధాల గురించి సమాచారం ఎక్కువ పొక్కకపోయినా, ఆయన 2013 నుంచి ఫోర్బ్స్ ఏటా ప్రకటించే కుబేరుల జాబితాలో స్థానాన్ని పొందుతూనే ఉన్నాడు. ఆయన ఆర్థిక కార్యకలాపాలపై రిజర్వు బ్యాంకు నిఘా వేసిందట. అయినా ఎలా తప్పించుకోగలిగాడు. నీరబ్, లలిత్ మోడీలు, మాల్యాలూ తామేమీ తప్పు చేయలేదనీ గడువు ఇస్తే బ్యాంకులకు చెల్లించాల్సిన సొమ్ము చెల్లిస్తామని ప్రకటిస్తారు. అలాంటి ప్రయత్నాలు చేయడం ద్వారా ఎంతో కొంత సొమ్మును రాబట్టడం తెలివైన పని అవుతుంది తప్ప, వారి గురించి అదే పనిగా ప్రకటనలు చేయడం వల్ల మరో హర్షద్ మెహతాగా పేరు మోస్తారే తప్ప జనానికి ఒరిగేదేమీ ఉండదు. విదేశాల్లో తలదాచుకున్న ఆర్థిక నేరస్థులను స్వదేశానికి రప్పించడంలో, విదేశీ బ్యాంకుల్లోని వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడంలో ఆనాడు యూపీఏ ప్రభుత్వం బాటలోనే ఇప్పటి ఎన్‌డిఏ ప్రభుత్వం విఫలమవుతోంది. బోఫోర్స్ సూత్రధారి ఖత్రోచీని రప్పించడంలో, అతడి ఖాతాలను సీజ్ చేయడంలో యూపీఏ విఫలమైనప్పుడు తాము అధికారంలో ఉండి ఉంటే తాడోపేడో తేల్చేసే వాళ్ళమని కమలనాథులు తరచూ ప్రకటనలు చేసిన విషయం ఇప్పటికీ గుర్తుంది. తమది అవినీతి మరక అంటని ప్రభుత్వమని మోడీ పదే పదే చెప్పుకుంటున్నా, ఇలాంటి కుంభకోణాలు వెలుగుచూసినప్పుడు ఆయన పాలనలోనూ అవినీతి రాజ్యమేలుతోందని స్పష్టం అవుతోంది.

త్రిపుర తీర్పు ఎటు!





కమలమా.. అరుణమా!

ఈశాన్య రాష్ట్రం త్రిపుర శాసనసభకు ఈ నెల 18న ఎన్నికలు జరుగుతాయి. 60 స్థానాలున్న ఈ శాసన సభలో ప్రస్తుతం సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉంది. దీన్ని గద్దె దించి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడానికి బిజెపి - సంఘ పరివారం ఇప్పుడు శక్తియుక్తులన్నింటినీ కేంద్రీకరించి పోరాడుతోంది. త్రిపుర జనాభాలో 69 శాతం బెంగాలీలు. 31 శాతం వివిధ తెగల ఆదివాసీలు. షెడ్యూల్డు తెగలకు రిజర్వు చేసిన 20 స్థానాల్లో ఎప్పుడూ కమ్యూనిస్టులదే ఆధిపత్యం. స్వర్గీయ దశరథదేవ్, బీరేన్ దత్తా వంటి కమ్యూనిస్టు యోధాన యోధులు 1940లో గణశిక్షా పరిషత్‌ను స్థాపించినప్పటి నుండి ఆదివాసీల్లో అక్షరాస్యతను పెంపొందించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారు. ఈ కారణంగానే త్రిపుర ఆదివాసీలు ఎర్రజెండాను వీడలేదు. 1982లో ఏర్పడిన తొలి వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం ఆదివాసీల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకై టిటిఎఎడిసి ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను అమలుచేసింది. గత 20 ఏళ్ళుగా త్రిపుర ముఖ్యమంత్రిగా మాణిక్ సర్కార్ వ్యవహరిస్తున్నారు. ఆయన దేశంలోనే అతిపేద ముఖ్య మంత్రిగానూ, అత్యంత నిజాయితీ పరుడిగానూ పేరుపొందారు. త్యాగధనుడిగా, నిరాడంబరునిగా కీర్తికెక్కారు. అయినా ప్రధాని మోడీ, ఇతర బీజేపీ - సంఘ పరివార నేతలు మాణిక్ సర్కార్‌పై దుష్ప్రచారం కొనసాగిసున్నారు. 2 దశాబ్దాల పాటు తప్పుడు మాణిక్యాన్ని విశ్వసించిన త్రిపుర ప్రజలు ఈసారి నిజమైన హిరా (హైవే, ఐవే, రోడ్ వే, ఏర్ వే) వజ్రాన్ని ఎంపిక చేసుకోవాలని, ప్రధాని మోడీ వివిధ ఎన్నికల ప్రచార సభల్లో కోరారు. మాణిక్ సర్కార్ పేరు ప్రస్తావించకుండానే అవినీతిని, పాలనా వైఫల్యాలను నిజాయితీ ముసుగులో కప్పిపుచ్చుకున్న ముఖ్యమంత్రినీ ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈసారి మార్పు, అభివృద్ధి కోసం తీర్పివ్వాలని కోరుతున్నారు. ఇది దుష్పరిపాలన సాగిస్తున్న వామపక్ష ఫ్రంట్‌కు -బిజెపి మధ్య పోరుకాదని, మార్పు కోరుతున్న త్రిపుర ప్రజలు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరనీ పేర్కొంటున్నారు. 25 ఏళ్ళుగా కట్టుకథలు చెబుతూ, అసత్యాలు వినిపిస్తూ వైఫల్యాలు, నేరాలు, అవినీతితో సామాన్యుల జీవితాలను వామపక్ష ఫ్రంట్ దుర్భరం చేసిందనీ, కాషాయ కూటమిని గెలిపిస్తే త్రిపుర ప్రజల జీవితాలలో వెలుగులు నింపుతామనీ మోడీ నమ్మకంగా చెబుతున్నారు. త్రిపుర రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసిన అప్పటి రాజు వీర విక్రమ్‌కు నివాళులర్పించడం ద్వారా సంస్థానాధీశులపై తన భక్తిని చాటారు. 2013 శాసనసభ ఎన్నికల్లో కేవలం 1.54 శాతం ఓట్లు మాత్రమే సాధించిన బిజెపి 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని 5.7 శాతానికి, 2015 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని 14.24 శాతానికి పెంచుకుని, క్రమేణా బలపడుతూ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌ను ఆవలికి నెట్టి ఇప్పుడు కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలు చేసి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడానికి వ్యూహరచన చేస్తోంది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాలీల ప్రాబల్యం అధికంగా ఉండే 19 స్థానాల్లో సిపిఎం ఆధిక్యత 4 వేల కంటే తక్కువ. ఇప్పుడు ఆ స్థానాలను దక్కించుకోవడానికి కమలనాథులు చేయవలసిందంతా చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, డబ్బు, పదవులు ఎరవేసి ప్రత్యర్థి పార్టీలను ఎన్నికలకు ముందే నీరుగార్చి వారి స్థానాన్ని ఆక్రమిస్తున్నారు. అస్సాం, మణిపూర్ లలో బిజెపి ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర వహించిన అస్సాం ఆర్థికమంత్రి హిమంత బిశ్వశర్మనూ బిజెపి ఇప్పుడు త్రిపుర ఎన్నికల ఇన్‌ఛార్జిగా నియమించింది. కాంగ్రెస్ గుట్టుమట్లు తెలిసిన మాజీ కాంగ్రెస్ నేత హిమంత శర్మ 5 సార్లు అగర్తల ఎంఎల్ఏగా గెలిచిన సుదీప్ రాయ్ బర్మన్ సహా 8 మంది ప్రముఖ త్రిపుర కాంగ్రెస్ నేతలను కమలం పార్టీలో చేర్చుకోవడం ద్వారా కాంగ్రెస్‌ను బలహీనపరచారు. పటిష్టమైన సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల బలగం దండీగా ఉన్న సిపిఎంను ఎదుర్కోవడానికి సంఘ పరివారం మూడేళ్ళ ముందునుండే 60 అసెంబ్లీ స్థానాల్లో ఇంటింటికీ తన కార్యకర్తలను పంపి కరపత్రాలు, సమావేశాల ద్వారా వామపక్ష ఫ్రంట్ దుష్పరిపాలన నుండి విముక్తికి, మార్పుకోసం ఓటేయాలని ప్రచారాన్ని సాగించింది. మోడీ ప్రభుత్వం, బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా త్రిపుర ఇన్‌ఛార్జి హిమాత బిశ్వశర్మకు అవసరమైన వనరులిచ్చి, ఎప్పుడు కావాలంటే అప్పుడు త్రిపుర వెళ్ళడానికి గౌహతిలో ఆయన ఆధీనంలో అద్దె విమానాన్ని సిద్ధంగా ఉంచింది. 2013 ఎన్నికల్లో బిజెపి 50 స్థానాలకు పోటీచేసి 49 సీట్లలో ధరావతులు కోల్పోయింది. త్రిపుర జనాభా 36 లక్షలు కాగా బిజెపి 2 లక్షల కార్యకర్తల బలగముంది. 35 వేల మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రస్తుతం ప్రచారంలో నిమగ్నమై సిఎం మాణిక్ సర్కార్‌పై వ్యక్తిగత నిందా ప్రచారం సాగించడాన్ని అభ్యుదయవాదులు సహించలేకపోతున్నారు. మాణిక్ సర్కార్ బ్యాంకు ఖాతాలో ఉన్నది కేవలం రూ.3 వేలే. సిఎం గా తనకు అందే వేతన, భత్యాలను సిపిఎంకు విరాళమిచ్చి పార్టీ ఇచ్చే రూ.10 వేల అలవెన్సుతో నిరాడంబర జీవితం గడుపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి రిటైరైన మాణిక్ సర్కార్ భార్య ఆర్భాటాలకు పోకుండా సామాన్యుల వలే సాదా సీదాగా సైకిలు రిక్షాలో తిరుగుతుంటారు. మాణిక్ సర్కార్ తన అధికార వాహనాన్ని ప్రచారానికి వాడుకోవడం లేదు. తనపై బిజెపి వ్యక్తిగత నిందా ప్రచారం చేయడాన్ని ప్రస్తావిస్తూ అది ఆ పార్టీ బలహీనతకు నిదర్శనమని, ప్రజలకు నిజమేమిటో తెలుసనీ, వారు ఎన్నికల్లో తగు తీర్పు చెబుతారనీ సిఎం మాణిక్ సర్కార్ అంటున్నారు. ఎవరెన్ని దుష్ప్రచారాలు చేసినా వామపక్ష ఫ్రంట్ త్రిపురలో 8వ దఫా గెలవడం ఖాయమని మాణిక్ సర్కార్ అన్నారు. ఆదివాసీల తిరుగుబాట్లతో అతలాకుతలమైన త్రిపురలో శాంతిని నెలకొల్పామని ఆయన అంటున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కుల, మత, విద్వేషాలను రెచ్చగొట్టి జన విభజన ద్వారా శాంతిభద్రతలకు భంగం కల్గిస్తున్నారని, కమలనాథుల కుతంత్రాలపై అప్రమత్తంగా ఉండాలనీ మాణిక్ సర్కార్ ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో బిజెపి 51 స్థానాలకు, మిత్రపక్షం ఇండి జెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎస్‌టి) 9 స్థానాలకు పోటీచేస్తుండగా సిపిఎం 57, సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పి చెరోస్థానానికి పోటీ చేస్తున్నాయి. మొత్తం 297 మంది అభ్యర్థులు 60 స్థానాలకు పోటీలో ఉన్నారు వారిలో 20 మందే మహిళలు. పోటీలో ఉన్నవారిలో 35 మంది కోటీశ్వరులు. వారిలో 18 మంది కోటీశ్వరులు బిజెపికీ, 9 మంది కాంగ్రెస్, నలుగురు సిపిఎం, ఐఎన్‌పిటి ఇద్దరు, ఐపిఎస్‌టి, ఎఐటిసికీ చెందిన వారు. వామపక్ష అభ్యర్థులలో 10 మంది కొత్తవారు 51 మంది బిజెపి అభ్యర్థుల సగటు ఆస్తులు రూ.1.35 కోట్లు, 59 మంది కాంగ్రెస్ అభ్యర్థుల సగటు ఆస్తి రూ.53.16 లక్షలు కాగా 57 మంది సిపిఎం అభ్యర్థుల ఆస్తుల సగటు విలువ రూ.39.91 లక్షలు.

సిపిఎం 2013 ఎన్నికల్లో 60 స్థానాలకు గాను 49 సీట్లు గెలిచి, 48 శాతం ఓట్లు తెచ్చుకోగా, కాంగ్రెస్‌కు 10 సీట్లు, 37 శాతం ఓట్లు, ఇతరులకు 1 సీటు 15 శాతం ఓట్లు వచ్చాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో సిపిఎం 2 సీట్లు గెలవగా ఓట్లు 65 శాతానికి పెరిగాయి. కాంగ్రెస్‌కు కేవలం 20 శాతం ఓట్లే వచ్చాయి. బిజెపి ఇప్పుడు కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేసి త్రిపురలో విజయభేరి మోగించాలని ఉవ్విళ్ళూరుతోంది.


మోడీ ప్రభుత్వం తూర్పు వైపు చూపు. ఆసియన్ దేశాలతో ఆర్థిక, వాణిజ్య, రవాణా సంబంధాలు పెంపొందించుకోవాలనే ప్రయత్నాలలో సరిహద్దు రాష్ట్రం త్రిపుర భూమార్గంగా కీలక పాత్రవహిస్తుంది. అందువల్ల అఖిల భారత వైద్య శాస్త్రాల సంస్థను పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగాన్ని రూపుమాపి, త్రిపుర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని ప్రధాని మోడీ సహా కమలనేతల హామీలిస్తున్నారు. కేంద్రంపైనే నిధులపై అధికంగా ఆధారపడుతున్నందువల్ల, ప్రజలు కమల వికాసానికి తోడ్పడుతారో, యధావిధిగా అరుణ పతాక నీడన కొనసాగుతారో 18న తేల నుంది.

◆ పతకమూరు దామోదర్ ప్రసాద్,
9440990381

తమిళనాట కా..వేడి

భూగోళంలో మూడో వంతు నీళ్ళుంటే...ఒక్క వంతు మాత్రమే భూమి. అక్కరకొచ్చేది తక్కువే. నదీనదాలే సమస్త మానవాళి జీవనానికీ ఆధారం, తాగేందు కయినా.. వ్యవసాయానికైనా..పారిశుద్ధ్య కార్యక్రమాలకైనా నీరు కావాల్సిందే. అలాంటి నీటిని ఎంత జాగ్రత్తగా వాడుకోవాలి. ఉన్నది సక్రమంగా పంచుకోవాలి. అందరికీ అందేలా చూసుకోవడమే కాక, భవిష్యత్తరాలకూ ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. గుక్కెడు నీటికోసం కిలోమీటర్ల కొద్దీ నడుచుకెళ్ళే దృశ్యాలు ఇప్పటికీ మనకు నిత్యం గోచరిస్తూనే ఉంటాయి. జలవివాదాల కారణంగా అక్కడక్కడా ఘర్షణలూ తప్పటం లేదు. గతంలో వ్యక్తులకే పరిమితమైన ఈ సంఘర్షణ రాష్ట్రాల నడుమా తలెత్తుతోంది. చైనాకూ-మనకూ బ్రహ్మ పుత్ర నదీజలాల వివాదం ఉండనే ఉంది. గోదావరి జలాలతో మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ తగవులాడుకున్నాయి. ప్రస్తుతం తెలంగాణ-నవ్యాంధ్ర ప్రదేశ్ నడుమ కృష్ణా జలాల పంపిణీ సమస్యగా మారింది. కృష్ణా జలాల వివాదం కర్ణాటకతో కొనసాగుతూనే ఉంది. ఎప్పటికీ వీడని పీటముడిలా కావేరీ జలాల సమస్య కర్ణాటక, తమిళనాడు మధ్య బిగుసుకుపోయింది. గోవా-కర్ణాటక నడుమ మహాదాయి నదీ జలాల పంపిణీ ఎప్పటికీ తెగనిదే. తాజాగా కావేరి సలసల మరుగుతోంది. ఏడాది క్రితం సుప్రీం తీర్పు కర్ణాటక-తమిళనాడు మధ్య అగ్గి రాజేసింది. కన్నడిగులు, తమిళులు పరస్పరం ఆగ్రహోదగ్రులై ఆస్తులను తగుల పెట్టుకున్నారు. బెంగళూరు లో కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. సాగు నీరు లేక తమిళనాట రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆత్మహత్య లకూ వారు తెగబడుతున్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తమిళ రైతులు నెలల తరబడి భిన్న రీతులలో నిరసనలు వ్యక్తం చేశారు. మూత్రం తాగడం, అర్ధనగ్నంగా ఉండడం, ఉరితాళ్ళు చేత బూనడం, ఎండా వానా లేకుండానూ.. చలిని లెక్కపెట్టకుండానూ ఆందోళనలు చేశారు. ఏం చేసినా కేంద్రం దిగిరాలేదు.. ఎగువనున్న కర్ణాటక వైఖరిలో వీసమెత్తు మార్పు లేదు. సాటి రైతుల ఇక్కట్లు చూసి, ఆ గుండె కరిగితే వచ్చే కొద్దిపాటి జలాలతో పంట వేసుకుందామన్న అన్నదాత ఆశలు ఆవిరైపోయాయి. శుక్రవారం అత్యున్నత న్యాయ స్థానం కావేరీ జలాల పంపకంపై ఇచ్చిన తీర్పు వారి ఇబ్బందుల్ని మరింత పెంచేలా ఉంది. తమిళనాడుకు ఇస్తున్న కావేరీ జలాల వాటాలో కోతపెట్టి, కర్ణాటకకు 14.75 టిఎంసీల నీటిని అదనంగా కేటాయించింది. బెంగళూరును దృష్టిలో ఉంచుకుని ఈ కేటాయింపు చేసింది. దీనికి కారణం తమిళనాడుకున్న భూగర్భ జలాలని పేర్కొంది. నదీజలాల పంపిణీలో భూగర్భ జలాల ప్రస్తావన రావడం ఇదే మొదటి సారి. ఇదోదో కొత్త సూత్రంగా తెరమీదికి వచ్చినట్టుంది. ఇది ఇక్కడితో ఆగుతుందని అనుకోలేం. అంతర్రాష్ట్ర జలవివాదాలను భూగర్భ జలాల ప్రాతిపదికగా పరిష్కరించాలన్న డిమాండ్లు వెల్లువెత్తే ప్రమాదం ఉంది. అన్నింటి కంటే ప్రధానంగా కావేరీ నదీజలాల నిర్వహణకు ఒకసంస్థ ఏర్పాటుకు సుప్రీం ఆదేశించింది. ఒక నదిపై ఏ రాష్ట్రానికీ యాజమాన్యం ఉండదని స్పష్టంచేసింది. 1892, 1924 సంవత్సరాలలో కుదుర్చుకున్న ఒప్పందాలు చెల్లుతాయని కూడా సుప్రీం ఉదహరించడం గమనార్హం. దివంగత ముఖ్య మంత్రి జయలలిత, డిఎంకె అధ్యక్షుడు కరుణానిధి మధ్య రాజకీయ వైరానికి కావేరీ జలాల వివాదం మరింత ఆజ్యంపోసేది. కర్నాటకలో మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ కేంద్రమంత్రి ఎస్ఎంకృష్ణ మధ్య మాటల యుద్ధాన్ని పెంచేది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, కావేరీ వివాదంలోకి కన్నడిగులు తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌నీ, బాహుబలి ఫేం కట్టప్పనీ లాక్కుని వచ్చే ప్రయత్నం చేశారు. కావేరీ జలాల వివాదానికి ఇంత సుదీర్ఘ నేపథ్యం ఉంది. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో ఈ రెండు ఇరుగుపొరుగు రాష్ట్రాల మధ్య మరోసారి అగ్గిరాజుకునే ప్రమాదం ఉంది. ట్రిబ్యునల్ తమిళనాడులో వ్యవసాయ పరిధిని అంచనా వేయడంలో విఫలమైందని పేర్కొని, తప్పెవరివైపుందో స్పష్టంగా చెప్పింది. 765 కిమీ పొడవున ప్రవహించే కావేరీ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు జీవనాడి. ఇది కర్ణాటకలో ముఖ్యంగా రాజధాని బెంగళూరులో ఆనందోత్సాహాలను వెల్లివిరిసేలా చేసింది. తమిళనాట అందుకు వ్యతిరేకంగా ఆగ్రహావేశాలు మిన్నంటాయి. ఇదన్యాయమంటూ తీర్పును సమీక్షించాలని పిటిషన్ వేసేందుకు ఈపీఎస్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. నీరు ప్రాణావసరమనీ, రాజకీయాలు కూడదనీ కమల్ హాసన్ అభిప్రాయపడ్డారు. కిందటేడాది 192 టీఎంసీలను కేటాయించిన సుప్రీం ఈ ఏడాది తమిళనాట ఉన్న భూగర్భ జలాలను పరిగణనలోకి తీసుకుని కావేరీ జలాల్లో వాటాను తగ్గించింది. తమిళనాడు కు ఇది ఇబ్బందికరమే అయినప్పటికీ.. వాస్తవాన్ని తెలుసుకుని భూగర్భ జలాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆలోచించడం మంచిది. అదే సమయంలో తన వాటాను వదులు కోకుండా ప్రయత్నమూ చేయాల్సిందే. కర్ణాటకలో భూగర్భ జలాలు తమిళనాట కంటే తక్కువని సుప్రీం తీర్పు చెప్పకనే చెప్పింది. పశ్చిమ కనుమల్లో కొడగు వద్ద తలకావేరి నుంచి బొట్లు బొట్లుగా ప్రారంభమైన కావేరీ కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల గుండా ప్రవహించి, తమిళనాడు లోని పూంపుహార్ వద్ద బంగాళా ఖాతంలో కలుస్తోంది. కావేరి పరీవాహక ప్రాంతం మొత్తం 81వేల 155 చదరపు కిలోమీటర్లుంది. తమిళనాట 43 వేల 856, కర్ణాటకలో 34వేల 273, కేరళలో 2వేల 866, పుదు చ్చేరిలో 1107 కిలోమీటర్ల మేర ఇది విస్తరించింది. నాలుగు రాష్ట్రాల వారి దాహార్తిని తీరుస్తూ ప్రవహిస్తున్న కావేరి మా రాష్ట్రంలో పుట్టింది కాబట్టి తమకే ఎక్కువ వాటా జలాలు కావాలన్న కర్ణాటక డిమాండ్ వాదనకు నిలవదు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తమకు ఎక్కువ నీటిని విడవాలన్న తమిళనాడు డిమాండ్ సరికాదు. ఒప్పందాలను ఎప్పటి కప్పుడు సరిచేసుకుంటూ.. అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకుంటే వివాదాలకు తావుండదు. ఇక్కడ కర్ణాటక ఒక ఆశ్చర్యకరమైన వాదన చేసింది. వర్షాలు పడకపోతే.. తమిళనాడుకు కేటాయించిన మేర నీటిని విడుదల చేయలేమనేదే ఆ వాదన. ఎటు చూసినా ఇబ్బంది తమిళనాడుకే. అటు కర్ణాటకైనా.. తమిళనాడైనా కోర్టుకెక్కకుండా వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చర్చించుకుంటే సమస్యకు కచ్చితంగా పరిష్కారం దొరుకుతుంది. మధ్యలో రాజకీయ ప్రయోజనాలు తలదూరుస్తుండడం దీన్ని ఎంతకీ తెగనీయడం లేదు. రాజకీయాలకు అతీతంగా కొలిక్కి తెచ్చుకోవాల్సిన అవసరముంది. ఆవేశకావేషాలకు పోయి.. ఘర్షణలకూ.. విధ్వంసాలకూ దిగకుండా పరిష్కారం చూసుకోవాలి. కోర్టు తీర్పు ఒకరికి ఆనందం.. మరొకరికి విచారం కలిగించడం సహజం. గెలిచిన వాడు ఇంటికెళ్ళి ఏడిస్తే.. ఓడిన వాడు కోర్టు లోనే భోరుమంటాడన్న నానుడి ఎలాగూ ఉండనే ఉంది. ఏ సమస్యయినా పరిష్కారం కావాలంటే రాజకీయాలకు తావివ్వకపోవడమే మందు.

◆ సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి



'కత'ల రాయళ్ళు!



'స్టోరీ టెల్లింగు' స్టోనేజీ నుంచి వికసిస్తూ వస్తున్న కళ. మనిషికీ మిగతా జంతుజాతికీ మధ్యగల పెద్ద వ్యత్యాసం ఈ కథలల్లడంలోనే ఉంది. గొడ్డూగోదాకి అడ్డమైన గడ్డీ మేయాలన్న యావ ఉండదు. అడ్డదారిలో వెళ్ళైనా గద్దెలెక్కాలన్న కసి ఉండదు. కనక కతలు చెప్పుకు తిరగాల్సిన ఖర్మలేదు. పురుగూ పుట్రకి నాలుగ్గింజలు నోటికందితే రోజు గడిచిపోతుంది. కాబట్టి పిట్టకథలు చెప్పుకొనే దుర్గతి పట్టదు.'

'మనిషి జన్మకలా కుదరదురా అబ్బీ! చేతకన్నా ముందు కతల్చెప్పడం వచ్చుండాలి. కష్టం తరుముకొచ్చినా.. దుఃఖం తన్నుకొచ్చినా.. ఉద్వేగం ముంచుకొచ్చినా.. ఉత్సాహం ఉరకలెత్తినా.. కోతులైతే గంతులేస్తాయి. పాములైతే కోరలు చాస్తాయి. పిట్టలైతే పిచ్చిపిచ్చిగా కూస్తాయి. పులులుకా గాండ్రింపులు, ఏనుగులుకీ ఘీంకరింపులు కథలు చెప్పే కౌశలం పట్టుపడకే! మనిషొక్కడే తనక్కావాల్సినంత విషయాన్ని కావాల్సినంత మోతాదులో కథావిశేషంగా మలిచి మరీ బురిడి కొట్టించగలిగేది. అలా కొట్టించే విద్యలో ఆరితేరితేనే వాళ్లే రాజకీయాల్లో రాణించేది. దాన్నీ నువ్వు ఈసడిస్తే ఎట్లారా?'

'బాగుంది బాబాయ్! రాజకీయాల్లో కథన కౌశలం కరువైతే కరుణవాదం ఫలించదనా! కహానీలు కుదరకుంటే సహోదరత్వం రాణించదనా! కథలు వండే కళ ఎంతలా వంటపడ్డకపోతే ఎన్నికల జాతర్లప్పుడు నేతలు పోతురాజులకు మించి హొరతులు పట్టించుకోగలరు?! ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం మనదని మహాఘనంగా కతలు చెప్పుకొంటున్నాం గదా! అంటే మనమెన్నుకుంటున్న నేతాశ్రీల బుర్రల్లో అంతలా సృజనాత్మకత సుళ్లుతిరుగుతుందనా అర్థం?'

'ఆ ఎద్దేవానేరా వద్దనేది! రాజకీయాల మీదేనా రాళ్లేసేదీ?'

'మరేం మనమంటావ్ చెప్పు బాబాయ్! మంటపుడుతుంటేను ఇక్కడా! ఇవాళా రేపూ కథలు 'రాయని భాస్కరుల'ని కనిపెట్టడమే మా కష్టంగా ఉంటేనూ! అంతరించిపోయే జాతుల్లో కాకి.. పిచ్చుకల్లాంటివి ఏవేవో ఉంటున్నాయని ఊరికే ఆందోళన చెందుతున్నాం గానీ.. కట్టుకతలు చెప్పి నెట్టుకొచ్చే సజ్జు మాత్రం అంతకంతకూ పెరిగిపోతోందని కంగారు మాత్రం ఎవరం పడ్డం లేదు! రకరకాల కాలుష్యాలు పెచ్చుమీరుతున్నయని ఆ మధ్య వందలొందల దేశాలా పేరిస్‌లోనో ఎక్కడో అంతలా బుర్రలు బద్దలు కొట్టేసుకున్నాయి కదా! వాటి మేటికీ ఈ కతల బాపతు హానికరజీవులపైన కన్ను పడలేదు.. ఖర్మ!'

'మన గురజాడగారి గిరీశం వారసులెవరన్నా అక్కడా చేరి అసలు విషయాన్నేమైనా పక్కదారి పట్టించారంటావా?!'

'డౌటా! ఈ కతలరాయళ్లతో వచ్చే చిక్కే అది. మనకు తెలీకుండానే వాళ్ల వ్యూహాల్లో చిక్కడిపోతుంటాం! తనను సృష్టించిన గురజాడనే పెడదారి పట్టించిన ఘనుడు గిరీశం. ఆ గిరీశానిక్కూడా గాడ్ ఫాదర్లాంటి ఘనులు తయారవుతున్నారు కదా రాజకీయాల్లో ఘనపుటడుక్కి ఓ పదైదుగురు లెక్కన? కుంటికథలు చెప్పుకుంటూ ఊరేగే వాళ్లకు అస్సలు గుడ్డిగవ్వంతైనా విలువ ఇవ్వకూడదు బాబాయ్ నన్నడిగితే!'

'ఇప్పుడిస్తున్నారనేనా? ఎందుకురా నీకా ఏడుపు?'

'ఏడవక ఇంకేం చెయ్యగలం బాబాయ్ మా బోటి బక్కోళ్లం! టూ మినిట్స్ లో తయారయ్యే నూడీల్లో నిజంగా అన్నేసి హానికారక పదార్థాలున్నాయా' అనడిగమా ఆ మధ్యన! రెండు రీములకు సరిపడా నవల వినిపించిందో తయారుచేసే కంపెనీ! 'కట్టుకున్న దౌర్భాగ్యుడు కదా! అంత కర్కశంగా పొట్టనెట్లా పెట్టుకొన్నావమ్మా!' అని ఓ మహాతల్లిని విచారించిందీ మధ్య మీడియా! అలవాటైన అంతర్జాతీయస్థాయి అత్యాచారం కథ వినిపించేసింది! లక్షలు కోట్లు గడించిన బడాబాబుల బ్యాంకప్పులకు మాఫీలవసరమా? అనడిగి చూడు! ఊకదంపుడు కతలు ఆపకుండా ఊరుతాయి చట్టసభల బావుల్లో! ఐపిఎల్ వంకతో విచిత్రమైన ఆటొకటి కనిపెట్టి పిల్లకాయల జేబులు కొల్లగొట్టిన లలిత్ మోదీ గుర్తున్నాడా బాబాయ్? అప్పనంగా బొక్కేసిన సొమ్ముకు లెక్కలడిగితే ఎక్కడెక్కడికో పోయి దాక్కున్నాడా?'

'దాకునుంతే కథేముందిరా బాబీ! ట్విట్టరు ఖాతా సాక్షిగా రోజుకో ట్విస్టిచ్చే కథ ప్రచారంలో పెట్టి మరీ పార్లమెంటు మొత్తంతో పేకాటాడేసుకొన్నాడు! దటీజ్ రియల్లీ గ్రేట్!'

'అది గ్రేటా?! జనం మర్చిపోయిన నేతాజీలను గూర్చి తాజాగా తయారయే కతల మాటో మరి?'

'కథలు చెప్పడం కవుల పనేరా! ఒప్పుకుంటాను.. నిజమే! కానీ ఆ కర్తవ్యం ఏ కవులూ సాకారం చేయడం లేదే! నాయకులే పూనుకొని కథాసాహిత్యానికి న్యాయం చేస్తున్నర్రా బాబూ? మెచ్చుకోకపోతే మానె.. ఈ నొచ్చుకోడాలేంటంట.. విచిత్రంగా!'

'చిత్రంగా ఉన్నాయ్ బాబాయ్ నీ మాటలు! అడ్డదారిలో గద్దెలెక్కిన కుర్ర కుంకలు వాళ్ల వాళ్ల వంశ చరిత్రలను గూర్చి చెప్పుకొంటున్న పురాణాలు వింటూనే..'

'కన్నవారిక్కాక పక్క పార్టీ కాకాకు వన్నె తెచ్చేందుకా బిడ్డలు కతలు చెప్పేది? కాక ఎక్కువైన పుడు ఏవో రెండు మూడు కబుర్లు శృతి మించే వీకెనెస్ శ్రీనాథుడంతటి కవిసార్వభౌముడికే తప్పింది కాదురా! అంత మాత్రానికే పాపం కాకమ్మ కథలు చెప్పేవాళ్లని కేకిరించడమేంటంట? 'కదిలేదీ.. కదిలించేదీ.. కావాలోయ్ నవకవనానికి' అని మీ మహాకవి కదా కవిత్వాన్ని గురించి కలవరించిందీ!' 'అహా! అందుకేనా.. సమాజాన్ని ఊరికే కదిలిస్తే ఉపయోగమేంటని ఏకంగా కుదుళ్లతో సహా కుదిపేస్తున్నదో మన రాజకీయ కతలరాయళ్ళు!'

'ఆపరా ఆ దెప్పుళ్ళు! కథాప్రక్రియని మరీ అంతలా కించపరచొద్దు! రిమ్మ తెగులు బ్రహ్మయ్య ఎప్పుడో భార్యామణికి తప్పు చేస్తూ దొరికిపోయుంటాడు. నారులకు వట్టి 'సారీ'లు సరిపోతాయా! స్టోరీలేవో అల్లి మరీ ఆ గండం గట్టెక్కి ఉంటాడా తెల్లగడ్డం బ్రహ్మయ్య. దేవతా ముఖంగా పుట్టుకొచ్చిన కథాప్రక్రియను వృథా చెయ్యడం మాత్రం ఏమంత సబబు? అందుకే కృష్ణావతారంలో వెన్నదొంగ ఆ కథాప్రక్రియను కంటిన్యూ చేసుంటాడు. కాళయ్యనూ ఏదో బోళా శంకరుడని బోలెడంత జాలిపడి పోతాం గానీ.. ఒక ఆలిని పక్కనుంచికొని.. మరో ఆలిని నెత్తినుంచుకొన్న మహానుభావుడు! అయినా ఆదిభిక్షువనంటూ ఎన్ని కథలల్లి భక్తగణం చేత ప్రచారం చేయించాడు! దేవుళ్ల కథలే ఇంత లచ్చనంగా ఉంటే వాళ్ల కనుసన్నల్లో కదిలే మామూలు మనుషులం మనం. ముఖ్యంగా ఏదో ఓ దేవుడి పేరు చెప్పుకుంటే తప్ప పబ్బం గడవని రాజకీయజీవుల్ని మూగమొద్దుల్లా ఓ మూల చేరి మూలగమంటావా? అదేం భావ్యంరా! పాలిటిక్సులో పార్లే సరుకు కథలు అల్లలేకపోతే సంసారాలే కాదు.. సర్కార్లూ నిలబడవు. అనుభవం తక్కువ సన్నాసివి నీకేం తెలుస్తాయీ మల్లగుల్లాలు? కతలు కతలంటో ఆ ఎగతాళులే వద్దు. అమెరికా భారత్ స్నేహ సంబంధాలు ఈ మాత్రమైనా పండుతున్నాయంటే ఇరు పక్షాలు ఒకరి కొకరు వినిపించుకొనే కథావిశేషాలే కారణం. ప్రధాని.. ప్రతిపక్ష నేతలు పది మాటలు అటూ ఇటూ విసురుకుంటున్నా.. అవీ జనం వినోదం కోసం చెప్పుకునే కతలేరా.. నీకు బోధపడ్డంలేదు కానీ ఈ మతలబులన్నీ! కహానీలే వద్దంటే ఇహ వెంకయ్యగారి మార్కు 'పన్'లు వినబడే ఛాన్సుండదు. యువనేతలు వివిధ జనయాత్రల మధ్య వినిపించేందుకు 'థీమ్'లుండవు. ప్రసార మాధ్యమాల జోరుకిహ జోష్కెక్కడేదుస్తుంది? ఒక్క తెలుగు మూవీలు మినహా ప్రపంచం మొత్తం ఈ కథాప్రక్రియ చుట్టూతానే కదరా గింగిరాలు కొడుతుండేదీ! స్టోరీలు వద్దంటే ఇహ మళ్లీ స్టోనేజీ యుగంలోకి వెళ్లిపోవడమే!'

'మరే! కథలనేవే లేకపోతే ఆదికవి వాల్మీకీ సోదిలో కొచ్చేవాడు కాదు కదా?'

'ఆ సోది సంగతేమో కానీ.. ఒక్క సూక్ష్మం మాత్రం నువ్వు సూటిగా అర్థం చేసుకోవాలిరా అబ్బిగా! తన మానానికి తానేమో యుద్ధాలు.. తీర్థయాత్రలు చేసుకుంటూ తిరిగే శ్రీకృష్ణదేవరాయలుకే కల్లోకొచ్చి మరీ తన పెళ్ళిని గూర్చి కమ్మని కథలు చెప్పమని శ్రీకాకుళాంధ్ర దేవుడు ఎందుకు పోరు పెట్టాడంటావ్?! కత్తి తిప్పడంలోనే కాదబ్బాయ్.. కథలు చెప్పడంలోనూ గొప్ప మెళకువలు పట్టుపడ్డప్పుడే రాజ్యాధికారం రాయలువారి పాలనలాగా పదికాలాలపాటు పకడ్బందీగా సాగిపోయేది! హిస్టరీ తెలీని పిల్లతనం నీది! స్టోరీలతో నెట్టుకొచ్చే వాళ్లని గద్దె మీద నుంచి నెట్టి పడేయడం ఎన్ని లక్షల నెటిజన్లను కూడగట్టి అల్లరి పెట్టించినా వల్లయ్యే పని కాదు! ముందది తెలుసుకోరా! అసహనం నటించబాకరా పిల్ల సన్నాసీ?'

'ఆహా! హేమాహేమీలు అలవోకగా ఇచ్చేసే హామీలు, వాటి మీద అస్మదీయులుగా ఉన్నప్పుడు చేసే 'హై.. హైఉ'లు.. తస్మదీయులుగా మారినప్పుడు కూసే 'హీ్హ..హీ్హ'లు.. అన్నీ ఈ కథాప్రకియ చుట్టూతానే గింగిరాలు కొట్టే ప్రహసనాలు కదా బాబాయ్! ఈ కుర్చీకతల కిక్కుని గూర్చి ఓట్లేసే జనమైనా అప్రమత్తం కాకపోతే ప్రజాస్వామ్యానికిహ పర్మినెంటుగా 'జనగణమనే..'! జనం మనిషిగా అదే నా దిగులు' 'మరే! బాగుందిరా అబ్బాయ్ నీ దిగులు కత కూడా! హీ్హ.. హీ్హ..హీ్హ!'

◆ కర్లపాలెం హనుమంతరావు
8142283676

పర్యావరణ పరిరక్షణ మా కట్టుబాటు

సుస్థిర అభివృద్ధికి తోడ్పాటు ● ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సులో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణకు భారత్ కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. నరేంద్ర మోడీ శుక్రవారం ఇక్కడ ప్రారంభమైన ప్రపంచ సుస్థిర అభివృద్ధి శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రపంచం మార్పు తీసుకురావడానికి కట్టుబడి ఉండటంతో మేమూ అదే పని చేస్తున్నాము. ప్రపంచం అసౌకర్యవంతమైన వాస్తవం గురించి చర్చిస్తుండగా మేం దానిని సౌకర్యవంతమైన చర్యగా మార్చాము. భారత్ వృద్ధిని విశ్వసిస్తుంది. కానీ అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంది అని అన్నారు. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి కోసం నిర్దేశించిన లక్ష్యాలు మనలను సమానత్వం, సమధర్మం, పర్యావరణ న్యాయం పథంలో ఉంచాయి అని తెలిపారు. మనకు అవసరమైన ప్రతి ఒక్కటి మేం చేస్తున్నాము. అలాగే ఉమ్మడి కట్టుబాటు ప్రాతిపదికగా వారి కట్టుబాట్లను నెరవేర్చడంలో ఇతరులు కూడా చేరాలని మేం ఆశిస్తున్నాము. కానీ అవకలిత బాధ్యత, సమధర్మంతో నెరవేర్చాలి అని ప్రధాని అన్నారు. యుఎన్ఈపీ గ్యాప్ నివేదిక ప్రకారం 2020నాటికి 2005 స్థాయిలకు పైగా తన జీడీపీలో 20 నుంచి 25 శాతానికి ఉద్గారాల తీవ్రతను తగిస్తామంటూ భారత్ చేసిన కొపెన్‌హగెన్ ప్రతినను చేరుకునే బాటలో దేశం ఉంది అని మోడీ తెలిపారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ మాటలను ప్రధాని ఉటంకించారు. అన్ని వనరులు, సంపద ప్రకృతికి చెందినవి, పరమాత్మ, మనము ఈ సంపదకు కేవలం ధర్మకర్తలు లేదా మేనేజర్లు మాత్రమే అని తెలిపారు. నీటి లభ్యత అంశాన్ని సైతం మోడీ ప్రస్తావించారు. ఏ పంట ఎండిపోకుండా చూస్తామని అన్నారు. దేశంలో ప్రతి ఇంటికి విద్యుత్ అందించడానికి పనిచేస్తున్నాము. పెరుగుతున్న పట్టణీకరణతో పాటుగా రవాణా అవసరాలు సైతం పెరిగిపోతున్నాయి. మెట్రో వ్యవస్థను మేం విస్తరిస్తున్నాము అని ప్రధాని తెలిపారు.

మెరుపుదాడి చేశాం: పాక్

అంతా ఒట్టిదే : భారత్

ఇస్లామాబాద్: పాక్ సైన్యం భారత సైనిక శిబిరంపై దాడిచేసి ఐదుగురు సైనికులను మట్టుబెట్టిందని పాకిస్థాన్ ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. పాకిస్థాన్ సైన్య అధికార ప్రతినిధి, మేజర్ జనరల్ ఆసిఫ్ గఫార్ భారత సైనిక శిబిరాన్ని ధ్వంసం చేశామనే విషయాన్ని ట్విటర్ ద్వారా వెల్లడిస్తూ దీనికి సంబంధించిన దృశ్యాలు ఉన్న వీడియోను కూడా షేర్ చేశారు. భారత సైనిక శిబిరం అంతర్జాతీయ సరిహద్దు రేఖ వెంబడి టాట్టా సెక్టార్‌లో ఉన్న అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందన్నారు. ఈ సైనిక శిబిరాన్ని పాక్ ఆర్మీ ధ్వంసం చేసిందన్నారు. ఈ ఘటనలో ఐదుగురు భారత సైనికులు మృతి చెందగా, చాలామంది భారత జవాన్లు గాయపడ్డారన్నారు. భారతీయ ఉగ్రవాదులు అమాయక పౌరులపై దాడిచేస్తే దానికి బదులు తీర్చుకుంటామని గఫార్ ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా పాకిస్థాన్ సైనికాధికారులు చేసిన ఆరోపణలు అన్నీ నిరాధారమని ఢిల్లీలో భారత సైనికాధికారులు వెల్లడించారు.

మళ్లీ కావేరి జగడం

● సుప్రీం కోర్టు తీర్పుతో రగిలిన కుంపటి ● 177.25 టీఎంసీలు తమిళనాడుకు విడుదల చేయాలి ● మిగులు జలాలుగా 14.75 టీఎంసీలు ● బెంగుళూరు అవసరాలకు 4.2 టీఎంసీలు ● 15 ఏళ్లపాటు ఇలాగే సాగాలి ● కర్నాటకలో సంబరాలు... తమిళనాడులో ఆందోళనలు ● ముందస్తు చర్యగా ఇరు రాష్ట్రాల పోలీసుల మోహరింపు



న్యూఢిల్లీ : కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కావేరి కుంపటి రగులుకుంది. కావేరి నదీ జలాల పంపిణీపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా శుక్రవారం తీర్పు వెలువరించారు. దీంతో ఇరు రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీటి పంపిణీలో కర్నాటకు ఊరటనిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో తమిళనాడుకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టయింది. తమిళనాడుకు విడుదల చేయాల్సిన నీటిలో కోత విధిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించడంతో నిరసనలు మిన్నంటాయి. తమిళనాడుకు 177.25 టీఎంసీల నీటిని బిలిగుండ్లు డ్యాం నుండి విడుదల చేయాలని కర్నాటక ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో కర్నాటకకు అదనంగా 14.75 టీఎంసీల నీరు మిగులు జలాలు ఉంటాయి. కావేరి జలాలపై గత కొన్ని దశాబ్దాలుగా రగడ కొనసాగుతూనే ఉంది. దీంతో కేంద్రం కల్పించుకుని కావేరి జల వివాద పరిష్కార ట్రిబ్యునల్ (సీడబ్ల్యుడీటీ)ని ఫిబ్రవరి 5, 2007లో ఏర్పాటు చేసింది. ట్రిబ్యునల్‌లోని సభ్యులు అందరూ అత్యున్నత స్థాయి సమావేశం, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించిన అనంతరం ఫిబ్రవరి 19, 2013లో ట్రిబ్యునల్ కీలక తీర్పు వెలువరించింది. కావేరి జలాలను 740 టీఎంసీలుగా కమిటీ లెక్కించి. తమిళనాడుకు 419 టీఎంసీలు, కర్నాటకకు 270 టీఎంసీలు, కేరళకు 30 టీఎంసీలు, పుదుచ్చేరికి 7 టీఎంసీలు కేటాయించింది. అదనంగా 10వేల మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని పర్యావరణ రక్షణ కోసం వినియోగించాలని వివరించారు. 4 టీఎంసీలు సముద్రంలోకి వృథాగా వెళ్లిపోతాయని ట్రిబ్యునల్ నిర్ధారించింది. నీళ్ల కేటాయింపులో ఉన్నత స్థాయి న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 30 టీఎంసీలు, 7 టీఎంసీలు కేరళ, పుదుచ్చేరి అంగీకారం తెలిపాయి. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ తమిళనాడు, కర్నాటక, కేరళ ప్రభుత్వాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. దీంతో కొన్ని దశాబ్దాలుగా న్యాయస్థానం విచారణ చేపడుతూ వచ్చింది. 2007 ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం.. తమిళనాడుకు ఇప్పటికే 227 టీఎంసీల నీటిని విడుదల చేయగా, ఇంకా 192 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది. మిగిలిన 192 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్నాటకను ఆదేశించింది. ఈ తీర్పు నచ్చని కర్నాటక ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీంతో తమిళనాడుకు రావాల్సిన వాటాను తగ్గిస్తూ.. కర్నాటకకు అనుకూలంగా తీర్పు వెలువరించింది.

ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో పాటు జస్టిస్ అమితవ్ రాయ్, జస్టిస్ ఎఎం ఖన్విల్కర్ కలిసి కీలక తీర్పు వెలువరించారు. కావేరీ జలాలపై కర్నాటక, తమిళనాడుకు ఎలాంటి హక్కు లేదని వివరించారు. ట్రిబ్యునల్ కాదని ఏ రాష్ట్రం కూడా సొంత నిర్ణయాలు తీసుకోడానికి వీల్లేదని సూచించింది, బెంగళూరులో ఐటీ కంపెనీలు అధికంగా ఉండటం, ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో కర్నాటక వాటాను పెంచడం జరిగిందని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. బెంగుళూరులో జనాభా, నీటి వనరుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. తాగునీటిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా బెంగుళూరు నగరానికి 4.2టీఎంసీలు కేటాయించింది. దీంతో పాటు కావేరి బేసిన్‌లో ఉన్న 20 టీఎంసీల భూగర్భ జలాల నుండి 10 టీఎంసీల భూగర్భ జలాలను తమిళనాడు ప్రభుత్వం తీసుకోవచ్చని కూడా సూచించింది. ఈ తీర్పు 15 ఏళ్ల వరకు అమల్లో ఉంటుందని సుప్రీం స్పష్టం చేసింది.


ఇరు రాష్ట్రాలు సంయమనం పాటించాలి : కమల్

కావేరీ జలాల సుప్రీం తీర్పు నేపథ్యంలో ఇరు రాష్ట్రాలు సంయమనం పాటించాలి. తమిళనాడుకు మాత్రం అన్యాయమే జరిగిందని చెప్పాలి. సుప్రీం కోర్టు తీర్పు ఎంతో బాధించింది. కానీ అందుకు అనుగుణంగానే ముందుకు వెళ్లాలి. ఇరు రాష్ట్రాల మధ్య కావేరీ జలాల విషయమై యుద్ధ వాతావరణం నెలకొంది. తీర్పుపై ఎవరూ రాజకీయాలు చేయవద్దు. తమిళనాడుకు రావాల్సిన వాటాను విడుదల చేయాలి.



తమిళనాడుకు అన్యాయం జరిగింది : రజనీకాంత్

కావేరీ జలాల కేటాయింపుల్లో తమిళనాడుకు అన్యాయం జరిగింది. మళ్లీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో తమిళనాడుకు రైతులకు అన్యాయం జరుగుతుంది. కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. తమిళనాడుకు మాత్రం చివరికి న్యాయం దొరకలేదు.



కర్నాటక, తమిళనాడులో భద్రత కట్టుదిట్టం

కావేరీ జలాల పంపకం విషయంలో సుప్రీం కోర్టు శుక్రవారం తీర్పు ఇస్తున్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బెంగుళూరులో భారీ స్థాయిలో కేంద్ర బలగాలను మోహరించారు. తమిళనాడు-కర్నాటక మధ్య బస్సులను తాత్కాలికంగా నిలిపివేశారు. కర్నాటకలో మాత్రం సంబురాలు నిర్వహించుకోగా తమిళనాడులో మాత్రం నిరసనలు చెలరేగుతున్నాయి. ప్రభుత్వ చేతగానితనం కారణంగానే అన్యాయం జరిగిందని తమిళనాడులో విపక్షాలు ధర్నాకు దిగాయి. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి పళని స్వామి డీజీపీతో సమీక్ష నిర్వహించి భద్రతా పరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు.

పీఎన్‌బీ స్కాంకు రాహుల్ రంగు?

● తాత్కాలికంగా పాస్‌పోర్టుల నిలుపుదల ● 35 చోట్ల సోదాలు.. నికర స్వాధీనం రూ.5,649 కోట్లు ● 8 మంది అధికారులపై వేటు

ముంబై: నీరవ్ మోడీ, అతడి వ్యాపార భాగస్వామి మెహుల్ చోస్కీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శుక్రవారం సమన్లు జారీ చేసింది. వారం రోజుల్లోగా ఏజెన్సీ ఎదుట హాజరుకావాలని మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పిఎంఎల్ఎ) కింద జారీ చేసిన సమన్లలో ఇరువురిని ఆదేశించింది. ఉభయులు దేశంలో లేని కారణంగా వారి కంపెనీల డైరెక్టర్లకు నోటీసులు అందజేసినట్టు అధికారులు తెలిపారు. నీరవ్ మోడీ కేసులో దేశవ్యాప్తంగా 35 చోట్ల ఈడీ శుక్రవారం మరింత సోదాలు జరిపింది. పుస్తక విలువ ప్రకారం రూ.549 కోట్ల విలువైన వజ్రాభరణాలు, స్వర్ణాభరణాలు స్వాధీనం చేసుకుంది. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.5,649 కోట్లకు చేరుకుంది అని ఏజెన్సీ ఒక ప్రకటనలో తెలిపింది.

పిఎన్‌బి కుంభకోణంలో ప్రధాన నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, అతడి వ్యాపార భాగస్వామి మెహుల్ చోక్సీ పాస్‌పోర్టులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) శుక్రవారం నాలుగు వారాల కాలానికి సస్పెండ్ చేసింది. జనవరి మొదటి వారంలో దేశం విడిచి వెళ్ళిపోయిన నీరవ్ మోడీ, అతడి కుటుంబం ఆచూకీ తెలుసుకోనేందుకు సిబిఐ అధికారులు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు. విస్తార(డిఫ్యూషన్) నోటీసు ఇవ్వాలని కోరారు.

మరో 8 మంది అధికారుల సస్పెన్షన్

వేల కోట్ల రూపాయల కుంభకోణానికి సంబంధించి మరో ఎనిమిది మంది అధికారులను పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) సస్పెండ్ చేసింది. వారిలో జనరల్ మేనేజర్ స్థాయి అధికారి కూడా ఉన్నారు. పిఎన్‌బి అంతర్గత వనరుల నుంచి నిధులు సేకరించి మార్చి 31 నాటికి ఇతర బ్యాంకులకు వారి బకాయిలను తిరిగి చెల్లిస్తుందని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బుధవారం 10 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో సస్పెండైన ఉద్యోగుల సంఖ్య 18కి చేరుకుంది. పూచీకత్తుగా పరిగణించే ఎల్‌ఓయూలు ప్రాతిపదికగా ఎంత మొత్తం రుణం పొందారనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నది అని అధికారి చెప్పారు. మరింత బకాయిలను వసూలు క్రమంలో సంబంధిత 36 ఖాతాలపై దర్యాప్తును బ్యాంకు ప్రారంభిస్తుందని తెలిపారు.



నీరవ్ ఆచూకీ తెలియదు

పిఎన్‌బి కుంభకోణంలో ప్రధాన నిందితుడు నీరవ్ మోడీ ఎక్కడున్నది తమకు తెలియదని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) తెలిపింది. ఇదే విషయమైన ఎంఈఏ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. నీరవ్ మోడీ ఎంఈఏతో సంప్రదింపులు జరుపుతున్నాడా, అతడు ఎక్కడున్నది ప్రభుత్వానికి తెలుసా అని విలేకరులు ఆయన్ను ప్రశ్నించారు. నీరవ్ మోడీ తమ అధికారుల్లో ఏ ఒక్కరితోనూ సంప్రదింపులు జరపడంలేదని, అతడి ఆచూకీ మాకు తెలియదని రవీష్ కుమార్ బదులిచ్చారు. దావోస్‌కు ప్రధాన మంత్రి అధికారిక బృందంలో నీరవ్ మోడీ భాగం కారని, వాణిజ్యవేత్తలతో ప్రధాని గ్రూప్ ఫొటో ఒక లాంఛనపూర్వకమైన ఘట్టమని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌పై బిజెపి ఎదురుదాడి

న్యూఢిల్లీ: సంచలనం సృష్టిస్తున్న పిఎన్‌బి కుంభకోణాన్ని యూపీఏ కుంభకోణంగా బీజేపీ నేత, కేంద్ర మంత్రి ప్రకాష్ జవేదకర్ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ 2013, సెప్టెంబర్ మాసంలో ఢిల్లీలో నీరవ్ మోడీ ఏర్పాటు చేసిన ఆభరణాల ప్రదర్శనకు హాజరయ్యారు. ఆ మర్నాడే అలహాబాద్ బ్యాంక్ నీరవ్ మోడీకి రుణం మంజూరు చేసింది. బ్యాంక్ డైరెక్టర్లలో ఒకరైన దినేష్ దూబే వ్యతిరేకించినప్పటికీ రుణం మంజూరైంది అని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు ఆభరణాల ప్రదర్శనకు హాజరుకావడానికి, నీరవ్ మోడీకి రుణం మంజూరు కావడానికి మధ్య సంబంధంపై కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేయాలి. కుంభకోణం నుంచి పరిశుద్ధంగా బైటపడాల్సిన వంతు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీది అని జవదేకర్ అన్నారు. కనుక బీజేపీ ప్రభుత్వం అప్రమత్తం చేయడంతోనే యూపీఏ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు.

హైదరాబాద్‌లోనూ దాడులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణం నేపథ్యంలో హైదరాబాద్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) అధికారులు పెద్ద ఎత్తున ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. మెహుల్ చోస్కీకి చెందిన జెమ్స్ తయారీ కర్మాగారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాల వద్ద ఉంది. ఈ కంపెనీలో ఈడి అధికారులు గురువారం అర్ధరాత్రి గం. 2 నుంచి శుక్రవారం ఉదయం గం. 6 వరకు సోదాలు జరిపారు. ఈ సోదాలలో దాదాపు మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల విలువ చేసే సామాగ్రిని, వస్తువులను సీజ్ చేసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా ఉన్న గీతాంజలి జెమ్స్ సంస్థలకు ఇక్కడి నుంచే జెమ్స్ వెళ్తుంటాయని, దేశంలోనే ఇది అత్యంత పెద్దదని ఈడి అధికారులు అంటున్నారు. రావిర్యాలలోని జెమ్స్ కంపెనీలో భారీ ఎత్తున రంగు రాళ్ళను స్వాధీనం చేసుకున్నామని, ఇందులో ఎన్ని జెమ్స్ ఉన్నాయి, ఎన్ని రంగురాళ్ళు అనేది తేల్చాల్సి ఉందని, ఇందుకు నిపుణులను రప్పిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. కంపెనీని తమ ఆధీనంలోకి తీసుకున్న ఈడి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసింది. హైదరాబాద్ జెమ్స్ సెజ్‌లోని అయిదు సంస్థలు నక్షత్ర బ్రాన్స్ లిమిటెడ్, బ్రెజిల్ జ్యూవెల్లరీ ప్రైవేట్ లిమిటెడ్, నక్షత్ర వరల్డ్ లిమిటెడ్, గిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లను కూడా ఈడి అధికారులు సీజ్ చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలో దాదాపు 200 ఎకరాలలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయగా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. తన చేతుల మీదుగా మెహుల్ చోస్కీకి సెజ్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను అందించారు. ఈ సెజ్ అభివృద్ధికి రూ. 500 కోట్లను వెచ్చించనున్నట్లు చోస్కీ ఈ సందర్భంగా ప్రకటించారు. 2016 - 17 ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన బ్యాలెన్స్ షీట్‌లో సెజ్ రూ. 6.6 కోట్ల నష్టం వచ్చినట్లు పేర్కొన్నారు.

తత్కాల్ టిక్కెట్లకు ఇక రీఫండ్!

న్యూఢిల్లీ: తత్కాల్ ప్రయాణికులకు రైల్వేశాఖ శుభవార్త. ఇకపై తత్కాల్ కింద బుక్ చేసుకున్న టిక్కెట్లపై 100శాతం రీఫండ్‌ను అందించనుంది. కొత్త మార్గదర్శ కాల ప్రకారం ఈ-టిక్కెట్లతో పాటు కౌంటర్‌లో తీసుకున్న వాటికి కూ డా రీఫండ్ వర్తిస్తుంది. 5 సంద ర్భాల్లో మాత్రమే టిక్కెట్ ధర మొత్తాన్ని ప్రయాణికులకు తిరిగి చెల్లించ నుందిత. రిజర్వేషన్ చేసుకు న్న రైలు రాకుండా 3 గంటలు... అంతకన్నా ఎక్కువ ఆలస్య మైనప్పు డు సొమ్ము రీ ఫండ్ చేస్తారు. అలాగే రైలును దారి మళ్లిం చినప్పుడు కూడా వర్తిస్తుంది. రైలును మళ్లించిన తర్వాత ప్రయాణికుల రైలు ఎక్కాల్సిన స్టేషన్ లేదా దిగాల్సిన స్టేషన్... అది కాకుండా రెండూ కొత్త రూట్‌లో లేని పక్షంలో. ప్రయాణికు లు ఎక్కాల్సిన కోచ్‌ను రైలుకు అనుసంధానించకపోతే, అధికారులు ప్రయాణికులకు ప్రత్యామ్నాయం కల్పించని సమయంలో రైలులో రిజర్వే షన్ చేసుకున్నదానికి బదులు గా లోయర్ క్లాస్‌లో ప్రయాణించేందుకు ఇష్టపడక పోతే. అది కూడా ప్రయా ణికులు ఇందుకు అంగీకరిస్తే రెండు టిక్కెట్లకు మధ్య ఉన్న తేడాను రైల్వే శాఖ ఆ ప్రయాణికుడికి చెల్లిస్తుంది.

భారత్‌కు ఆయిల్, గ్యాస్, ఇంధన సరఫరాలో సహకారం

ఇరాన్ ప్రెసిడెంట్ హసన్ రౌహానీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత్‌కు ఆయిల్ , గ్యాస్ , ఇంధన సరఫరాలో తమ సహకారం ఉంటుందని ఇరాన్ ప్రెసిడెంట్ డాక్టర్ హసన్ రౌహానీ హామీ ఇచ్చారు. శుక్రవారం తనను కలిసి ముస్లిం పారిశ్రామిక వేత్తలతో ఆయన మాట్లాడారు. పరిశ్రమలు, వ్యవసాయం, టెక్నాలజీ పరంగా పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ దేశంలోని చబ్బర్ ఓడరేవును భారత్ అభివృద్ధి చేసిందని చెప్పారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఇరాన్ అధ్యక్షునికి ఘనంగా వీడ్కోలు

రెండు రోజుల పర్యటన ముగించుకున్న ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహానీకి బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. విమానాశ్రయంలో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కె సింగ్, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, జీఎడి ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, డీజీపీ మహేందర్ రెడ్డి, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్ తదితరులు ఉన్నారు.



ఎన్నికల్లో పోటీ చేస్తారా? ఆదాయ లెక్కలు చెప్పాల్సిందే

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసే నేతలు కేవలం తమ ఆదాయ వనరుల వివరాలనే కాదు, జీవితభాగస్వామి, పిల్లలకు సంబంధించిన ఆస్తులు, వనరులను కూడా వెల్లడించాలని సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పును వెలువరించింది. ఎంపీలు, ఎమ్మెల్యేల ఆదాయం, ఆస్తుల విషయంలో ఎన్నికలలో పోటీ చేసే సమయంలో సమర్పించే అఫిడవిట్‌లో తమ ఆదాయ మూలాలనే కాకుండా తమ తమ జీవిత భాగస్వాముల ఆదాయ వివరాలు, వాటి మూలాలనూ కూడా సమర్పించాలని తీర్పు ఇచ్చింది. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థి తనతోపాటు భార్య, పిల్లల ఆస్తుల వివరాలను అందులో పొందుపరచాలని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఏకసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది.

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ ఆదాయ వివరాలను వెల్లడించేలా చట్టంలో మార్పులు తీసుకురావాలని కోరుతూ లోక్ ప్రహరీ అనే ఎన్జీఓ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం శుక్రవారం ఈ తీర్పును వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు సమయంలో పోటీచేసే అభ్యర్థి, జీవిత భాగస్వామితోపాటు వారి సంరక్షణలోని వ్యక్తుల ఆదాయ, ఆస్తుల వివరాలు తెలియజేయాలి. ఆదాయ మార్గాలను మాత్రం వెల్లడించాల్సిన అవసరం లేదు.

అభ్యర్థులు నేరస్థులు కాదని ఎలా నిర్ధారించగలరు ?

రాజకీయ పార్టీలు తాము ఎంపికచేసిన అభ్యర్థులు నేరస్థులు కాదని ఎలా నిర్ధారించగలరని ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న లోక్ ప్రహరీ స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి, వారి కుటుంబ సభ్యుల ఆదాయ వనరులను బహిర్గతం చేయడానికి ప్రజాప్రాతినిధ్య చట్టంలో సవరణలు చేయాలని ఆదేశించింది. పోటీచేసే అభ్యర్థులు తమ జీవితభాగస్వామి, పిల్లల ఆదాయ వనరుల వివరాలను నామినేషన్ సమయంలో వెల్లడిస్తే వ్యవస్థలో పారదర్శకతకు తోడ్పడుతుందని ఎన్నికల కమిషన్ గత జనవరిలో సుప్రీంకోర్టుకు నివేదించింది. అంతేకాదు పోటీచేసే అభ్యర్థి, తన కుటుంబ సభ్యుల ఆదాయ వనరుల వివరాలు ఓటర్లకు అందజేస్తే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి సహాయపడుతుందని కోర్టుకు విన్నవించింది.

విషవాయువుకు ఏడుగురు బలి

(మొదటిపేజీ తరువాయి)

గోవిందస్వామి(35), బి రామచంద్ర(23), ఎ రెడ్డెప్ప(30), ఆర్ బాబు(30), కేశవ(20), బి వెంకటరాజులు(23, శివకుమార్‌రెడ్డి(45) అనే 8 మంది డ్రైనేజిని శుభ్రం చేయడానికి ఉపక్రమించారు. ఎప్పటిలాగే సంప్‌లోనికి ముందుగా నిచ్చెన ద్వారా దిగిన ముగ్గురి జాడ లేకపోవడంతో మిగిలిన వారు కూడా ఇద్దరిద్దరుగా లోపలకు దిగి అక్కడే పడిపోయారు. బయట ఉన్న ప్రజలు కేకలు వేయడంతో అందరూ కలిసి ముఖాలకు మాస్కులు ధరించి లోపల దిగి లోపల విగతజీవులై పడిఉన్న 7 గురిని, ఊపిరి తీసుకోడానికి కష్టపడుతున్న శివకుమార్, హరికృష్ణలను బయటకు తీశారు. వెంటనే శివకుమార్, హరికృష్ణలిద్దరినీ చికిత్స నిమిత్తం వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. డ్రైనేజిలో పేరుకుపోయిన మురుగులో ఉత్పత్తి అయిన విష వాయువులే ఈ 7 గురి మరణానికి కారణమయ్యాయని ప్రాథమిక దర్యాప్తు ప్రకారం తేలింది. మరణించిన వారిలో రమేష్, రెడ్డెప్ప, మొరం గ్రామ వాసులు కాగా రామచంద్ర, గోవింద, కేశవ, వెంకటరాజు చిత్తూరులోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. ఇక బాబు కర్నాటక రాష్ట్రం ముళబాగల్ ప్రాంతానికి చెందినవాడని, శివ అనంతపురం జిల్లా కదిరి ప్రాంతీయుడని, హరికృష్ణ బైరెడ్డి పల్లె ప్రాంతీయుడని అధికారులు పేర్కొన్నారు. సంఘటన గురించి తెలియగానే తిరుపతి ప్రాంత పర్యటనలో ఉన్న కలెక్టర్ ప్రద్యుమ్న ఆదేశాల మేరకు జిల్లా అధికారులు హుటా హుటిన మొరం గ్రామానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కలెక్టర్ ప్రద్యుమ్న కూడా మధ్యాహ్నం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల కుటుంబాలను ఓదార్చి ప్రభుత్వపరమైన సహాయాలను ప్రకటించారు. కాగా విదేశీ పర్యటనలో ఉన్న పలమనేరు శాసనసభ్యుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి అమరనాథ్ రెడ్డి జరిగిన దుర్ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపిస్తామని ప్రకటించారు.

'కూలి'న జీవితాలు

రోడ్డు పాలైన మృతుల కుటుంబాలు

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: చిత్తూరు జిల్లా పలమనేరులో శుక్రవారం మురుగునీటి విషవాయువులకు బలైన ఏడుగులు వ్యవసాయ కూలీల కుటుంబాల కన్నీటి గాథలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. వారిలో సొంత ఊరిలో కూలి పనులు చేస్తూ బతికేవారు కొందరైతే పొట్ట చేతపట్టుకుని ఇతర ప్రాంతాల నుంచి మొరం ప్రాంతానికి చేరుకుని బతుకీడుస్తున్నవారు కూడా ఉన్నారు. మృతుల్లో మొరం గ్రామానికి చెందిన రమేష్ (32), రెడ్డెప్ప(30)ల కుటుంబాలలో తలోరకం కన్నీటి కథ కనిపిస్తోంది. రమేష్‌కు ఇటీవలే పెళ్లి కాగా నాలుగైదేళ్ల క్రితమే పెళ్లి చేసుకున్న రెడ్డెప్ప రెక్కల కష్టంపై భార్య, ముగ్గురు చిన్న పిల్లలు జీవిస్తున్నారు. పలమనేరు మండలం ఎగువ కుర్మయికి చెందిన గోవిందస్వామి (40) కూలిపని చేసుకుంటూ జీవిస్తూ తన ముగ్గురు ఆడ పిల్లలను తిరుపతి ప్రాంతంలో చదివిస్తున్నాడు. తండ్రి మరణంతో తమ భవిష్యత్తు ఏమవుతుందనే దిగులుతో కుంగిపోయి వారు తల్లి ఒడిలో ఒదిగిపోయి కనిపిస్తున్నారు. శ్రీరంగరాజపురానికి చెందిన రామచంద్ర (24) సంపాదనపై భార్య, ఇటీవలే పుట్టిన ఇద్దరు కవలలు ఆధారపడి ఉన్నారు. ఆయన మరణంతో ఆ కుటుంబం దిక్కులేని పక్షిగా మారింది. ఇంటికి పెద్ద కొడుకైన అయ్యంరెడ్డిపల్లెకు చెందిన 20 ఏళ్ల కేశవకు పెళ్లి చేయడానికి సన్నాహాలు చేస్తున్న తల్లిదండ్రులు అతని మరణంతో కృంగి పోయారు. చంద్రగిరి మండలం అరిగెలవారిపల్లెకు చెందిన వెంకటరాజు(23) సంక్రాంతి సందర్భంగా ఇంటికి వచ్చి మళ్లీ నెలలోగా వస్తానని చెప్పి వెళ్లిన ఏకైక కొడుకు శవమైన కనిపించడంతో శోక సముద్రంలో మునిగిపోయారు. అనంతపురం జిల్లా కదిరి ప్రాంతంనుంచి మొరం గ్రామానికి చేర ుకున్న శివకుమార్ రెడ్డి (42) కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకోడానికి అధికారులు రాత్రి పొద్దుపోయేవరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కర్నాటక రాష్ట్రం ముళబాగల్ కు చెందిన ఆర్ బాబు(40) గత కొంతకాలంగా మొరం ప్రాంతంలోనే ఉంటూ కూలిపని చేస్తూ జీవిస్తున్నారు. వీరందరూ ఏదో ఒక కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ ఉన్నవారే కావడంతో దుర్ఘటన పట్ల మొరం గ్రామం మొత్తం శోక సముద్రంలో మునిగిపోయింది.



సీడబ్ల్యూసీ స్థానంలో స్టీరింగ్ కమిటీ

ఉభయ రాష్ట్రాల కాంగ్రెస్ నేతలకు దక్కని చోటు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్థానంలో కొత్తగా స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. శుక్రవారం ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ రాజ్యాంగంలోని 15వ ఆర్టికల్‌ను అనుసరించి రానున్న ప్లీనరీ సమావేశం కోసం స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్ణయిం చారు. రాహుల్, సోనియా, మన్మోహన్‌సింగ్, ఆంటోని, ఆజాద్, దిగ్విజయ్‌సింగ్, చిదం బరం సహా మొత్తం 34 మందితో ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

ఇక ఉపేక్షించొద్దు

జవాన్లకు సైన్యం మౌఖిక ఆదేశాలు

న్యూఢిల్లీ: సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలను ఇంక ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని ఇండియన్ ఆర్మీ విస్పష్టంగా తేల్చి చెప్పింది. ఎల్‌ఓసీ వెంబడి పాక్ కాల్పులకు దీటుగా స్పందించాలనీ, ఎంతమాత్రం ఉపేక్షించ కుండా స్వేచ్ఛగా పాక్ చర్యలను సమర్థంగా తిప్పికొట్టాలని సైన్యం సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న జవాన్లకు మౌఖిక ఆదేశాలు ఇచ్చింది.



జనవరిలో1500 కోట్ల డాలర్ల విలీనాలు టేకోవర్లు

న్యూఢిల్లీ : భారతీయ కా ర్పొరేట్ రంగంలో గత నెలలో విలీనాలు టేకోవర్ల (ఎంఅం డ్ఏ) జోరు కొన సాగింది. ఏడా ది ప్రాతిపదికన చూస్తే ఆరు రెట్లు పెరిగి 1500 కోట్ల డాల ర్లకు చేరాయని టాక్స్ అడ్వయిజరీ కంపెనీ గ్రాంట్ థ్రాన్‌టన్ తాజా నివేదికలో వెల్ల డిం చింది. ఈ ఏడాది జనవరిలో మొ త్తం 47 ఎంఅండ్ఏలు జరిగాయి. వాటిలో విలువ 15,137 మిలియ న్ డాలర్లు. క్రితం ఏడాది ఇదే నెలలో మొత్తం 45 లావా దేవీలు జరిగాయి. వీటి విలువ 2,301 మిలియన్ డాలర్లుగా తేలిందని తెలిపింది. దేశీయంగా మూడు ఒప్పందాలు బిలియన్ డాలర్లపైనే ఉంటాయని, ఇది మొత్తం ఎంఅండ్ఏ ఒప్పందాల్లో 98 శాతం ఆక్రమించాయని నివేదిక తెలిపింది. ఇక విదేశీ డీల్స్ విషయానికి వస్తే రెండు రెట్లు పెరిగాయి. మూడు అది పెద్ద ఒప్పందాలు సుమారు వంద మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ కలి గినవి ఉన్నయని గ్రాంట్ థ్రాంటన్ ఇండియా ఎ ల్ఎల్పీ డైరెక్టర్ పంకజ్ చోప్డా తెలిపారు. కేంద్రప్రభుత్వం కొత్త చట్టాలను ఉదాహరణ దివా లాచట్టాన్ని తీసుకురావడంతో విలీనాలు టేకోవర్ల జో రుపెరిగింది. ముఖ్యంగా ఇంధనం సహజవాయువు రంగాలతో పాటు పరిశ్రమలు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో ఎక్కువగా కనిపించాయని చోప్డా వివరించారు.



హెచ్చరికలు బేఖాతరు!

• 2ఏళ్ల నుంచి చెబుతున్నా పట్టించుకోని పీఎన్‌బీ • చివరకు రూ.11,400 కోట్లు నష్టపోవాల్సి వచ్చింది



హైదరబాద్ : పీఎస్‌యు బ్యాంకుల్లో రెండవ అతి బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) బుధవారం నాడు రూ.11,400 కోట్లు మోసపోయినట్లు ప్రకటించి బ్యాంకింగ్ రంగాన్నే కాదు దేశానికి పెద్ద షాక్ ఇచ్చింది. పీఎన్‌బీ ఇచ్చిన లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎల్‌ఓయు) తీసుకొని నీరవ్‌మోడీ బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో డబ్బు విత్‌డ్రా చేసుకొనే వాడు. ఇది గత ఏడు సంవత్సరాల నుంచి నిర్విరామంగా కొనసాగింది. బ్యాంకుకు చెందిన సిబ్బంది మోడీతో చేతులు కలిపారని యాజమాన్యం చెబుతోంది. ప్రస్తుతం నీరవ్‌మోడీ న్యూయార్కులో కుటుంబంతో కలిసి కనిపించడాని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇదంతా పక్కన పెడితే పీఎన్‌బీలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న కేర్ రేటింగ్ ఏజెన్సీ ఫిబ్రవరి 2016లోనే బ్యాంకును హెచ్చరించింది. నీరవ్ మోడీకి చెందిన కీలకమైన కంపెనీ ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎఫ్ఐపీఎల్)కు అర్హతకు మించి పెద్దమొత్తంలో రుణాలు ఇస్తున్నారని గుర్తు చేసింది. కంపెనీ బ్యాలెన్స్‌షీటు చూస్తే ఆకర్షణీయంగా కనిపించినా, కస్టమర్ బేస్ చాలా పరిమితంగా ఉందని హెచ్చరించింది. అయితే ఇక్కడ ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే అదే రేటింగ్ ఏజెన్సీ జూన్ 7,2016న .. ఎఫ్ఐపీఎల్‌కు ఇచ్చే బ్యాంకు రుణాలపై గతంలో ఇచ్చిన రేటింగ్‌ను తక్షణమే ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించింది. బ్యాంకు నుంచి నో-ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్‌ఓసీ) తీసుకున్న తర్వాత కేర్‌రేటింగ్ తను ఇచ్చిన రేటింగ్‌ను ఉపసంహరించుకుంది.తీరా చూస్తే బుధవారం మోడీ తమ బ్యాంకును రూ.11,400 కోట్లు మోసం చేశాడని పీఎన్‌బీఐ ప్రకటించింది. ఇక్కడ అసలు విషయానికి వస్తే .. మోడీ కంపెనీ ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పుడు రేటింగ్ ఏజెన్సీ ఎన్‌ఓసీ జారీ చేసి తర్వాత బ్యాంకు ఎన్‌ఓసీ జారీ చేయడంతో రేటింగ్‌ను విత్‌డ్రా చేసుకోమనంపై దర్యాప్తు చేయించాలని రేటింగ్ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ ఒకరు చెప్పారు. ఆయన తన పేరు చెప్పడానికి ఇష్టపడలేదు.రేటింగ్ ఏజెన్సీ ముందుగా హెచ్చరికలు జారీ చేసినా మోడీ కంపెనీ మాత్రం పీఎన్‌బీ నుంచి నిరంతరాయంగా లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్(ఎల్‌ఓయు) పీఎన్‌బీ నుంచి దక్కించుకుంటూ వచ్చింది.

ఈ ఎల్‌ఓయులను తీసుకొని మోడీ కొన్ని వారాల్లోనే వివిధ బ్యాంకుల నుంచి నగదుగా మార్చు కోవడం జరిగేది.ఇదిలా ఉండగా మోడీకి చెందిన ఎఫ్ ఐపీఎల్ కంపెనీ ఫలితాలను మార్కెట్ నియంత్రణా సంస్థకు అందించేది.మోడీ కంపెనీ ఫలితాలను చూస్తే.. మార్చి 2015తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆయన కంపెనీ నిర్వహణా లాభం రూ.4,100 కోట్లు ప్రకటించింది. పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం రూ.99 కోట్లుగా వెల్లడిం చింది. అటు తర్వాత 2015-16 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలానికి రూ.1,458 కోట్ల నిర్వహణా లాభం ప్రక టించి, నికరలాభం మాత్రం రూ.26 కోట్లుగా చూపించారు. అటు తర్వాత నుంచి ఆయన మార్కెట్ నియంత్రణా సంస్థకు కానీ బీఎస్ఈకి కానీ కంపెనీ ఆర్థిక ఫలితాలను ఇవ్వడం మానుకున్నారు.

ఫిబ్రవరి 1,2016న కేర్ హెచ్చరిక

ఇదిలా ఉండగా ఫిబ్రవరి 1, 2016న కేర్‌రేటింగ్ ఒక ప్రకటనలో ఎఫ్ఐపీఎల్ మార్చి 2015 వరకు కంపెనీని సమర్థవంతంగా నిర్వహించిందని తెలిపింది. అయితే కంపెనీ పనితీరు రోజు రోజు దిగజారుతున్నా మోడీ కంపెనీ పూర్తిస్థాయిలో బ్యాంకు నుంచి ఎంత మొత్తం రుణ సదుపాయం పొందాలో వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటోందని చెప్పి కంపెనీ మొత్తం రుణ సదుపాయం అర్హత రూ.24,600 కోట్లకు తగ్గించేసింది. అదే సమయంలో ఫైర్‌స్టార్ డైమండ్స్ లిమిటెడ్.. హాంగ్‌కాంగ్‌కు చెందిన అనుబంధ సంస్థ. బ్యాంకులు మోడీ కంపెనీకి రుణాలు ఇవ్వాలనుకుంటే మాతృసంస్థ అంటే హాంగ్‌కాంగ్‌కు చెందిన కంపెనీ గ్యారంటీ ఇస్తేనే రుణాలు ఇవ్వండి అని సూచించింది. లేదంటే బ్యాంకులు మునిగిపోవడం ఖాయమని క వాడా హెచ్చరించింది. ఇలాంటి హెచ్చరిక నోటీసును మోడీకి చెందిన వేరే కంపెనీపై క వాడా జారీ చేసింది. ఇక్కడ మరో ఆసక్తి కలిగించే అంశం ఏమిటంటే మోడీతో పాటు ఫైర్‌స్టార్ గ్రూపునకు చెందిన కంపెనీలు కలిసి ఒకరికొకరు బ్యాంకు గ్యారంటీలు ఇచ్చుకున్నాయి. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా గ్యారంటీ ఇచ్చిన కంపెనీ నుంచి రుణాలను రాబట్టుకోవచ్చునని పేర్కొన్నాయి. ఎఫ్ఐపీఎల్ ఇలాంటి పలు కార్పొరేట్ గ్యారంటీలు పలు బ్యాంకర్లకు ఇచ్చాయి. ఇవన్నీ కలిసి క్రాస్ గ్యారంటీ స్ట్రక్చర్ కిందికి వచ్చాయి. ఇదిలా ఉండగా నీరవ్ మోడీ 2006లో ఎఫ్‌డీఐపీఎల్‌ను స్థాపించారు. ఈ గ్రూపు నగలు ఎగుమతి చేసే వ్యాపారంలో అడుగుపెట్టింది. సూరత్‌తో స్పెషల్ ఎకనమిక్ జోన్‌తో పాటు మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఐడీసీ) ముంబైలో ఒక తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. 2014లో ముంబై, ఢిల్లీలో రెండు రిటైల్ జువెలరీ షాపులను ప్రారంభించారు. వాటిని ఆక్షన్స్, నీరవ్‌మోడీ జ్యువెలరీ అని పేరు పెట్టారు. స్టాక్ మార్కెట్ నుంచి లభించిన గణాంకాల ప్రకారం చూస్తే ఎఫ్‌డీఐపీఎల్ అమ్మకాలు 2014-15లో అమ్మకాలు రూ.1561 కోట్లు, పన్ను చెల్లించిన తర్వాత లాభాలు కేవలం 3.91 శాతం మాత్రమే చూపించారు.

2015-16 ఆర్థిక సంవత్సరం మొదటి సగభాగంలో కంపెనీ రెవెన్యూ రూ.740 కోట్లుగా చూపించారు. ఇవన్నీ గమనించిన నగల వ్యాపారవర్గాలు మాత్రం కంపెనీ ఆర్థిక పరిస్థితి చూస్తుంటే పక్కాగా సంక్షోభంలో చిక్కుకున్నట్లు తెలుస్తోందని చెబుతున్నారు. ఇక్కడ మరో అంశం ఏమిటంటే మోడీ అందుబాటులో ఉన్న అందరి దగ్గర నుంచి నిధులు సేకరించడం మొదలుపెట్టారు. 2017 జూన్‌తో ఇనిషియల్ పబ్లిక్‌ఆఫరింగ్ ద్వారా నిధులు సేకరించాలని ప్రయత్నించారు. అప్పటికే కంపెనీ ఆర్థిక పరిస్థితి దారుణంగా పడిపోవడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. మోడీ కీలమైనకంపెనీ ఫైర్‌స్టోన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, దీన్ని 1997లో స్థాపించారు. తర్వాత సెప్టెంబర్ 28, 2011న ఆయన దాన్ని ఎఫ్ఐపీఎల్‌గా పేరు మార్చారు. మళ్లీ ఎఫ్ఐపీఎల్‌లో మళ్లీ రెండు విభాగాలున్నాయి. వాటిలో స్టడెడ్ జ్యువెలరీ,, 2014-15లో 80 శాతం రెవెన్యూ దీన్ని సాధించారు. రెండోది కట్ అండ్ పాలిష్ డైమండ్స్ కంపెనీగా వ్యాపారం చేశారు.

CARE Ratings
Professional Risk Opinion



మోసగాళ్లను శిక్షించండి: సీఐఐ

CII

బ్యాం కులను మోసం చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని భార త వాణిజ్య, పారిశ్రా మిక మం డలు లు ప్రభుత్వాన్ని కోరాయి. పీఎ న్‌బీఐకి చెందిన ఒకే బ్యాంకు బ్రాంచీలో ఈ మోసం జరి గినట్లు తెలు స్తోంది. పీ ఎస్‌యు బ్యాంకులోనే ఇలాంటి మో సాలు జరగడం ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని పారి శ్రామిక మండలి అసోచామ్ పేర్కొంది.

ఒక అధి కారి లేదా డిప్యూటి మేనేజర్ స్థాయి అధికారి ఒంటిచేత్తో బ్యాం కింగ్ రిస్కు మేనేజ్‌మెంట్ వ్యవస్థను గండి కొట్ట గలిగా రంటే .. బ్యాంకింగ్ వ్యవస్థలో నిఘా ఎంత లోపభూ యిష్టంగా తెలిసిపోతోందని అసోచామ్ పేర్కొం ది. ప్రస్తుతం దేశ ఆర్థికవ్యవస్థ శరవేగంగా అభివృద్ది చెం దు తోంది. అలాం టిస మయంలో దేశంలో కూడా అతి పెద్ద బ్యాంకింగ్ వ్యవస్థ కావాల్సి ఉంటుంద న్నారు. అ లాం టి సమ యంలో బ్యాంకింగ్ వ్యవస్థ తప్పుదారి పట్ట కుం డా చూడాల్సిన బాధ్యత బ్యాం కింగ్ యా జమాన్యాలపై ఉందని గుర్తు చేసింది.

సెబీ సీరియస్... విచారణ

• పీఎన్‌బీ,గీతాంజలిజెమ్స్ ట్రేడింగ్‌పై విచారణ



ముంబై : తాజాగా నీరవ్‌మోడీ స్కాం బహిర్గతం కావడంతో మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి పంజాబ్‌నేషనల్ బ్యాంకు, గీతాంజలి జెమ్స్ కంపెనీకి చెందిన షేర్ల ట్రేడింగ్‌పై విచారణ మొదలుపెట్టింది. సెక్యూరిటీ చట్టాన్ని అతిక్రమించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెబి ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఇదిలా ఉండగా జులై 2013లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) సెబిని సంప్రదించి గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీతో పాటు ఇతరులను స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్‌పై నిషేధం విధిస్తామని సూచించింది. చోక్సీ ట్రేడింగ్ నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొంది. ప్రస్తుతం సెబి, స్టాక్ ఎక్స్ఛేంజీలు రెండు కలిసి మోడీతో పాటు చోక్సీకి చెందిన కంపెనీల ట్రేడింగ్ వివరాలు సేకరించేపనిలో పడ్డాయి. వీరిద్దరిపై ఇప్పటికే పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో బ్రోకరేజి డిఫాల్ట్ ఒకటని తేలింది. ప్రస్తుతం క్యూ3 ఫలితాల సీజన్ కొనసాగుతోంది. చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ ఈ వారం ప్రారంభంలో బోర్డు సమావేశం కావాలి. ఎలాంటి కారణంచూపకుండా బోర్డు సమావేశాన్ని రద్దు చేశారు. ప్రస్తుతం చోక్సీలో విదేశాల్లో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఆయన ఫోన్ స్విచాఫ్ చేసి ఉంది. గత మూడు రోజుల నుంచి గీతాంజలి షేరు భారీగా క్షీణించింది. శుక్రవారం మరో 20 శాతం నష్టపోయింది.

పీఎన్‌బీ మోసం పై నేడు ఐబీఏ సమావేశం

Indian Banks' Association

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకులో వెలుగు చూసిన రూ.11,400 కోట్ల మోసం కేసు నేపథ్యంలో ఇం డియన్ బ్యాంకు అసోసియేషన్ శనివారం నాడు సమావేశం కానున్నట్లు విశ్వ సనీయవర్గాల సమాచారం. ఇదిలా ఉండగా ఐబీఏ చైరపర్సన్‌గా ఉషా అ నంతసుబ్రహ్మణ్యం వ్యవహరిస్తున్నారు. గతంలో ఆమె పీఎన్‌బీఐ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆమె అలహాబాద్ బ్యాంకు చీఫ్‌గా ఉన్నారు. ఆమె పీఎన్‌బీ ఎండీగా పనిచేస్తున్నప్పుడు నీరవ్‌మోడీ కంపెనీకి కొన్ని ఎల్‌ఓయూలను మంజూరు చేసినట్లు ఆయన వాటిని నగదు చేసుకున్నట్లు చెబు తున్నారు. ఇదిలా ఉండగా ఆర్థికమంత్రిత్వశాఖ అన్ని బ్యాంకులు ప్రస్తుతం రుణాలు వ్యవస్థపై పూర్తి స్థాయిలో సమీక్ష జరపాలని, భవిష్యత్తులో మోసాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



ఎంఅండ్ఎం నుంచి రూ. 256కోట్లు

• సేకరించిన జూమ్‌కార్స్

న్యూఢిల్లీ : కార్లు, సైకిళ్లు అద్దెకు ఇచ్చే జూమ్‌కార్స్ మహీంద్రా అండ్ మ హీంద్రా(ఎంఅండ్ఎం)తో పాటు ఇ తర ఇన్వెస్టర్ల నుంచి 40 మిలి యన్ డాలర్ల రూ.256 కోట్లు సేకరించినట్లు తెలిపింది. జూమ్‌కార్స్‌లో ప్రస్తుతం ఎంఅండ్ఎం కూడా భాగ స్వామి. తాజా పెట్టుబడులతో జూమ్‌కార్స్ ఇండియాలో ఎంఅం డ్ఎం రూ.176 కోట్లు పెట్టుడులు పెట్టినట్లయింది. సేకరించిన నిధులతో మార్కెట్లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటామని, కొత్త టెక్నాలజీని కొనుగోలు చేయడంతో పాటు కొత్త వాహనాలను కొనుగోలు చేస్తామని జూమ్‌కార్ సీఈవో గ్రెగ్ మోరాన్ తెలిపారు. ఈ నిధులతోనే మరిన్ని ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తామని తెలిపారు. జూమ్‌కార్‌లో మహీంద్రా వాటా తాజా పెట్టుబడితో 16 శాతానికి పెరిగింది. ఈ భాగస్వామ్యంలో దేశీయ రవాణా రంగంలో మరింత బలపడతామని ఎంఅండ్ఎం డైరెక్టర్ పవన్ గోయెంకా అన్నారు.

బోథ్‌ట్రీ లాభంలో 30శాతం వృద్ధి

హైదరాబాద్ : బోథ్‌ట్రీ కన్సెల్టింగ్ కంపెనీ లిమిటెడ్..ఐటి కన్సెల్టింగ్, సాఫ్ట్‌వేర్ సర్వీస్ ప్రొవైడర్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 30 శాతం వృద్ధితో రూ.0.77కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోరూ.0.59 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన చూస్తే 50.2 శాతం వృద్ధితో రూ.26.23 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.17.48 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది. తొమ్మిది నెలల కాలానికి రెవెన్యూలో 55 శాతం వృద్ధితో రూ.64.19 కోట్లు ఆర్జించగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.41.42 కోట్లని తెలిపింది. నికరలాభం విషయానికి వస్తే రూ.1.58 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1.36 కోట్లని తెలిపింది.

ఆర్‌కాం ఆస్తుల విక్రయానికి వాటాదారుల ఆమోదం

న్యూఢిల్లీ : పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన ఆర్‌కామ్ అప్పులను తీర్చడానికి ఆస్తుల విక్రయ ప్రతిపాదనను వాటాదారులు ఆమోదించారని తెలిపింది. గురువారం నాడు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఫలితాలను వెల్లడించింది. కంపెనీకి చెందిన స్పెక్ట్రమ్, టవర్స్, ఫైబర్, టెలికంఇన్‌ఫ్రాస్ట్రకర్‌తో పాటు ఇతర ఆస్తులను విక్రయించాలన్న ప్రతిపాదనను 99.91 శాతం వాటాదారులు ఆమోదించారని ఆర్‌కామ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. కంపెనీ మొత్తం రూ.45వేల కోట్ల అప్పులతో కునారిల్లుతోంది. ఆస్తులు విక్రయించిన తర్వాత ఇవి రూ.25వేల కోట్లకుదిగివస్తాయని తెలిపింది. భారీ నష్టాల్లో కూరుకుపోవడంతో వాయిస్‌కాల్ సర్వీసెస్‌ను నిలిపివేసింది.

జియో రూ.2,200 క్యాష్‌బ్యాక్ ఆఫర్

• స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుపై



హైదరాబాద్ : రిలయన్స్ జియోకు చెందిన ప్రస్తుతం ఉన్న కస్టమర్లతో పాటు కొత్త కస్టమర్లకు 22 కంపెనీలకు చెందిన స్మార్ట్‌ఫోన్లు అవి శ్యాంసంగ్, షామీ, నోకియా, ఇంటెక్స్, హువై, బ్లాక్‌బెర్రీ కొనుగోలు చేసి రూ.2,200 వరకు క్యాష్‌బైక్ పొందండని ఆఫర్ ఇస్తోంది. దీన్ని జియో ఫుట్‌బాల్ ఆఫర్ అంటారు.. జియోనెట్‌వర్కు నుంచి కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేస్తే అప్పటికప్పుడు (ఇన్‌స్టంట్)గా రూ.2,200 క్యాష్‌బ్యాంకు ఇవ్వనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. జియోకు పోటీ కంపెనీలు మాత్రం రూ.1,500 నుంచి రూ.2,000 వరకు మాత్రమే క్యాష్‌బ్యాక్ ఆఫర్ ఇస్తున్నాయి. జియో ఆఫర్ జనవరి 15 నుంచి మార్చి 31 వరకు కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసి రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం కస్టమర్ మొట్టమొదటిసారి రూ.198, లేదా రూ.299 రీచార్జి చేసుకుంటే కస్టమర్ మై జియో ఖాతాలోరూ.44, రూ.50ల వోచర్లు జమ చేయబడతాయి. ఈ వోచర్లనుకస్టమర్ రూ.198, లేదా రూ.299కు రీచార్జి చేసుకోవచ్చునని కంపెనీ వర్గాలు చెప్పాయి.

ప్రభాత్ డెయిరీ లాభం రూ.15కోట్లు

న్యూఢిల్లీ: ప్రభాత్ డెయిరీ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంతో ఏకీకృత నికరలాభంలో 56 శాతం క్షీణించి రూ.14.76 కోట్లకు దిగిచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.33.74 కోట్లు నికరలాభాన్ని ఆర్జించినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే క్యూ3లో రూ.404.83 కోట్లకు దిగిరాగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.408.31 కోట్లని తెలిపింది. కంపెనీకి నవీముంబైలో శ్రీరామ్‌పూర్‌లో పాల ఉత్పత్తి కేంద్రాలు నిర్వహిస్తోంది.

ఫిట్‌నెస్ ట్రయినింగ్ బ్రాండ్

• ఎఫ్45 నుంచి 100 స్టూడియోలు

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాకు చెందిన ఫిట్‌నెస్ ట్రెయినింగ్ బ్రాండ్ ఫంక్షనల్ 45 (ఎఫ్45) 2020 నాటికి దేశవ్యాప్తంగా 100 స్టూడియోలను ప్రారంభిస్తామని శుక్రవారం నాడు ప్రకటించింది. ప్రస్తుతం ఎఫ్-45 భారత్ మార్కెట్లో 25 స్టూడియోలను నిర్వహిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు,చెన్నై, రాయ్‌పూర్‌లని ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలే గురుగ్రామ్‌లో రూ.80 లక్షల పెట్టుబడితో కొత్త స్టూడియోను ప్రారంభించింది. గత కొన్ని సంవత్సరాలనుంచి సాధారణ భారతీయులు కూడా ఆరోగ్యంపై అవగాహన పెంచుకున్నారని, ఫిట్‌నెస్, హెల్త్, వెల్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఎఫ్45 ట్రైనింగ్, గోల్ఫ్ కోర్స్ రోడ్ యజమాని గార్లపాటి దివ్య చెప్పారు. పెట్టుబడులపై ఒకటిన్నర ఏడాది తర్వాత లాభాలను ఆర్జిస్తామని ఆమె తెలిపారు.

అమ్మకాల ఒత్తిడి


• ప్రారంభ లాభాల్లో చివర్లో ఆవిరి • 287పాయింట్ల నష్టం



ముంబై : స్టాక్ మార్కెట్లకు చివరి ట్రేడింగ్ రోజైన శుక్రవారం సెన్సెక్స్ 287 పాయింట్లు నష్టపోయి 34,100 వద్ద ముగిసింది. ఆటో, మెటల్, పీఎస్‌యు, క్యాపిటల్‌గూడ్స్, రియల్టీ, బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకులో స్కాం బహిర్గతం కావడంతో దీని షేరు వరుసగా మూడో రోజు కూడా నష్టాలతో ముగిసింది. రూ.8,700 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ నష్టపోయింది. మార్కెట్ ప్రారంభమైన వెంటనే సూచీలు లాభాలతో దూసుకుపోయి ఉదయం 34,508.24 పాయింట్ల మార్కుకు ఎగబాకింది. అటు తర్వాత మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో 33,957.33 పాయింట్లకు దిగి వచ్చింది. చివరకు 286.71 పాయింట్లు నష్టపోయి 34,010.76 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 93.20 పాయింట్లు నష్టపోయి 10,452.30వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,612.90 నుంచి 10,434.05 మధ్య ఊగిసలాడింది. మొత్తానికి రెండు సూచిలు ఈ వారం ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ స్వల్పంగా 5 పాయింట్లు పెరిగితే నిఫ్టీ మాత్రం 2.65 పాయింట్లు నష్టపోయింది. గురువారం నాడు విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.240.49 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే .. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.49.92 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు. గ్లోబల్ మార్కెట్లు లాభాలతో కొనసాగినా.. దేశీయ మార్కెట్లు మాత్రం నష్టాలతో ముగిశాయి. పీఎన్‌బీ స్కామ్‌తో మదుపరులు బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు కొనుగోలు చేయాలంటే హడలిపోతున్నారు. పీఎన్‌బీ జరిగిన స్కాం ఇతర బ్యాంకుల్లో కూడా జరగవచ్చునని మదుపరులు భావిస్తున్నారు. జనవరిలో నెలలో వాణిజ్యలోటు 16.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఎగుమతులు తొమ్మిది శాతం పెరిగి 24.38 బిలియన్ డాలర్లకు చేరగా.. దిగుమతులు 26.1 శాతం పెరిగి 40.68 బిలియన్ డాలర్లకు చేరాయి. బాండ్ ఈల్డింగ్ పెరగంతో మధ్య కాలికానికి మార్కెట్లో ఒడిదుడుకులు తప్పవని ఈ రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యూనియన్ బ్యాంకు షేరు 1.25 శాతం క్షీణించింది. పీఎన్‌బీ సెగ దానికి తగిలింది. గీతాంజలి జెమ్స్ 20 శాతం నష్టపోయింది. పీఎన్‌బీఐ 2.10 శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ 2.55 శాతం వరకు క్షీణించింది.

ఎస్‌బ్యాంకు 2.52 శాతం, ఇ తర నష్టపోయిన షేర్లు ఐసీఐసీఐ బ్యాంకు, మారుతి సుజుకి, భారతి ఎయిర్‌టెల్, అదానీపోర్ట్స్, టా టాస్టీల్, ఎల్‌ండ్‌టి, ఇండస్‌ఇండ్‌బ్యాంకు, టాటామో టార్స్, కోల్ ఇండియా, పవర్‌గ్రిడ్, రిల్, యాక్సిస్ బ్యాంకు, హీరోమోటోకార్ప్, బజాజ్‌ఆటో, ఎంఅం డ్ఎం, ఒఎన్‌జీసీ, ఐటీసీలు 2.31 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా ఇన్ఫోసిస్, టీసీఎస్‌లు 0.96 శాతం వరకు లాభపడ్డాయి. గ్లోబల్ మార్కెట్లు లాభాలతో ము గిశాయి.

జూన్ నాటికి 5జీ సర్వీసెస్ రోడ్ మ్యాప్



న్యూఢిల్లీ: డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం (డాట్) వచ్చే జూ న్ నాటికి 5జీ రోడ్‌మ్యాప్ విడుదల చేసే అవకాశాలు న్నాయని టెలికం కార్యదర్శి అరుణా సుందర్‌రాజన్ శుక్ర వారం అసోచామ్ నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 5జీ సర్వీసు ప్రమాణాలు ఖరారవుతున్నాయని ఆమె అన్నారు. కాగా టెలికం మంత్రి త్వశాఖ 5జీ రోడ్‌మ్యాప్ రూపొందించడానికి ఉన్నతస్థాయి కమిటిని ఏర్పాటు చేసింది. గ్లోబల్ మార్కెట్లు 5జీ సర్వీసెస్ విడుదల అయినప్పుడు భారత్ మార్కెట్లో వీటిని అందుబా టులోకి తేవాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. అ యితే 5జీ సర్వీసెస్‌ను వాస్తవరూపంలోకి తేవడానికి పెద్దె త్తున పైలట్ ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుంది.

గ్లోబల్ మా ర్కెట్లో 5జీ సర్వీసెస్ వచ్చిన వెంటనే భారత్‌మార్కెట్లో మనం ఆ టెక్నాలజీకి మారిపోవడానికి సిద్దంగా ఉండాల నేది తమ లక్ష్యమని సుందరరాజన్ అన్నారు.ఇదిలా ఉం డగా డాట్... ఎస్ఎంఎస్‌లకు కొత్త నెంబరింగ్ స్కీంను తీసు కొస్తున్నట్లు తెలిపారు. ఇవి మెషిన్ టూ మెషిన్ (ఎం2ఎం) క మ్యూనికేషన్స్‌కు వినియోగిస్తారని ఆమె వివరించారు. 5జీ సర్వీసెస్‌లో ఎం2ఎం సర్వీసెస్‌పై ప్రధానంగా ఫోకస్ పెడు తామని ... ఉదాహరణకు కార్లలో సెన్సా ర్‌తో పాటు ఇతర వా హనాల్లో ప్ర మాదాలు నిర్వహించడానికి ఈ టెక్నాలజీని వి నియో గిస్తారు. వీటితో పాటు స్మార్ట్‌హోమ్స్, స్మా ర్ట్‌సిటీస్‌కుల వినియోగిస్తామని ఆమె వివరించారు. కేవలం 18-24 నాలుగు నెలలో టెలికం రంగంలో విప్లవాత్మకమైన మా ర్పులు చోటు చేసుకు న్నాయి. అదే వచ్చే 12నెలలో ఈ రం గంలో భారీ మార్పులు గమనిస్తారని ఆమె అన్నారు. రాబోయే నెలలో ఎం2ఎం అందుబాటులోకి వస్తుందని వివరించారు.

శుభలోన్స్

హైదరాబాద్ : రుణాల కోసం దరఖాస్తు చేసుకొని తిరస్కరించబడుతు న్న వారికి డేటాసన్స్ అనే సంస్థ శుభలోన్స్ పేరుతో రుణాలు మంజూరు చేస్తోంది. వారికి సహాయ సహకరాలందిచేందుకు బెంగళూరు కేంద్రంగా ఉత్సాహవంతులైన యువకులు కొందరు శుభలోన్స్ పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేశారు. వీరు దేశంలోని రుణ విధానంపై పరిశోధన జరిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రుణ వ్యవస్థలో పలు లోపాలున్నాయని, దీం తో లక్షలాది మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న రుణాలు లభించడం లేదని తెలియజేసింది. దేశంలో చాలా మంది విద్యారుణాలు, గృహ, వైద్య ఖర్చుల కోసం రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటారు. అయితే శుభలోన్స్ వారి ఆండ్రి యాడ్ అప్లికేషన్ ద్వారా క్రెడిట్‌స్కోర్ నివేదికరూపొందించి వారికి రుణాలు ఇప్పిం చేందుకు సహకరిస్తుందని శుభలోన్స్ నిర్వాహకులు మోనిష్ ఆనంద్, రాహుల్‌శేఖర్‌లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

కేంద్ర నిధుల వ్యయంపై రాష్ట్ర ప్రభుత్వం

శ్వేతపత్రం విడుదల చేయాలి

• కేంద్రానికి ప్రతిపాదనలు పంపడంలో ప్రభుత్వం విఫలం : మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఖర్చు పెట్టిన వాటిపై, ఎంవోయూలు కదుర్చుకున్న వాటి పై శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల పై కేంద్రంపై ఒత్తిడి తేవడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై నమ్మకంతో ప్రజలు టీడీపీని గెలిపించారని, అలాంటిది అవినీతి అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నాలుగేళ్ళల్లో కనీసం పదిశాతం కూడా చంద్రబాబు నెరవేర్చలేదని, మిగిలిన ఒక్క సంవత్సరంలో ఏవిధంగా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇవ్వడంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలు పంపడంలో విఫలమైందన్నారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి ఎంతమేర నిధులు వచ్చాయో చెప్పలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం దారుణం అన్నారు. కృష్ణపట్నం పోర్టు వారికి లాభం చేకూర్చేందుకే చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రపంచస్థాయి రాజధానిని పదిహేనేళ్లలో కడతామని కలలు కనడం మానుకోవాలని, ప్రజలను మభ్యపెట్టొద్దని సూచించారు. రాజధాని శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని విభజన చట్టంలో ఉన్న తెలుగుదేశం ఎంపీలు ఎందుకు ఒత్తిడి తీసుకురావడంలేదన్నారు. హైదరాబాద్ లో ఉన్న అసెంబ్లీని పదేళ్ల పాటు వాడుకునే అవకాశం ఉన్నప్పటికీ అమరావతిలో తాత్కాలిక నిర్మాణాల పేరుతో రూ800 కోట్ల ప్రజాధనాన్ని వృధ్ధా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాశ్వత రాజధానికి సంబంధించి ఇప్పటివరకు ఏం చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ హయంలో వచ్చిన మూడు రాష్ట్రా ల్లో కూడా ఇప్పటి వరకు రాజధాని నిర్మాణాలు జరగలేదని, ఒక్క నయా రాయపూర్ లో మాత్రమే పనులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. తెలంగాణాతో మొన్నటి వరకు కత్తులు దూసుకున్న తెదేపా నేతలు ఇప్పడెందుకు వారిని ఆలింగనం చేసుకుంటున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. పోలవరం ఎప్పడు పూర్తవుతుందో చెప్పలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. 2020కైనా గ్రావిటీలో నీళ్ళు ఇస్తారా లేదా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఇంకెంతకాలం మాయమాటలతో మోసం చేస్తారని చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. ఉన్నతాధికారులు తిరస్కరిస్తున్న ఫైల్స్‌ను క్యాబినెట్‌లో ఆమోదింపచేసుకోవడం అరాచకంగా పరిగణించారు. భవిష్యత్తులో జరిగే సీబిఐ ఇతర విచారణ పర్యంలో అందరూ బాధ్యులవుతారని హెచ్చారించారు. కేంద్రాని కంటే ముందు ఇప్పటి వరకూ ఖర్చు పెట్టిన వాటిపై , ఎంవోయూలు కుదుర్చుకున్న వాటి పై రాష్ట్ర ప్రభుత్వమే శ్వేతపత్రం విడుదల చేయాలని వడ్డే డిమాండ్ చేశారు.

బెజవాడలో ధమ్మచక్ర

• రూ. ఆరు కోట్ల వ్యయంతో పనులు • పచ్చదనానికి ప్రాధాన్యత



అమరావతి ఆంధ్రప్రభ: అమరావతి రాజధాని నగరం విజయవాడ త్వరలో కొత్త అందాలను సంతరించుకోనుంది. విజయవాడ రాజధాని నగరంగా రూపాంతరం చెందాక నగర స్వరూపం దాదాపుగా పూర్తిగా మారిపోయింది. నగరంలోని అనేక ప్రాంతాలు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. రాజధానికి బుద్ధుడు ఐకానిక్‌గా ఉండగా..అదే స్థాయిలో విజయవాడలో ధమ్మచక్రను నిర్మిస్తున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ వారధి సమీపంలోని కూడలి ప్రాంతంలో ధమ్మచక్ర నిర్మించేందుకు గాను అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ ఇప్పటికే నిర్మాణ పనులను ప్రారంభించింది. దాదాపుగా ఆరు కోట్ల వ్యయంతో ఈ పనులను చేపడ్తున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి ల్యాండ్‌స్కేప్ పనులు జరుగుతున్నాయి. కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన శిల్ప కళామందిరం వారు ధమ్మచక్రను రాతితో రూపొందిస్తున్నారు. దాదాపుగా నలభై అడుగుల ఎత్తులో ధమ్మచక్ర ఏర్పాటు కానుందని ఏడిసి వర్గాలు తెలిపాయి.

మూడు మాసాల వ్యవధిలో దీనిని పూర్తి స్థాయిలో నిర్మించ నున్నారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి వారధి జంక్షన్ అభివృద్ధికి ఇప్పటికే డిజైన్లను అందించారు. ఇక రాజీవ్‌గాంధీ పార్క్‌కు సంబంధించి ప్రాథమిక డిజైన్లను ముఖ్యమంత్రి ఇప్పటికే పరిశీలించారు.

విజయవాడ రీ-డెవలప్‌మెంట్‌లో భాగంగా ఇంద్రకీలాద్రి వద్ద పచ్చదనం అభివృద్ధితో పాటు పార్క్ నిర్మాణాన్ని కూడా ఏడీసీ చేపట్టనుంది. ఇక గులాబీతోట పరిధిలో రైవస్‌కాల్వ వెంబడి క్రాఫ్ట్ బజార్ ఏర్పాటుకుగాను ఏడీసీ టెండర్లు పిలవాల్సి ఉంది. సమీపంలోని గుణదల కొండ ప్రాంతాలను అందమైన మొక్కలతో తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. విజయవాడ లోని కాల్వల సుందరీకరణ పనులు 16వ నెంబర్ జాతీయ రహదారిలో రామవరప్పాడు రింగ్ వరకు రోడ్డుకు రెండువైపులా పచ్చదనంతో పాటు వాకింగ్ ట్రాక్‌లను కూడా ఏడీసీ అభివృద్ధి చేస్తోంది.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

• కార్మిక, ప్రజా సంఘాలు

అమరావతి, ఆంధ్రప్రభ: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టే నిరవధిక సమ్మెకు అన్ని కార్మిక, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక ప్రకటించింది. ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వారు ప్రకటించారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ యం.వి.ఎస్. శర్మ మాట్లాడుతూ అన్ని రకాల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, థర్డ్ పార్టీ వంటి ఉద్యోగాలన్నింటినీ క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత శాసనమండలిలో కార్మిక విధానం మీద జరిగిన చర్చ సందర్భంగా అంశం పై చర్చించగా మంత్రి మండలి ఉపసంఘాన్ని నియమించినట్లు చెప్పారు. 2014లో నియమించిన ఉపసంఘం 2108 వచ్చిన ఇప్పటి వరకూ నివేధిక ఇవ్వలేదని తెలిపారు. సమస్యను ఆధ్యయనం చేయడానికి కానీ, పరిష్కరించడానికి కానీ పునుకోలేదన్నారు. కేవలం ఎన్నికల్లో కంట్రాక్టు ఉద్యోగుల ఓట్లు బ్యాంకుగా వాడుకున్నారని దుయ్యాబట్టారు. విద్యుత్ రంగంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేసే పోరాటాలకు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. ఐక్యవేదిక ఛైర్మన్ పి. కాశీ మధుబాబు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను దశల వారీగా క్రమబద్ధీకరిచాలని ఇప్పటికే పలుమార్లు ఉద్యమాలు నిర్వహించినా ఫలితం లేకపోవడంలో కాంట్రాక్టు కార్మికులు మరోసారి ఆందోళన చేయడానికి ఈ నెల 19వ తేదీన 'ఛలో విజయవాడ' నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 20 నుంచి నివరవధిక సమ్మె చేయాలని తీర్మానించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏడాదిలో 55వేల మెట్రిక్ టన్నుల గోడౌన్లు నిర్మించాం

• ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు సమావేశంలో ఛైర్మన్ ఎల్‌విఎస్‌ఆర్‌కె. ప్రసాద్



అమరావతి, ఆంధ్రప్రభ : గడిచిన ఏడాది కాలంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 55,400 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్లను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించినట్లు ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎల్‌విఎస్‌ఆర్‌కె.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన విజయవాడలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఛైర్మన్ ఎల్‌విఎస్‌ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పొందూరులో 10 వేల మెట్రిక్ టన్నులు, భామినిలో 10 వేల మెట్రిక్ టన్నులు, నెల్లూరు జిల్లా చంద్రాశేఖరపురంలో 14 వేల మెట్రిక్ టన్నులు, కావలిలో 3,400 మెట్రిక్ టన్నులు, బోగోలులో 3 వేల మెట్రిక్ టన్నులు, ప్రకాశం జిల్లా పర్చూరులో 5 వేల మెట్రిక్ టన్నులు, విశాఖపట్నం జిల్లాలోని పీఎస్.బొనంగిలో 10 వేల మెట్రి క్ టన్నుల గోడౌన్లను నిర్మించినట్లు వెల్లడించారు. త్వరలో మరో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లను పలు చోట్ల నిర్మించేందుకు చర్యలు చేపట్టామ న్నారు. ఈ సమావేశంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ కెవి.రమణ, డైరెక్టర్లు బీఎల్ఎన్.మణిశంకర్ నాయుడు, ఎం.వెంకటరమణ, జి.నాగేశ్వరరావు, డి.రాజవర్ధన్ రెడ్డి, ఎన్టీ.చౌదరి, సామ్యూల్ ప్రవీణ్ కుమార్, పికె.దాస్ పాల్గొన్నారు.

ఓర్వకల్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు సలహాదారుగా సుప్రీం ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్

అమరావతి, ఆంధ్రప్రభ: కర్నూలు జిల్లా ఓర్వకల్‌లో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్‌టెంట్‌గా సుప్రీం ట్రాన్స్‌పోర్టు అర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ఎంపిక చేస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు భోగాపురం ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్ (బీఐఏసిఎల్)కు తదుపరి చర్యలు తీసుకోవాల్సింగా సూచించింది. ఈ ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని మూడు దశల్లో చేపట్టాలని నిర్ణయించిన సంగతి విదితమే. ఇప్పటికే మొదటి దశలో రూ. 62 కోట్లతో రన్‌వే, ట్యాక్సీవే, యాప్రాన్, ఐసోలేషన్ బే మరియు రహదారులు, బౌండరీ వాల్, కల్వర్టులు, డ్రైన్లనిర్మాణం వంటి పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను హైదరాబాద్‌కు చెందిన కేసీవీఆర్‌ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎస్టిమేటెడ్ కాంట్రాక్టు విలువలో 4.59 శాతం తక్కువకు కోట్‌చేసి అర్హత సాధించి పనులు ప్రారంభించింది. ఇక రెండో దశలో రూ.26.50 కోట్లతో చేపట్టనున్న ప్రయాణీకులు టెర్మినల్ భవన సముదాయం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ బ్లాక్, ఏటీసీ టవర్, విద్యుత్ సబ్ స్టేషన్, భూగర్భ నీటి ట్యాంకు, పంప్ హౌస్, మంచినీటి ట్యాంకు, వాచ్ టవర్ ఇతర పనులను చేపట్టనున్నారు. ఈ పనులు చేసేందుకు స్టాండర్డ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎస్టిమేటెడ్ కాంట్రాక్టు విలువలో 2.16 శాతం మేర తక్కువ కోట్ చేసి దక్కించుకుంది. ఈ రెండు దశల్లోనూ చేపట్టే నిర్మాణాలకు, పనులకు సంబంధించిన వ్యవహారాల ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్‌టెంట్‌గా సుప్రీం ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు ఇన్‌వెస్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖ ఇంటర్‌నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు 13.83 ఎకరాలు

అమరావతి, ఆంధ్రప్రభ: విశాఖలో నిర్మించనున్న అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌కు మొత్తం 13.83 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం 9.12 ఎకరాలను సేకరించారు. అయితే, ఈ సముదాయంలో విశాలమైన భవనాలు, స్టార్ హోటళ్లు, పార్కింగ్ స్థలాలు వంటివి సరిపడవని నిర్మాణ సంస్థ లులూ గ్రూపు భావించింది. దీనికి తోడు బీచ్ ఫ్రంట్ ఉండే విధంగా ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపడితే మరింత ఆకర్షనీయంగా ఉంటుందని భావించిన నేపధ్యంలో అదనంగా 4.85 ఎకరాల స్థలం అవసరమవుతుందని నిర్మాణ సంస్థ భావించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది.

మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి

• ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహర్



అమరావతి, ఆంధ్రప్రభ : మాదిగలకు ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్.జవహర్ హామీ ఇచ్చారు. ఎస్సీలకు న్యాయం జరిగే ఏ అంశంపై అయినా సహకరించేందుకు తమ ప్రభుత్వం సుముఖంగా ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం శుక్రవారం వెలగపూడి సచివాలయంలో మంత్రిని కలిసి చర్చించారు. పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదిగ నిరుద్యోగ యువతి, యువకులకు అంబేద్కర్ జీవన భృతి పథకం ప్రవేశపెట్టే అంశంతో పాటు మాదిగల అభివృద్ధి, సంక్షేమం, భూమి కొనుగోలు ద్వారానే సాధ్యమనే డిమాండ్లను పరిశీలిస్తామని అన్నారు.

మాదిగ, సన్నకారు రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు 75 శాతం సబ్సిడీ రుణాలు అందించడంతో పాటు నోడల్ ఏజెన్సీ ద్వారా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం కాకుండా మాదిగ పల్లెల్లో ఖర్చు పెట్టాలనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ, మంత్రి జవహర్ దృష్టికి పలు డిమాండ్లను తెస్తూ డప్పు కళాకారులను, కార్మికులను ఆదుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహనిర్మాణ పథకం కింద ఇచ్చే రుణాన్ని పెంపుదల చేయాలని అర్హులైన మాదిగలకు ఇంటి నివాస స్థలాలు మంజూరు చేయాలని, వలసల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లకు మద్దతుగా మాదిగల కార్పొరేషన్ కోసం ఫిబ్రవరి 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు మాదిగల ఆకలి ధర్నాను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మంత్రితో జరిగిన భేటీలో మాదిగ కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కంచర్ల సుధాకర్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు మల్లాది ప్రసాద్, కృష్ణా జిల్లా కన్వీనర్ కృపారావు, కృష్ణాజిల్లా మహిళా అధ్యక్షురాలు జె.ప్రశాంతి, ప్రకాశం జిల్లా కన్వీనర్ లింగాల గురవయ్యతో పాటు సామ్రాట్, మోషా తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్



అమరావతి, ఆంధ్రప్రభ: రైతాంగ సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ శామ్యూల్ ఆనంద్ స్పష్టం చేశారు. శుక్రవారం గుంటూరులోని మిర్చియార్డులో ఎన్‌టీఆర్ రైతు ఉచిత భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శామ్యూల్ ఆనంద్ మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డుల్లో రైతాంగ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. పండించిన పంటల క్రయ, విక్రయాలకు యార్డుకు వస్తున్న రైతులు భోజనం కోసం ఇబ్బందులు పడుతుండటం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనితో రైతులకు ఉచిత భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పథకం ద్వారా నాణ్యమైన భోజనం ఉచితంగా అన్నదాతలకు అందిస్తున్నామన్నారు. మిర్చి యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ రైతులకు కావాల్సిన అన్ని రకాల మౌళిక సదుపాయాలను యార్డులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మినరల్‌వాటర్, ఉచితవైద్యం, భోజనం, వసతి తదితర సదుపాయాలు ఏర్పాటు చేశామని, మే నెల చివరి వరకు ఉచిత భోజన పథకం కొనసాగుతుందని తెలిపారు. గతంలో జరిగిన అవకతవకలను పూర్తిగా ప్రక్షాళన చేస్తూ ఈనామ్ వ్యవస్థలను అమలు చేస్తున్నామని, సరుకు క్రయ విక్రయాల సమయంలో కాటా పూర్తి అయ్యేంత వరకు రైతులు స్వయంగా పర్యవేక్షించడం ఎంతో శ్రేయస్కరమని సూచించారు. రేయింబవుళ్లు రైతులు కష్టించి పండించిన పంటలతోనే యార్డుకు కోట్లాది రూపాయల ఆదాయంవస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమములో యార్డు కార్యదర్శి యన్.శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ కొత్తూరి వెంకట్, డైరెక్టర్లు, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

18న మంగళగిరిలో ముద్రాపక మహాసమ్మేళనం

మొదటిసారిగా భారతదేశంలో అతి పెద్ద స్థాయిలో ముద్రాపక మహాసమ్మేళనాన్ని ఫిబ్రవరి 18న మంగళగిరిలోని హాయ్‌లాండ్ రిసార్ట్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి. సాంబశివరావు తెలి పారు. ముద్రణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి మార్గాలు, ఆర్ధిక ఎదుగుదల, సాంకేతిక ఎదుగుదల వంటి పలు అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం నూతన రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా ప్రతి పరిశ్రమకు అవసరం అయిన ముద్రాపక రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ధ్యేయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. తొలిసారిగ నిర్వహిస్తున్న ఈ మహా సమ్మేళనానికి 13 జిల్లాల నుంచి దాదాపు 1200 మంది ముద్రాప కులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. మన రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరగాలన్నా, పరిశ్రమలు పెరగాలన్నా, రాష్ట్ర ఆదాయం పెరగాలన్నా ముద్రణా రంగం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్న చిన్న పట్టణాలలో ప్రింటింగ్ ప్రెస్‌లు నడిపే వారి జీవితం ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో హైదరాబాద్‌కు తగినట్టుగా ముద్రణరంగంకు సంబంధించిన ప్రెస్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి. రవీంద్రబాబు, ట్రెజరర్ పి.వి.జి. భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్‌వి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అర్చకుల ఆందోళన వాయిదా

రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి మాణిక్యాలరావు హామీ మేరకు అర్చకుల ఆందోళనను నెల రోజులపాటు వాయిదా వేయాలని శుక్రవారం విజయవాడ గొల్లపూడిలోని అయ్యప్పస్వామి కల్యాణ మండపంలో జరిగిన అర్చక సమాఖ్య రాష్ట్ర స్థాయి సదస్సు తీర్మానించింది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌బాబు మంత్రితో మాట్లాడి , సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు.

13 జిల్లాలకు చెందిన అర్చకులంతా భేటీ అయి ఈ నిర్ణయం తీసుకున్నారు. జీవో నెంబర్ 76 ప్రకారం అర్చకుల సర్వీసు రూల్స్‌కు సంబంధించిన తుది నోటిఫికేషన్ విడుదల, సంక్షేమ భవనాల నిర్మాణం, కనీస వేతనాలు, టీటీడీ నుంచి నిధుల విడుదల, తదితర 20 డిమాండ్లపై 13 జిల్లాల నుంచి వచ్చిన ఆర్చక ప్రతినిధులు చర్చించారు. పూట గడవడం దినదినగండంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో కనీస వేతనాలు అమలు కోరుతూ ఆందోళనను ఉధృతం చేసి, తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తొలుత అర్చకులు భావించారు.. అయితే మంత్రి మాణిక్యాలరావు డిమాండ్లపై ఇచ్చిన హామిపై చర్చించిన తర్వాత తుది కార్యాచరణను వాయిదా వేసుకున్నామని ఏపీ అర్చకసమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద్దింటి రాంబాబు తెలిపారు. ఈ సదస్సులో బీజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్‌బాబు, ఏపీ అర్చక సమాఖ్య అధ్యక్షులు ఆత్రేయబాబు, రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద్దింటి రాంబాబు, ఉత్తరాంధ్ర నుంచి సింగంచార్యులు, రాయలసీమ నుంచి పి.శ్రీనివాస స్వామి, నెల్లూరు నుంచి శేషాచార్యులు, అంజన్‌కుమార్ (అనంతపురం), పురుషోత్తమ చార్యులు (పశ్చిమ గోదావరి) ,గుంటూరు నుంచి ఆంజనేయులు, అనంతాచార్యులు తదితరులతో పాటు 13 జిల్లాల అర్చక సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీజులు తిరిగి ఇప్పిస్తామని ప్రభుత్వం మోసం చేసింది

• మార్చి 1 నాటికి హామీ నెరవేర్చకపోతే ఆత్మహత్యలే
• ఫాతిమా విద్యార్థుల తల్లిదండ్రులు



అమరావతి,ఆంధ్రప్రభ: కడప ఫాతిమా మెడికల్ కళాశాల యాజమాన్యం నుండి మూడు దఫాలుగా విద్యార్థులు చెల్లించిన ఫీజులను తిరిగి వెనక్కు ఇప్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేటి వరకు ఆ ఫీజులు ఇప్పించకుండా మోసం చేసిందని ఫాతిమా కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్ విద్యార్థులు తల్లిదండ్రులతో చర్చలు జరిపి డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి 15 నాటికి కళాశాల యాజమాన్యం నుండి ఫీజులు తిరిగి ఇప్పించే బాధ్యత తమదని హామీ ఇచ్చారని, ఇపుడు ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. అంతేకాంకుండా నష్టపోయిన విద్యార్థులకు నీట్ పరీక్షకు కోచింగ్, వేరే కోర్సుల్లో అడ్మిషన్లు ఇప్పిస్తామని చెప్పి వాటిని నెరవేర్చలేదని అన్నారు. భవిష్యత్తు నష్టపోతామన్న ఉద్దేశ్యంతో ఐదుగురు విద్యార్థులు ప్రభుత్వం హామీని నెరవేర్చకున్నా వేరే కళాశాలలో చేరారని చెప్పారు. మార్చి 1వ తేదీన 94 మంది విద్యార్థులు, 200 మంది తల్లిదండ్రులు విజయవాడ నగరానికి వస్తామని, అప్పటికల్లా ప్రభుత్వం ఫీజులు తిరిగి ఇప్పించనట్లయితే ఆత్మహత్యలకు పాల్పడతామని హెచ్చరించారు. ప్రభుత్వం సానుకూలంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హామీని నెరవేర్చాలని కోరారు. ఈ సమావేశంలో విద్యార్థి షేక్ మున్వర్ హుస్సేన్, తల్లిదండ్రులు ఎల్ వెంకట్రావు, ఆర్ యాదగిరి, బీకే ప్రతాప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ కోర్టులో లొంగిపోయిన పురుషోత్తంరెడ్డి

• 14 రోజుల రిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రెండు వారాలుగా పోలీసుల కన్నుగప్పి తిరుగుతున్న ఆదాయానికి మించిన ఆస్తుల కూడబెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి శుక్రవారం అనూహ్యంగా ఏసీబీ కోర్టులో లొంగిపోయారు. పురుషోత్తంరెడ్డికి ఏసీబీ కోర్టు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. మరోవైపు పురుషోత్తంరెడ్డిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ ఏసీబీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. పురుషోత్తం రెడ్డి దాదాపు రూ.300 కోట్లకు పైగా అక్రమాస్తులు కూడబెట్టారన్న అభియోగాలు ఉన్నాయి. శుక్రవారం పురుషోత్తం రెడ్డి ఇంటితో పాటు అతని బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. బ్యాంకు లాకర్లు తెరిచిన అధికారులు భారీగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. పురుషోత్తంరెడ్డి అత్త పేరుపై బ్యాంకు లాకర్లు ఉన్నాయి. లాకర్లు ఓపెన్ చేసిన అధికారుల కళ్లు తిరిగాయి. డైమండ్స్ పొదిగిన నెక్లెస్‌లు, గొలుసులు పెద్ద మొత్తంలో ఉన్నాయి. డైమండ్స్‌తో మాత్రమే చేసిన రెండు పెద్ద హారాలు లైటింగ్ వెలుగులో మెరుస్తుండటం ఆశ్చర్యం. ఒక్కో డైమండ్ నెక్లెస్ విలువ కనీసంలో కనీసం రెండు, మూడు కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఓ డైమండ్ నెక్లెస్ మధ్యలో చాలా చాలా అరుదుగా అత్యంత ఖరీదైన పచ్చ వజ్రం ఉండటం షాక్‌కు గురిచేసింది. మరో నెక్లెస్ హారంలో బ్రౌన్ కలర్ వజ్రం ఉంది. లాకర్లలో ఉన్న వీటి విలువ కోట్లలో ఉండొచ్చని అంనా వేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఆయన ముందుస్తు బెయిల్ కోసం చేసిన విజ్ఞప్తిని కోర్టు తిరస్క రించింది. ఇప్పటికే పురుషోత్తంరెడ్డి బినామీలలో కొందరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. మరికొందరు బినామీల కోసం వేట షురూ చేశారు.

సీఆర్‌డీఏ ఓపెన్‌ఫోరంలో అనుమతులు

అమరావతి ఆంధ్రప్రభ: విజయవాడ ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం ఓపెన్‌ఫోరం కార్యక్రమం జరిగింది. భవనాలు, లేఅవుట్ల దరఖాస్తులు, పరిశ్రమలకు అనుమతులు, మార్టిగేజ్ ఏరియా రిలీజ్‌కు సంబంధించి వచ్చిన పలు దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. సీఆర్డీఏ నిబంధనలు పాటించిన సంస్థలకు, వ్యక్తులకు అక్కడికక్కడే ప్రాథమికంగా అనుమతులు మంజూరు చేశారు. అన్నింటికీ సంబంధించి ఎనిమిది దరఖాస్తులు రాగా వాటిలో ఏడింటిని ఆమోదించారు. ఒక దరఖాస్తుకుగాను అదనపు సమాచారాన్ని అధికారులు కోరారు. లేఅవుట్ల కోసం వచ్చిన రెండు దరఖాస్తులను ఆమోదించారు. పరిశ్రమ అనుమతి కోసం వచ్చిన దరఖాస్తును అనుమతించారు. పెట్రోల్ బంక్ కోసం వచ్చిన రెండు దరఖాస్తుల్లో ఒక దరఖాస్తు ను ఆమోదించి మరొక దర ఖాస్తునకు సంబంధించి అదనపు సమాచారాన్ని అధికారులు కోరారు. రిలీజ్ ఆఫ్ మార్టిగేజ్ ఏరియా, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం వచ్చిన రెండు దరఖాస్తులకు అన్ని పత్రాలు సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదించారు. ఏపిసిఆర్డీఏ డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ కె నాగసుందరి, జాయింట్ డైరెక్టర్లు ధనుంజయరెడ్డి, బాలాజీ, అధికారులు ఓపెన్‌ఫోరం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంపీ రాజీనామా విషయంలో వెనకడుగు వద్దు

చంద్రబాబుకు వైకాపా ఎమ్మెల్సీ వెన్నపూస విజ్ఞప్తి

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా కోసం టీడీపీ కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తారని టీడీపీ చెప్పడం ఆహ్వానించదగ్గ పరిణామమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, శాసనమండలి సభ్యుడు వెన్నపూస గోపాలరెడ్డి అభిప్రాయ పడ్డారు. అయితే, చంద్రబాబు అబద్దాల మాదిరిగా ఈ విషయంలో వెనుకడుగు వేయవద్దని సూచించారు. ప్రత్యేక హోదా కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ తమ పార్టీ ఎంపీల రాజీనామాలు ప్రకటనలతో పోరాటాన్ని ఉధృతం చేశారని, తెలుగేదేశం అధినేత చంద్రబాబు కూడా రాష్ట్రప్రయోజనాల కోసం ఈ పోరాటంలో కలిసి రావాలని కోరారు. విజయవాడలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరవుతా, వివరణ ఇస్తా: వర్మ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్‌వర్మ శనివారం సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరు కానున్నారు. వర్మ హాజరవుతారని పోలీసులు కూడా ప్రకటన చేశారు. ఇటీవల వర్మ తన షార్ట్ ఫిల్మ్ గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ (జీఎస్టీ)పై ఓ టీవీ షోలో మాట్లాడుతూ ఓ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా, తన మీద ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో ఓ బాధ్యత గల పౌరుడిగా తాను శనివారం విచారణకు హాజరు కానున్నానని రామ్ గోపాల్‌వర్మ కూడా తాజాగా ఓ ట్వీట్ ద్వారా తెలిపారు. తనపై వస్తోన్న అసత్య ఆరోపణలపై అధికారులకు వివరించి చెబుతానని చెప్పుకొచ్చారు.

చిలికి-చిలికి గాలివానగా మారిన
బెజవాడ కార్పొరేషన్ రగడ

- సీఎం వద్దకు చేరిన పంచాయితీ
- కార్పొరేటర్లపై మేయర్ ఫిర్యాదు

అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడ నగరపాలక సంస్థ పాలకవర్గంలో చెలరేగిన వివాదం చిలికిచిలికి గాలివానగా మారింది. మేయర్‌పై కార్పొరేటర్లు చేస్తున్న తిరుగుబాటు అధికార తెలుగుదేశం పార్టీకి తలనొప్పిగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజధాని ప్రాంతంలో పార్టీలో కుమ్ములాటల పట్ల అధిష్టానం సీరియస్‌గా ఉంది. అందుకు ఉదాహరణ విజయవాడలో అక్రమ కట్టడాలపై ఎసిబి అధికారులు వరుస దాడులు నిర్వహించి తనిఖీలు నిర్వహించారు. ఎసిబి నివేదిక ఎక్కడ తమకు వ్యతిరేకంగా వస్తుందో అనే భయంతో కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లలో నెలకొంది. ఇప్పటికే అధిష్టానం జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. ఆదే సమయంలో వివాదానికి కారణమైన అంశాలపై నివేదికలు తెప్పించుకున్నట్లు సమాచారం. దీనిలో కార్పొరేటర్లు, మేయర్ పాత్రలపై స్పష్టమైన విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కార్పొరేటర్లు విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి మేయర్ కొనేరు శ్రీధర్‌పై దండయాత్ర చేస్తుంటే, ఆయన సీఎం చంద్రబాబునాయుడుని కలిసి కార్పొరేటర్లపై ఫిర్యాదు చేయడం గమనార్హం. కార్పొరేషన్‌లో నెలకొన్న పరిస్థితులను పూర్తిగా మేయర్ శ్రీధర్ సీఎంకు వివరించారు. కార్పొరేషన్‌లో కొంత మంది తమ స్వప్రయోజనాల కోసం తనను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబునాయుడు వివాదాలకు దూరంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే కూర్చొని పరిష్కరించుకోవాలని సూచించారు. రోడ్డెక్కి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో అందరిని పిలిచి మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మేయర్ శ్రీధర్‌కు చెప్పినట్లు సమాచారం.

మైనారిటీలకు ప్రభుత్వం పెద్దపీట



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్రశాసన మండలి ప్రభుత్వ విప్ ఎం.ఎ.షరీఫ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన రాష్ట్ర సర్వీసుల నుంచి ఐఎఎస్ అధికారిగా పదోన్నతి పొందిన రంజిత్ బాషాకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వారు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే రంజిత్ చేస్తున్న సేవలను గుర్తించి ఐఎఎస్ హోదాను కట్టబెట్టడం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ వర్సిటీ కంప్యూటరైజేషన్

అమరావతి, ఆంధ్రప్రభ: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీని త్వరలో కంప్యూటరైజెషన్ చేయనున్నట్లు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని యూనివర్సిటీలో నూతనంగా ఆధునీకరించిన పరీక్షల విభాగాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్ని విభాగాలను కంప్యూటరైజేషన్ చేసే పక్రియలో భాగంగా పరీక్షల విభాగాన్ని ఆధునీకరించామని తెలిపారు. ఇదే విధంగా మిగిలిన అన్ని విభాగాలను సాధ్యమైనంత త్వరలో ఆధునీకరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు ఇంజనీర్ కెఎల్‌ఆర్‌కె ప్రసాద్ పరీక్షల నియంత్రణాధికారి ఎంవి భీమేశ్వర్, డైరెక్టర్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ డాక్టర్ ఎం.ఎల్ సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్లు అనురాధ, పిఎస్ రమాదేవి, వివి.సుబ్బారావు, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం

అమరావతి, ఆంధ్రప్రభ: విజయవాడ శివారు సూరంపల్లి గ్రామ శివారులో భారీగా కల్తీ నెయ్యిని కమిషనరేట్‌లోని నున్న గ్రామీణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పామాయిల్, వనస్పతిని వేడి చేసి 20శాతం నెయ్యిని కలిపి వేడి చేయడం ద్వారా కల్తీ నెయ్యిని తయారు చేసి వివిధ రకాల బ్రాండ్ల పేరిట మార్కెట్లోకి పంపుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని వీటి అమ్మకాలు సాగుతున్నట్లు నార్త్ సర్కిల్ ఏసీపీ శ్రావణి శుక్రవారం నున్న పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తమకు అందిన ఖచ్చితమైన సమాచారం మేరకు నిఘా పెట్టి కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో రూ.12లక్షల విలువైన 2,290 కిలోల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు. సమావేశంలో నున్న సిఐ దుర్గారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ దారుణహత్య

పలమనేరు, వి.కోట, ప్రభన్యూస్: ఇటీవల చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైకాపా ఎంపీటీసీ భాగ్యలక్ష్మి(43)హత్యకు గురైంది. వి. కోట ఒకటో సెగ్మెంట్ నుంచి గత ఎన్నికలలో ఆమె వైకాపా తరపున ఎన్నికై అనంతరం ఆమె టీడీపీలో చేరారు. సాయినగర్‌లోని సొంత ఇంటిలోనే ఆమె హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. గురువారం ఉదయం నుంచే ఆమె కనిపించడం లేదని గుర్తించిన బంధువులు అనుమానం వచ్చి శుక్రవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఆమె ఇంటి తలుపులను తెరచి చూడగా ఆమె స్నానపు గదిలో శవమై కనిపించింది. మృతురాలి కాళ్ళపైన, ఇతర శరీరభాగాలపైన గాయాలు వున్నాయి. పోలీసులు ఆమె మృతిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

ఎన్టీఆర్ జలసిరి బోర్లు, సోలార్ పంప్ సెట్ల టార్గెట్లలో మార్పు

అమరావతి, ఆంధ్రప్రభ: ఎన్టీఆర్ జలసిరి పథకం కింద రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేయాల్సిన బోరు బావులు, సోలార్‌పంపు సెట్ల టార్గెట్‌లో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జవహర్ రెడ్డి జీవో విడుదల చేశారు.

ఎంపీపీలు రాజీనామాలు చేయాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే ఏపీ ఎంపీలంతా రాజీనామాలు చేసి కేంద్రంపై వత్తిడి తేవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జనచైతన్యవేదిక ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదావల్లే ఏపీలో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఏపీ మాజీ చీఫ్ సెక్రటరి ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ విభజనచ చట్టంలో పొందుపరిచిన అంశాలన్నింటినీ అమలు చేస్తేనే ఏపీ మిగిలిన రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందే అవకాశాలుంటాయన్నారు. అమరావతిలో రాజధాని పెట్టినపుడు తప్పనిసరిగా హైకోర్టును కర్నూలులో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో రాజధాని ఒక చోట ఉంటే హైకోర్టు మరొక చోట ఉన్నట్టు వివరించారు. జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేకహోదాకోసం ఉద్యమించే వారికి జనచైతన్యవేదిక మద్దతు ఉంటుందన్నారు.



విభజన హామీలపై రాజీలేని పోరు!

(మొదటిపేజీ తరువాయి)

నివాళులర్పించిన తర్వాత పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహించిన ప్రైవేట్ హోటల్‌కు చేరుకున్నారు.

పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల నిజనిర్ధారణ కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విభజన హామీల అమలు, నిధుల మంజూరుకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంది. దీన్ని ప్రజల ముందుంచి, వారికి వాస్తవాలను తెలిపి హక్కుల సాధనకు కేంద్రంపై పోరాటం చేసేందుకు పవన్ కళ్యాణ్ సిద్ధమవుతున్నారు. న్యాయమైన హక్కుల సాధన కోసం బలమైన ఉద్యమం నిర్మించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అనుసరించాల్సిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. విభజన హామీలపై రాజీ లేకుండా పోరాటం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలు, విద్యావంతులు, ప్రజా సంఘాలు, ప్రజలను భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగేళ్ళుగా నిర్లక్ష్యంచేస్తూ ఎన్నికల ముందు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని సమావేశంలో పాల్గొన్న నేతలు అభిప్రాయపడ్డారు. విభజన హామీలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి రాష్ట్ర ప్రజలు, విద్యావంతులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభజన హామీలు, నిధుల మంజూరుపై చేస్తున్న పరస్పర లెక్కలను తేల్చాలని నిర్ణయించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తెలుగుదేశం, భాజపా, వైకాపాలను కూడా తమ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా, హామీల సాధనకు శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఒకే గళం వినిపించాలని సమావేశంలో పవన్, జేపీ, ఉండవల్లి అభిప్రాయపడ్డారు. అయితే విభజన హామీలను అమలు చేయకుండా కేంద్రం మోసం చేసినందున ఉద్యమం తీవ్రంగానే ఉండాలని వామపక్షాలు అభిప్రాయపడ్డాయి. ప్రజలను కూడగట్టి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేలా ఉద్యమం చేయాలని, దీనికి తమ పార్టీలు పూర్తిగా ముందుంటాయని వారు చెప్పారు. ఫెడరల్ స్ఫూర్తిని గౌరవిస్తూ శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హక్కులు సాధించాలని సమావేశంలో పాల్గొన్న వారు సూచించారు. ఎలాంటి హింసకు తావు లేకుండానే ప్రజాభిప్రాయాన్ని సేకరించి ఒకే గొంతుతో తమ డిమాండ్లను ఎలుగెత్తి కేంద్రం అంగీకరించేలా ఉద్యమం చేయాలని కమ్యూనిస్టులకు సూచించినట్టు సమాచారం. అయితే ముందు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సమగ్ర సమాచారాన్ని సేకరించే అంశంపై కసరత్తు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, చంద్రశేఖర్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి సమాచారాన్ని అధ్యయనం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీ 11 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుంది. ఈ అంశాలపై శనివారం కూడా చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

శనివారం చర్చించే అంశాలు

1. విభజన చట్టం హామీలు, అమలు, 2. విభజన సమయంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పించడం, 3. రాష్ట్రానికి పన్నుల వాటా, కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడం,

4. రాష్ట్రానికి నరేంద్రమోడీ ఇచ్చిన హామీలు, 5. పోలవరం, 6. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, 7. రైల్వే జోన్, 8. రాజధాని నిర్మాణానికి నిధులు, 9. మెట్రోరైలు, ఓడరేవులు తదితర మౌలిక సదుపాయాల కల్పన, 10. పన్ను రాయితీ, 11. కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు తదితర అంశాలపై శనివారంనాటి సమావేశంలో చర్చిస్తారు. ఈ అంశాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సేకరించి వాటిని అధ్యయనంచేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పరస్పర ప్రకటనలకు ఈ అధ్యయనం అద్దం పడుతుందని, తద్వారా ప్రజలను భాగస్వాములను చేసి హక్కుల సాధనకు ఉద్యమరూపంలో కేంద్రంపై ఒత్తిడి తేవాలని సమావేశంలో నిర్ణయించారు.

చేయని నేరానికి ఆంధ్రా ప్రజలు శిక్షను అనుభవిస్తున్నారు. ప్రజలు ఆవేదన, ఆగ్రహంతో ఉన్నారు. ప్యాకేజీ బాగుందంటూ నాలుగేళ్ళుగా రాష్ట్ర ప్రభుత్వం కాలం గడిపి ఇప్పుడు హామీలు అమలు చేయాలంటూ గొంతెత్తింది. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలను మార్చి 5లోగా పరిష్కరించాలి.

- పి. మధు

ప్రజలు బాధను వ్యక్తంచేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ నైజాన్ని చాటుతున్నాయి. హామీల అమలు, నిధుల మంజూరుపై వాస్తవాలు ప్రజలకు తెలపాలనుకున్నాం. రెండు ప్రభుత్వాలు పరస్పర ప్రకటనలు చేసుకోవడంపై బాధ్యతగా నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేశాం. హక్కుల సాధనకు చిత్తశుద్ధితో కృషిచేస్తాం. అంశాల వారీగా అధ్యయనం చేసేందుకు ఉప కమిటీలను నియమించి వాటికి బాధ్యతలు అప్పగిస్తాం సమగ్ర సమాచారంతో ముందడుగు వేస్తాం. తెలుగుదేశం, భాజపా, వైకాపాలను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించాం. అయితే ఆ పార్టీలు మరో మార్గంలో ఆందోళన చేయాలనుకుంటున్నందున రాలేకపోయి ఉంటాయి.

- పవన్ కళ్యాణ్

ఆంధ్రా, తెలంగాణలో కూడా హామీల అమలు ఉల్లంఘనపై ప్రజలు బాధను వ్యక్తంచేస్తున్నారు. ప్రజల హక్కుల సాధనకు ఫెడరల్ స్ఫూర్తితో దేశ సమగ్రత కాపాడుకుంటూ, ఆగ్రహావేశాలు లేకుండా నిర్మాణాత్మకంగా ఉద్యమం చేపట్టి కేంద్రంపై ఒత్తిడి తేవాలి. రాష్ట్రానికి ఇచ్చిన నిధుల ఖర్చుపై లెక్కలు అడిగే హక్కు కేంద్రానికి లేదు. విభజన హామీలన్నీ సాధిస్తామని హామీ ఇవ్వడంలేదు. అయితే చిత్తశుద్ధి, విశ్వసనీయతతో అందర్నీ కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలనుకున్నాం.

- జయప్రకాశ్ నారాయణన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. నాలుగేళ్ళుగా ఆంధ్రా ప్రజలను ఈ రెండు ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ప్రధాని ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిలదీస్తున్నాం. హక్కుల సాధనకు ప్రధాని మోడీపై పోరాటం తప్పడంలేదు.

- రామకృష్ణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగేళ్ళుగా నిర్లక్ష్యం వహించి కాంగ్రెస్ పార్టీపైనే తప్పు నెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రత్యేక హోదా హామీ అమలు లేదు. రాష్ట్ర విభజన పాపం కాంగ్రెస్‌ది అయితే, విభజన కోసం రెండుసార్లు లేఖ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుది కూడా పాపమే అవుతుంది.

- గౌతం

చట్టం చేయాలని కోరుతారేగానీ చేసిన చట్టాన్ని అమలు చేయాలని అడగమేంటి. మోడీ, చంద్రబాబు కలిసి మళ్లీ హామీల ప్రకటనలు చేస్తారు. ఎన్నికల తర్వాత దాన్ని అమలు చేస్తారన్న నమ్మకం ఎలా ఉంటుంది.

- ఉండవల్లి

ఏ రాజకీయ నిర్ణయాన్నైనా
ఎదుర్కొంటాం!

- పవన్ కమిటీకి విశ్వసనీయత లేదు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నరేంద్రమోడీ ప్రభుత్వం చేస్తున్న సాయాన్ని ప్రశంసించకున్నా, కనీసం గుర్తించాలని భారతీయ జనతా పార్టీ విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు అమలవుతున్నాయని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీవిఎల్ నరసింహరావు తెలిపారు. శుక్రవారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన ఏపీ బీజేపీ అధ్యక్షుడు హరిబాబుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కాగా రాష్ట్రంలో ఎదురయ్యే ఏ పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, ఏపీ అభివృద్ధికి నిధులిస్తే తమ హక్కు అని అంటున్నారని, ఇవ్వకపోతే మోడీ, బీజేపీ పాపం అంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, లోక్ సభ ఎంపీ హరిబాబు అన్నారు. తమను ప్రశంసించకున్నా కేంద్రం రాష్ట్రానికి ఏమి ఇచ్చిందో యధార్థంగా ఒప్పుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దానిని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ లోటు భర్తీ లెక్కల ఖరారు త్వరలో పూర్తవుతుందన్నారు. కడపస్టీల్ ప్లాంట్‌పై కూడా త్వరలోనే సానుకూల నిర్ణయం ఉంటుందన్నారు. రైల్వే జోన్ ఏర్పాటు రాజకీయ నిర్ణయమేనని స్పష్టం చేశారు. ఏపీ శరవేగంగా, రెండింతలు రాష్ట్ర వృద్ధి సాధ్యమైందంటే ఆ ఘనత కేంద్రానిదేనని అన్నారు.

ఏపీకి కేంద్రం పెద్ద ఎత్తున సాయం చేస్తున్నప్పటికీ కొన్ని రాజకీయ పార్టీలు, వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని వారు అన్నారు. విభజన చట్టంలోని హామీలను పదేళ్ల లోపు అమలు చేయాలని ఉన్నప్పటికీ అప్పటిదాకా వేచి చూడకుండా తాము మూడున్నరేళ్లలోనే చాలా వరకు పూర్తిచేశామని చెప్పారు. 11 విద్యాసంస్థలకు గాను ఇప్పటికే తొమ్మిదింటిని ప్రారంభించామని, గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించామని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలకు సంబంధించి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని మాత్రమే చట్టంలో ఉన్నప్పటికీ, ఆ స్ఫూర్తితో వాటిని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఆరు సంస్థలకు సంబంధించి అధ్యయనాలు జరిగితే అందులో మూడింటికి మాత్రమే నెలకొల్పేందుకు అవకాశముందని నివేదికలు వచ్చాయన్నారు. ఈ మేరకు హెచ్‌పీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ అయిల్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు, వైజాగ్ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు 2500 కోట్ల నిధులు సమకూర్చిందని, విశాఖ, విజయవాడ, తిరుపతి విమానాశ్రాయాలను అంతర్జాతీయ స్థాయిగా మార్చామని చెప్పారు. విజయవాడ, వైజాగ్ మెట్రో రైలుకు సంబంధించి 2017 మెట్రోపాలసీ ప్రకారం కొత్త ప్రతిపాదనలు పంపాలని రాష్ట్రాన్ని కోరినట్లు చెప్పారు. దుగరాజపట్నంలో పోర్టు ఏర్పాటు సాధ్యం కాదని నీతి ఆయోగ్ నివేదిక ఇచ్చిందన్నారు. ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కూడా సాధ్యం కాదని నివేదిక వచ్చినా ఇబ్బందులు తొలగించాలని టాస్క్‌ఫోర్స్‌ను కోరామన్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం కూడా కొన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ప్రత్యేక హోదా అనేది చట్టంలోనే లేదని, 14ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం అసలు ప్రత్యేక హోదా ఉనికి లేదని స్పష్టం చేశారు. సాధారణ, ప్రత్యేక హోదా రాష్ట్రాలకు నిధుల మంజూరులో ఎటువంటి వివక్ష ఉండదన్నారు. ప్రత్యేక హోదా సంజీవని కాదని చెప్పారు. ఇది కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికేనని అన్నారు. దీనికి బదులుగా రాష్ట్రానికి తాము ప్రత్యేక సాయం చేస్తున్నామన్నారు. ఈఏపీ ద్వారా రాష్ట్రానికి నిధులు అందించే అంశానికి చట్టబద్దత కూడా కల్పించామని తెలిపారు. ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలలో 17 ఏళ్ల తర్వాత దూరదర్శన్ ఏర్పాటుచేస్తే ఏపీలో విభజన ఏడాది 2014లోనే సప్తగిరి దూరదర్శన్‌ను నెలకొల్పామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు సాగునీటి నిర్మాణాలకు వంద శాతం కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని పునరుద్ఘాటించారు. ఏపీ నూతన రాజధానికి ఇప్పటికే 2500 కోట్ల రూపాయలు ఇచ్చామని, మరో 1000 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజల పక్షాన ఉందని, పూర్తి స్థాయిలో అభివృద్ధికి నిరంతరం పనిచేస్తుందన్నారు.

కేంద్రం ఏపిపై సానుభూతితో సాయం చేస్తోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన దానికంటే మూడు రెట్లు అధికంగా జాతీయ రహదారులకు లక్ష కోట్ల నిధులిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దేశంలోనే ఏపీకి మూడోవంతు ఆరులక్షల ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు.

దేశంలో ఏపీ జనాభా వాటాను మించి మూడు రెట్లు అధికసాయం చేశామన్నారు. రాజకీయ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించొద్దన్నారు. రాజధానిలో చట్టసభలను నిర్మిస్తున్నామనే తప్ప మయసభను కాదన్నారు.

కేంద్రం ఏపీ రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై బీజేపీ నిజాలు బయట పెట్టే కొద్దీ పార్టీలకు ఇబ్బందులు తప్పవన్నారు. కేంద్ర, రాష్ట్రాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని, బురదజల్లుకోవడం మానలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ గొంతుకోసిందని, హైదరాబాద్‌లోనే అభివృద్ధిని కేంద్రీకరించిన టీడీపీ, కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఏపీలో ఏడు జిల్లాలకు పన్ను రాయితీలు ఇచ్చామని, ఆ జిల్లాల్లో ఎన్ని పెట్టుబడులు తెచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ వేసిన నిజనిర్ధారణ కమిటీపై నమ్మకం లేదన్నారు. ఆ కమిటీలో కాంగ్రెస్ నాయకులను పెట్టినప్పుడే దానికి విశ్వసనీయత లేదని అర్థమైందన్నారు.

కేంద్రం ఇచ్చిన నిధులపై
శ్వేతపత్రం ఇస్తాం!

- హరిబాబు గణాంకాలపై బహిరంగ చర్చకు సిద్ధం: మంత్రి గంటా



అమరావతి, ఆంధ్రప్రభ: కేంద్ర రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, వ్యయంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయనున్నట్లు మానవ వనరుల శాఖామంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 నుంచి ఇప్పటి వరకు కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన నిధులు, ప్రభుత్వం చేసిన ఖర్చులపై 4 లేక 5 శ్వేత పత్రాలు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ కుటుంబరావుతో కలిసి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ కంభంపాటి హరిబాబు లెక్కలపై పాత పాటే పాడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ప్రకటించిన వివరాలనే ఢిల్లీలో మరోసారి మీడియాకు చెప్పడం జరిగిందన్నారు. హరిబాబు చెప్పే లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమేనని గంటా సవాల్ విసిరారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో తిరుపతి బహిరంగ సభలో సీఎం చంద్రబాబుతో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోడీ వెంకన్న పాదాల సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌లో ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రధాని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో 7 విద్యాసంస్థలకు కేవలం ఐదు మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. ప్రారంభించిన విద్యాసంస్థలు కూడా సొంత భవనాల్లో తరగతులు జరగడంలేదన్నారు. కర్నూలుకు కేటాయించిన త్రిపుట్‌ఐటీ తరగతులు తమిళనాడులోని కాంచీపురంలో నిర్వహిస్తున్నారన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్శిటీకి ఇంత వరకూ కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలపలేదన్నారు. 7 ఇనిస్టూట్లకు 2015-16లో రూ.103 కోట్లు, 2016-17లో 158 కోట్లు, 17-18లో 260 కోట్లు, రాబోయే 18-19 బడ్జెట్‌లో 245 కోట్లు మాత్రమే కేటాయించారని మంత్రి శ్రీనివాసరావు వివరించారు. ఈ విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయాలు విలువచేసే 2,401 ఎకరాలు కేటాయించిందన్నారు. అదే సమయంలో ఈ విద్యా సంస్థలో మౌళిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం 72 కోట్ల వరకూ వెచ్చించినట్లు పేర్కొన్నారు. ఏపీకి ఎయిర్‌పోర్టు, దూరదర్శన్, పాస్‌పోర్టు కేంద్రాలు ఇచ్చినట్లు బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఏ రాష్ట్రానికైనా దూరదర్శన్, పాస్‌పోర్టు కార్యాలయాలు మంజూరు చేయడం సాధరణ విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రమిచ్చిన నిధులపై ఎక్కడైనా, ఎప్పుడైనా బీజేపీ నేతలతో చర్చకు సిద్ధంగా ఉన్నామని మంత్రి గంటా ప్రకటించారు. నేటి వరకూ రాష్ట్రానికి కేంద్రమిచ్చిన నిధులపై త్వరలో నాలుగైదు శ్వేత పత్రాలు ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. రాష్ట్రప్రయోజనాల కోసం పోరాడుతున్న మిత్ర పక్షంగా గుర్తించి, తమకు అధిక సాయం చేయాలని మంత్రి కోరారు. తామేమీ అదనంగా కోరడం లేదనీ, పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

జగన్ కుంటిసాకులు..

విపక్షనేత జగన్ కుంటి సాకులతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి గంటా ధ్వజమెత్తారు. జగన్ అసమర్ధనాయకుడిగా అభివర్ణించారు. జగన్ స్థాయి ఏమిటి, బాబు స్థాయి ఏమిటని ప్రశ్నించారు. వైకాపా లాలూచీ రాజకీయాలను పక్కనబెట్టి పార్టీ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలపై ప్రతిపక్ష పార్టీల వైఖరి, నిర్వాహకం ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని కేంద్ర ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ మంత్రి సుజనాచౌదరి రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అడ్డుకోవడం విచారకరమన్నారు. భవిష్యత్‌లో వైకాపాకు ప్రతిపక్షహోదా కూడా దక్కదని మంత్రి గంటా జోస్యం చెప్పారు.

గతంలో సినిమా స్క్రిప్ట్. నేడు డాక్యుమెంటరీ
- ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ కుటుంబరావు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ హరిబాబు గతంలో విడుదల చేసిన 27 పేజీల ప్రకటన సినిమా స్క్రిప్ట్‌కాగా, నేడు ఢిల్లీలో ప్రకటించిన 17 పేజీల సారాంశం డాక్యుమెంటరీ అని పాతలెక్కలనే మరోసారి వల్లెవేస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ కుటుంబరావు సెటైర్ విసిరారు. వెనుకబడ్డ ప్రాంతాలకిచ్చే 350 కోట్లను కేంద్రం నిలిపివేసిందని కుటుంబరావు చెప్పారు. బీజేపీ ఎంపీ నూతనంగా ప్రకటించిన 17 పేజీల్లో ప్రత్యేక హోదా పైనగానీ, ప్రత్యేక ప్యాకేజీపై కానీ ఎటువంటి ప్రస్తావనాలేదన్నారు. గతంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ హామీ ఇస్తూ.. ప్రత్యేక ప్యాకేజీల్లో ఉన్న రాయితీలు ఇతర అవకాశాలను ప్రత్యేక ప్యాకేజీ పేరుతో అందిస్తామన్నారు ఏ పేరు అయితేనేమీ రాష్ట్రాభివృద్ధికి కావాల్సింది నిధులని భావించి, సీఎం చంద్రబాబు నాయుడు సరేనన్నారన్నారు. నిధులు అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం చివరి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి రావాల్సిన హక్కులపై స్పందించలేదన్నారు. ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పి నిధులు ఇవ్వకపోతే ఫర్వాలేదా ? అని బీజేపీ నేతలు అనడం సరికాదన్నారు. ఆర్థక లోటుపై కేంద్రంతో రాష్ట్రానికి చెందిన అధికారులు చర్చిస్తున్నారన్నారు. గతంలో వెనుకబడిన ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1050 కోట్లు ఇచ్చిందన్నారు. ఈ ఏడాది కోసం తొలుత 350 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తర్వాత ఆ నిధులను వెనక్కి తీసుకుందన్నారు. ఇదే విషయమై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజాస్వామ్యంలో ఇచ్చి పుచ్చుకునే ధోరణి ఉండాలన్నారు. యూసీలు ఇవ్వడంలేదని అనడం సరికాదన్నారు.

అమరావతి ట్రాఫిక్ విధానానికి
టోక్యో పర్యటన దోహదం



అమరావతి ఆంధ్రప్రభ: అమరావతి, విజయవాడ, గుంటూరు నగరాలకు అనువైన ట్రాఫిక్ విధానాన్ని ఎంచుకునేందుకు జపాన్ పర్యటన ద్వారా అవగాహన కలిగిందని, ఏపీసీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. అమరావతి రాజధాని నగరంలో, రాజధాని రీజియన్‌లో కాంప్రహెన్సివ్ ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రణాళికను అమలు చేసేందుకు గాను అధికారుల బృందం జపాన్ పర్యటనకు వెళ్లింది, ఏపిసిఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ నేతృత్వంలో విజయవాడ పోలీసు కమిషనర్ గౌతమ్‌సవాంగ్, నగరపాలకసంస్థ కమిషనర్ నివాస్, గుంటూరు కలెక్టర్ కోన శశిధర్, సిఆర్డీఏ ప్రిన్సిపల్ ప్లానర్ అరవింద్ తదితరుల బృందం శుక్రవారం నాడు టోక్యో నగరాన్ని సందర్శించారు. అక్కడి పోలీసు డిపార్ట్‌మెంట్ మెట్రోపాలిటన్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్‌ను అధికారుల బృందం పరిశీలించింది. జపాన్ అధికారులతో అక్కడి ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానం గురించి చర్చించారు. టోక్యో ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్‌ను అత్యాధునికంగా తీర్చిదిద్దారని, సిగ్నలింగ్, కంట్రోల్ అన్ని విభాగాల సమన్వయంతో పాటు ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించేందుకు అనువైన ఆదేశాలను గమనించామని శ్రీధర్ తెలిపారు.

ప్రజాసేవ చేస్తా!

(మొదటిపేజీ తరువాయి)

ఒత్తిడి, యోగా, పోటీని తట్టుకోవడం ఎలా అనే అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పరీక్ష ఒత్తిడిని తట్టుకోవడంలో ఆత్మవిశ్వాసం, శ్రద్ధ తాలూకు ప్రాముఖ్యతను ప్రధాని నరేంద్ర మోడీ ప్రముఖంగా ప్రస్తావించారు. మనమంతా ఎంతో నిజాయితీగా పరీక్షలకు సిద్ధమవుతాం. కానీ మనలో ఆత్మవిశ్వాసం ఉండదు. దాంతో చదువుకున్నవన్నీ చివరి నిముషంలో మరిచిపోతాం. మనల్ని మనం సవాల్ చేసుకోవడం ద్వారా, కష్టించి పనిచేయడం ద్వారా ఆత్మవిశ్వాసం కలుగుతుంది. మనమెప్పుడూ మనలను మెరుగుపరుచుకోవడం గురించి ఆలోచిస్తుండాలి అని విద్యార్థులకు సూచించారు. శ్రద్ధ అనేది చాలా పెద్ద విషయమని, నేర్చుకుంటేనే అది వస్తుందని ప్రజలు అనుకుంటారు. కానీ అది నిజం కాదు. ప్రతి ఒక్కరూ రోజంతా ఏదో ఒక పనిచేస్తుంటారు. దానికి సంపూర్ణమైన శ్రద్ధ అవసరం అని ప్రధాని తెలిపారు. నేడు నేను విద్యార్థిని.. మీరు నాకు ఎగ్జామినర్.



మీరు నాకు 10కి ఎన్ని మార్కులు ఇస్తారో తర్వాత ఇవ్వండి. నన్ను ప్రధాని కాకుండా మీ స్నేహితుడిగా భావించండి అని నరేంద్ర మోడీ అన్నారు. ఈ సందర్భంగా వచ్చే లోక్‌సభ ఎన్నికలకు మీరు ఎలా సిద్ధమవుతున్నారని ఒక విద్యార్థి ప్రధానమంత్రిని ప్రశ్నించారు. ఇందుకు బదులుగా నేనే కనుక మీ టీచర్ అయితే జర్నలిజం దిశగా నీకు మార్గదర్శనం చేసి ఉండేవాడినని మోడీ తెలిపారు. ఎందుకంటే జర్నలిస్టులే ఇలాంటి ప్రశ్నలు అడుగుతారని ఆయన చమత్కరించారు.

పోర్టు ఆధ్వర్యంలో
బీచ్ కోత నివారణ

• ఐఎన్ఎస్ కురుసుర మ్యూజియం వద్ద పనులు • రూ.18.37 కోట్ల వ్యయం
• విశాఖ పోర్టు చైర్మన్ ఎంటీ కృష్ణబాబు



విశాఖపట్నం, ప్రభ న్యూస్ : విశాఖలో బీచ్ కోత నివారణ పనులు రూ.18.37 కోట్లతో విశాఖపోర్టు చేపట్టింది. పోర్టు ఏరియాలో ఉన్న ఇసుకను డ్రెడ్జర్‌తో తవ్వి గతంలో విపరీతంగా కోతకు గురైన ఐఎన్ఎస్ కురుసుర ప్రాంతంలో వేస్తున్నారు. దీనిపై శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పోర్టు చైర్మన్ ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ ఈ డ్రెడ్జింగ్‌లో మూడు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీరంలో వేయాలనుకుని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 6వ తేదీన పనులు ప్రారంభంకాగా, 25 రోజులపాటు డ్రెడ్జింగ్ పనులు జరుగుతాయని అన్నారు. ఈ ఇసుక సుమారు 30వేల లారీ లోడులతో సమానమని పేర్కొన్నారు. విశాఖలో డ్రెడ్జింగ్ అవకాశంలేకపోతే లారీలతోనే ఇసుకను బీచ్‌కి తరలిస్తారని, ఇది ఖర్చుతో కూడిన వ్యవహారమని అన్నారు. 2016-17 నుంచి బీచ్ కోత నివారణ పనులు నిర్వహిస్తున్నామని, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) ఈ పనుల కాంట్రాక్టును పొందిందని అన్నారు. గత ఏడాది రూ.11.09 కోట్లతో 1.51 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వినట్లు తెలిపారు. ఇసుకను తీరానికి చేర్చేందుకు 500 మీటర్ల ఫ్లోటింగ్ పైపు, 80 మీటర్ల స్టీల్‌పైపుని వినియోగిస్తున్నామన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ అండ్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) సూచన మేరకు ఐఎన్ఎస్ కురుసుర జలాంతర్గామి మ్యూజియం వద్ద బీచ్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు. తూర్పు తీరంలో జూన్ నుంచి అక్టోబర్ వరకూ సముద్రం రఫ్‌గా ఉంటుందని, అందువల్ల ఆ సమయంలో బీచ్ కోత ఎక్కువ ఉంటుందన్నారు. తీరం కోత నివారణకు కట్టడాలు నిర్మిస్తే వ్యతిరేక ఫలితాల వస్తాయన్నారు. విశాఖలో రెండుమూడేళ్ళ క్రితం తీరం ఎక్కువ కోతకు గురైందని, బీచ్ రోడ్డు ఉంటుందా? అన్న పరిస్థితి వచ్చిందని అన్నారు. ఐఎన్ఎస్ కురుసుర జలాంతర్గామి మ్యూజియం వద్దే ఈ కోత ఎక్కువ జరిగిందన్నారు. దీంతో కోత నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టాలన్నదానిపై డెల్టారిస్ సంస్థకు కన్సల్టెంట్ బాధ్యతలు అప్పగించామన్నారు. ఈ సంస్థ తాత్కాలిక నివేదిక ఇచ్చిందన్నారు. తుది నివేదిక వచ్చిన తరువాత ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడుతుందన్నారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండగా 271 కిలోమీటర్ల ప్రాంతంలో తీరం కోతకు గురయ్యే అవకాశం ఉన్నట్టు తెలిందన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో విభిన్న హంగులు

• మధురవాడలో రాడిసన్ హోటల్ • తొట్లకొండలో వైశాలి సంస్థ ఐదు నక్షత్రాల హోటల్
• అధికారులకు సీఎం దిశా నిర్దేశం • పర్యాటక బోర్డు సమావేశంలో నిర్ణయం



అమరావతి, ఆంధ్రప్రభ: పర్యాటక ప్రాంతాలను ఆకర్షణీయంగా అభివృద్ధి చేసి విభిన్న పర్యాటక హంగులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే పర్యాటక ప్రాజెక్టుల్లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ బోర్డు సంచాలకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు కార్యక్రమాలను అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ భారత చరిత్ర, సంస్కృతిని అధ్యయనం చేయడం ద్వారా స్థానిక అంశాలను ఇతివృత్తాలుగా తీసుకొని భూమిక ద్వీపాన్ని అభివృద్ధి చేయాలన్నారు. మధురవాడ కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. రానున్న ఐదేళ్లలో విశాఖ అభివృద్ధికి అనుగుణంగా 25వేల హోటల్ గదులు అవసరం అవుతాయని చెప్పారు. అయితే ఇప్పటికి రెండున్నర వేల గదులు కూడా లేవని పేర్కొంటూ మంచి హోటళ్లు వచ్చినప్పుడే పర్యాటక రంగం అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందని తెలిపారు. ప్రఖ్యాత రాడిసన్ హోటల్, రిసార్ట్ మధురవాడలో ఏర్పాటు కానున్నట్టు చెప్పారు. రూ.200 కోట్ల పెట్టుబడితో 250 గదులు అందుబాటులోకి రానున్నట్టు చెప్పారు. మొత్తం మూడు దశల్లో హోటల్ నిర్మాణం కానుందని, ఇందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తొట్లకొండలో ఐదు నక్షత్రాల హోటల్, రిసార్ట్ నిర్మాణానికి వైశాలి హైట్స్ ప్రాజెక్టుకు అనుమతిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా రూ.105 కోట్ల పెట్టుబడితో 225 గదులను అందుబాటులోకి రానున్నాయని సీఎం చెప్పారు. విశాఖలో టీయూ మ్యూజియం తరహాలో రూ.20 కోట్లతో సబ్ మెరైన్ మ్యూజియం ఏర్పాటుకు సిద్ధమని నేవీ అధికారులు సీఎం చంద్రబాబు నాయుడుకు తెలిపారు. నేవీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా మ్యూజియం ఏర్పాటు చేయనున్నామని వారు వివరించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి భూమా అఖిల ప్రియ, పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, పర్యాటక సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, ప్రభుత్వ సీనియర్ అధికారులు, నేవీ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణా టూరిజం కాంక్లేవ్ అతిథిగా అఖిలప్రియ

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియను తెలంగాణ ఫ్యాప్సీ ప్రతినిధులు హైదరాబాదుకు ఆహ్వానించారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టూరిజం కాంక్లేవ్-2018కి అతిథిగా రావాలని వారు కోరారు. ఫ్యాప్సీ డైరెక్టర్ పి.వైదేహి, టూరిజం కాంక్లేవ్-2018 చైర్మన్ వాల్మీకి హరికృష్ణ శుక్రవారం అమరావతి సచివాలయంలో మంత్రి అఖిలప్రియను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో జూన్ 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే టూరిజం కాంక్లేవ్-2018కు ఏపీ నుంచి అతిథిగా ఆహ్వానిస్తున్నట్టు వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య పర్యాటక అభివృద్ధికి పరస్పర సహకారం కోరుతున్నామని డైరెక్టర్ వైదేహి వివరించారు. వచ్చే సెప్టెంబర్‌లో నిర్వహించే ఏపీ టూరిజం కాంక్లేవ్‌కు తెలంగాణ నుంచి తాము సహకారం అందించనున్నారు. దీనిపై మంత్రి అఖిల ప్రియ స్పందిస్తూ పర్యాటకాభివృద్ధికి ఇరు రాష్ట్రాల సమన్వయ ప్రాజెక్టులపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణా టూరిజం కాంక్లేవ్‌కు ఏపీ నుంచి ప్రతినిధి బృందం హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.

విజయవాడలో బౌద్ధ విహారం ఏర్పాటుకు కృషి

విజయవాడ నగరంలో బౌద్ధ విహారానికి పర్యాటక శాఖ కృషి చేస్తోందని మంత్రి అఖిలప్రియ హామీ ఇచ్చారు. బుద్ధుడి శాంతి బోధనలు మానవాళికి ఎంతో అవసరమన్నారు. విజయవాడ నగరంతో పాటు అమరావతి, భట్టిప్రోలు, ఘంటశాల వంటి క్షేత్రాలు బౌద్ధ చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని ఆమె చెప్పారు. అమరావతి సచివాలయంలో మంత్రి అఖిలప్రియతో బౌద్ధ గురువు ధమ్మరత్న భంతేజీ, విజయవాడ బుద్ధ విహార ప్రతినిధి గోళ్ల నారాయణరావు తదితరులు శుక్రవారం సమావేశమయ్యారు. విజయవాడలో బౌద్ధ ధర్మాన్ని విస్తరించడానికి బుద్ధ విహారం ఏర్పాటు చేయాలని, దీనికి కావాల్సిన స్థలాన్ని పర్యాటక శాఖ తరుపున కేటాయించాలని వారు మంత్రి అఖిలప్రియను కోరారు. బుద్ధుడి బోధనలతో ముద్రించిన సద్ధర్మ ఉపోస్థ క్యాలెండర్‌ను మంత్రి అఖిల ప్రియ ఆవిష్కరించారు. బుద్ధ ధర్మ సంఘం తరుపున నరేంద్రనాథ్ మంత్రికి కాలామ సూత్రం, ధర్మాచరణం, సమ్మావాచ పుస్తకాలను బహూకరించారు.

మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో
ఉమామహేశ్వరికి రాష్ట్రంలో టాప్ ర్యాంక్

దర్శి, ప్రభ న్యూస్: ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ఉమామహేశ్వరి మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో 16 ర్యాంక్ లభించింది. మెడికల్ పీజీ కోర్సులలో ప్రవేశానికి నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామ్స్ (ఎన్‌బీఇ) జనవరిలో ఎంట్రన్స్ నిర్వహించింది. ఇందుకు సంబంధించిన ర్యాంక్ కార్డులను శుక్రవారం విడుదల చేశారు. ఎండీ,ఎంఎస్ కోర్సులతో పాటు పీజీ మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి గాను ఈ నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహించారు.ఏపీకి సంబంధించి ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఈ పరీక్షలను నిర్వహించింది. అన్ని ర కాల పీజీ మెడికల్ కోర్సులు,డిప్లొమోలకు సంబంధించి దాదాపు 200 మ ందికి పైగానే ఈ పరీక్షలు రాసినట్లు సమాచారం. వందమందికిపైగానే అర్హత సాధించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆంధ్రా నుంచి విశాఖపట్నం నగరానికి చెందిన మరో విద్యార్ధికి 23 వ ర్యాంక్ వచ్చినట్లు సమాచారం. ఉమామహేశ్వరి గతంలో ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్షలోనూ ఉమ్మడి రాష్ట్రంలో రెండవ స్థానాన్ని సాధించింది. పీజీలో ఫస్ట్ ర్యాంకు సాధించిన ఉమామహేశ్వరి జనరల్ మెడిసన్ లేక రేడియాలజీ విభాగాన్ని ఎంచుకోనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా దర్శికి చెందిన పలువురు ఉమామహేశ్వరికి అభినందనలు తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో దర్ శికి గుర్తింపు తీసుకురావడం పట్ల హర్షం వెలిబుచ్చారు.

ఉమామహేశ్వరి కుటుంబ నేపథ్యం..

ఉమామహేశ్వరి తల్లిదండ్రులు నాగిరెడ్డి, లక్ష్మీరాజ్యంలు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. నాగిరెడ్డి అనారోగ్యంతో ఆరేళ్ల క్రితం మృతిచెందారు. అప్పటికే ఉమామహేశ్వరి ఎంబీబీఎస్‌లో ఉమ్మడి రాష్ట్రంలో రెండవ ర్యాంకు సాధించింది. కుమార్తె డాక్టర్ కాబోతున్న వార్తను తెలుసుకున్న నాగిరెడి ఆనందానికి అవధు ల్లేకుండా పోయాయి. అయితే అనారోగ్యం రూపం లో విధి ఆయనను కుటుంబానికి దూరం చేసింది. పట్టుదలతో తల్లి రాజ్య లక్ష్మి ప్రోత్సా వాంతో ఉమా మహేశ్వరి ఉస్మానియా మెడికల్ కళాశాలలో



కష్టపడి చదివి ఎంబీబీఎస్ పూర్తిచేసింది. చదువులో విశేష ప్రతిభ కనబరిచింది. అదే స్ఫూర్తితో మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో తెలుగు రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన ఉమామహేశ్వరి 6,7 తరగతులు కురిచేడు ప్రభుత్వ హైస్కూల్‌లో, 10వ తరగతి దర్శి సిద్దార్థ హైస్కూల్‌లో, ఇంటర్ విజయవాడ చైతన్య కళాశాలలో విద్యనభ్యసించింది.

పేదలకు సేవ చేయాలన్నదే ఆశయం : ఉమామహేశ్వరి

ఇంటర్ చదువుతున్నప్పుడే నా తండ్రి అనారోగ్యానికి గురై మరణించాడు. తల్లిప్రోత్సాహంతో నాన్న ఆశయాలకు అనుగుణంగా ఎంబీబీఎస్ పూర్తిచేశా. పీజీలో ఫస్ట్ ర్యాంకు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. తండ్రి ఆశయం మేరకు పేదలకు సేవచేస్తానని ఉమామహేశ్వరి ఆంధ్రప్రభకు తెలిపింది. రేడియాలజీ జనరల్ మెడిసిన్‌లో చేరనున్నట్లు చెప్పింది.

అగ్నిమాపక శాఖ పరిధిలోకి
సివిల్స్ డిఫెన్స్ ఆర్గనైజేషన్

• ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ పరిధిలోకి 'సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్'ను తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వేసవిలో అగ్ని ప్రమాదాలు, వర్షాకాలంలో వరదలు, ఇతరత్రా విపత్తులు వచ్చినప్పుడు అగ్నిమాపక, విపత్తు స్పందన సంస్థ సేవలు అందిస్తోంది. ఇటీవల కాలంలో ఆ శాఖ అవసరం మరింతగా పెరిగింది. తరుచూ విపత్తులు సంభవించినప్పుడు ఆ శాఖ అందిస్తున్న సేవలు అనేకం. ఇందులో భాగంగా ఆయా విపత్తుల సమయంలో సిబ్బంది స్పందనకు సంబంధించి అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భారీ వరదలు, తుఫాన్లు సహా విపత్తు ఏదైనా అగ్నిమాపక సిబ్బంది సేవలు అందించే విధంగా ఇప్పటికే రూపుదిద్దారు. ఇదే సమయంలో ఆ శాఖలో నెలకొన్న సిబ్బంది కొరత కొంత ఇబ్బందిగా మారింది. దీనిని అధిగమించేందుకు పౌర సేవకుల(వాలంటీర్ల) సహకారాన్ని తీసుకుంటున్నారు. విపత్తుల సమయంలో స్వచ్ఛంధ సేవకు వినియోగించే వాలంటీర్లు సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ కింద పని చేయాల్సి ఉంటుంది. దీనిని జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షిస్తుంటారు. అయితే వాలంటీర్ల సేవల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాల్లోని అగ్నిమాపక కేంద్రాల పరిధిలో ఇప్పటికే పెద్ద సంఖ్యలో వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అగ్ని ప్రమాదాలు, నీటిలో మునిగిన వ్యక్తులను రక్షించడం, ప్రమాదానికి గురైన వారికి ప్రాథమిక వైద్య సేవలు అందించడం వంటి పలు అంశాల్లో వీరికి తగిన తర్ఫీదు ఇస్తున్నారు. శిక్షణ వరకు బాగానే ఉన్నప్పటికీ వీరు జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో ఉండటం వలన సేవల వినియోగం అంతగా ఉండటం లేదు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ ప్రకాశ్ మిశ్రా రాష్ట్ర పర్యటన సందర్భంగా ఇదే అంశంపై దృష్టిసారించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీనిని పరిశీలించిన ఏపీ ప్రభుత్వం సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్‌ను అగ్నిమాపక శాఖ పరిధిలోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర అగ్నిమాపక శాఖ, విపత్తు స్పందన డైరెక్టర్ జనరల్ పర్యవేక్షణలో ఇది పని చేస్తుంది. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఈ విభాగానికి డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

మా పరిధిలోకి తెచ్చారు

సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్‌ను అగ్నిమాపక శాఖ పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర అగ్నిమాపక శాఖ, విపత్తు స్పందన సంస్థ డైరెక్టర్ జనరల్ కె.సత్యనారాయణ చెప్పారు. ఆంధ్రప్రభ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ దానికి తాను డైరెక్టర్‌గా వ్యవహరిస్తాను తప్ప అగ్నిమాపక శాఖ పేరు మార్చినట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

'ఎప్సిలాన్ పై తౌ'
ఏఈడీగా డాక్టర్ వెంకట్

• ఏపీ ఉన్నత విద్యామండలి సలహాదారుకు ఉన్నత పదవి
• ఏఈడీగా ఎన్నికైన తొలి భారతీయ వ్యక్తిగా ఖ్యాతి



అమరావతి, ఆంధ్రప్రభ : సాంకేతిక , మేనేజ్‌మెంట్ రంగాలకు పెద్దపీట వేస్తూ ఈ రంగాల్లో ప్రతిభను గుర్తించి ,ప్రోత్సాహన్ని , చేయూతనున అంది స్తున్న ఎప్సిలాన్‌పై తౌ సంస్థ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ ఈదర వెంకట్ ఎ ంపియ్యారు. ప్రస్తుతం వెంకట్ ఏపీ ఉన్నత విద్యామండలి సలహాదారుగా ఉన్నారు. ఈ మేరకు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కెవిన్‌ఆర్ హోవెల్ ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక , మేనేజ్‌మెంట్ రంగాల్లో వెంకట్ చేసిన కృషికి గుర్తింపుగా ఆయన్ని ఈ పదవికి ఎంపిక చేసినట్లు ఎప్సిలాన్ పై తౌ సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల బృందం స్పష్టం చేసింది. అమెరికాలోని ఒహియో కేంద్రంగా 1929లో ఎప్సిలాన్ పై తౌ సంస్థ ఆవిర్భవించింది. టెక్నాలజీకి విశేష ప్రాధాన్యతను ఇస్తూ ఆ రంగాన్ని విశ్వ వ్యాప్తం చేసేలా టెక్నాలజీని అన్ని దేశాలు అందిపుచ్చుకునేలా అన్ని దేశాల విద్యార్ధులకు ఆ ఫలితాలు దక్కిందుకు కృషి చేస్తోంది.ఆసియా ఉపఖండంలోనూ భారతదేశంలోనూ ఉన్నత విద్యారంగంలో నాణ్యతను పెంపొందించేలా కృషి చేసేందుకు ఈ నియామకం దోహదం చేస్తుందని ఎప్సిలాన్ పై తౌ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పేర్కొన్నారు. తనను ఏఈడీగా నియమించడం చాలా సంతోషంగా ఉందని ,సంస్థకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు డాక్టర్ ఈదర వెంకట్ తెలిపారు.

లెండిలో
ఎన్ఎస్-2 క్వాల్ నెట్‌పై వర్క్‌షాప్

డెంకాడ, ప్రభ న్యూస్: జొన్నాడ వద్ద గల లెండి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్...2 క్వాల్ నెట్‌పై అవగాహన కొరకై ఒక రోజు కార్యశాల జరిగింది. ముఖ్య అతిథిగా రిసోర్సు పర్సన్ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ పల్లం శెట్టి విచ్చేసి కమ్యూనికేషన్ వ్యవస్థ పునరుద్ధరించడానికి నాణ్యమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన సాంకేతిక విషయాలైన ఎన్ఎస్ 2 క్వాల్‌నెట్‌పై అవగాహన కల్పించేందుకు వివిధ ప్రెజెంటేషన్స్, పవర్‌పాయింట్‌ల ద్వారా కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి. రామారెడ్డి రోజురోజుకు విస్తరిస్తున్న కమ్యూనికేషన్ వ్యవస్థలో వస్తున్న మార్పులను దీటుగా సాంకేతిక అంశాలను నేర్చుకోవాలని అన్నారు. కంప్యూటర్ విభాగాధిపతి ఏ. రామారావు మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న ఆవిష్కరణలకు ఎన్ఎస్2 , క్వాల్‌నెట్ సిమ్యులేటర్స్ ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ప్రొఫెసర్ రామారావు, నర్సింహరాజు, రమేష్‌రాజు వ్యవహరించగా అంజిరెడ్డి బి. సతీష్, బీఏ స్వామి, అధ్యాపకులు కార్యక్రమ నిర్వాహణను చూసారు.

లెండికు ఎన్‌పీటీఈఎల్ ఏ గ్రేడు అవార్డు

ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10 కళాశాలలో లెండి కూడా ఒకటైనందుకు కళాశాలకు ఏ గ్రేడును ప్రధానం చేస్తూ ఇటీవల జరిగిన కార్యక్రమంలో మద్రాసు ఐఐటీ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును కళాశాల అధ్యాపకులు అంజిరెడ్డి అందుకున్నారు. దీనికి కృషిచేసిన ఈ కోర్సుల్లో గోల్డ్‌మెడల్స్ సాధించిన ఉపాధ్యాయులను, విద్యార్ధులను ప్రిన్సిపాల్ , యాజమాన్యం అభినందించింది.

మెంటల్ హెల్త్ ప్రోగ్రాం ద్వారా
వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పోస్టులు

అమరావతి, ఆంధ్రప్రభ : జాతీయ మెంటల్ హెల్త్ కార్యక్రమం కింద రాష్ట్రంలో నిర్వహించనున్న మెంటల్ హెల్త్ కార్యక్రమ నిర్వహణకోసం అర్హులైన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో జారీ చేశారు. కన్సల్‌టెంట్ ఫిజియాట్రిస్ట్ పోస్టుకు నెలకు రూ. లక్ష వేతనంతో రెండేళ్లపాటు, క్లినికల్ ఫిజియాలజిస్టు పోస్టుకు నెలకు రూ. 27,500 వేతనంతో రెండేళ్లపాటు, ఫిజియాట్రిక్ నర్సు పోస్టుకు రూ. 20 వేల వేతనంతో, ఫిజియాట్రిక్ సోషల్ వర్కర్ పోస్టుకు రూ. 25 వేతలతోనూ, కేస్ రిజిస్ట్రీ అసిస్టెంట్‌కు రూ. 15 వేల జీతంతో ఏడాదిపాటు పనిచేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు చేశారు.

డ్రీమర్ల ఆశలపై నీళ్లు!

• వీగిన చట్ట సవరణ బిల్లు • ముంచుకొస్తున్న డెడ్‌లైన్ • భారతీయుల్లో ఆందోళన

వాషింగ్టన్ : అమెరికా వలస విధానంలో మార్పులపై ప్రవేశపెట్టిన బిల్లు ఎగువ సభ తిరస్కరించడంతో డ్రీమర్లకు నిరాశే ఎదురైంది. దీంతో అమెరికాలో నివాసం ఉంటున్న భారతీ యుల ఆశలు అడియాశలయ్యాయి. సెనేటర్లు ట్రంప్ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చినా రిపబ్లికన్ ప్రణాళికలకు తగినన్ని ఓట్లు రాకపోవడంతో బిల్లు తిరస్కరించబడింది. లాటరీ తరహాలో వీసా ఇచ్చే విధానాన్ని ట్రంప్ వ్యతిరేకించారు. 1.8 మిలియన్ ప్రజలు అమెరికాలో సరైన పత్రాలు లేకుండా నివా సం ఉంటున్నారు. బిల్లు పాస్ కావాలంటే కనీసం 60 ఓట్లు రావాల్సి ఉండగా, కేవలం 54-45 ఓట్లు మాత్రం వచ్చాయి. దీంతో డ్రీమర్లకు నిరాశ తప్ప లేదు.సమస్యను పరిష్కరిం చేందుకు కాం గ్రెస్‌కు ఆరునెలల గడువు ఇచ్చారు. డ్రీమర్లకు అమెరికా పౌరసత్వం అందించేందుకు సాను కూలంగానే ఉన్నా సరిపడా ఓట్లు రాకపోవ డంతో బిల్లు వీగిపోయింది. మార్చి 5 డెడ్‌లైన్ ఉండ టంతో డ్రీమర్లలో ఒకింత ఆందోళన ప్రారంభమైనం ది. వీసా జారీలో లాటరీ విధానం రద్దు, గ్రీన్ కార్డు ల సంఖ్య పరిది ఎత్తివేత వంటి బిల్లును ఎగువ సభ తిరస్కరించింది.

నెల్లూరు జిల్లాలో..
ముగిసిన జగన్ పాదయాత్ర

• 24 రోజులపాటు... 245 కి.మీ. మేర సాగిన ప్రజా సంకల్ప యాత్ర • 9 బహిరంగ సభలు... 4 ఆత్మీయ సమ్మేళన సదస్సులు • కలిగిర వద్ద రాష్ట్ర స్థాయి నాయకులతో... అత్యవసర సమావేశం • ప్రత్యేక హోదా పోరుపై... సంచలన నిర్ణయాలు • వైకాపా శ్రేణుల్లో నూతనోత్సాహం.. కొందరిలో నిరుత్సాహం

నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాలో నిర్వహించిన ప్రజాసంకల్పయాత్ర విజయవంతంగా ముగిసింది. 9 నియోజకవర్గాల పరిధిలో సుమారు 105 గ్రామాల మీదుగా సాగిన పాదయాత్రలో జగన్ వాడివేడి వ్యాఖ్యలతో అధికారపక్షంపై ఎదురుదాడికి దిగుతూ వచ్చారు. ప్రత్యేకించి ఆయన నిర్వహించిన బహిరంగ సభలన్నీ సూపర్ సక్సెస్ కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం పరుగుతీస్తోంది. ఇదే సందర్భంలో ఆ పార్టీకి చెందిన కొందరు ప్రథమస్థాయి నేతల్లో నిరుత్సాహం సైతం వ్యక్తమవుతోంది. అందుకు బలమైన కారణాలు లేకపోలేదు. గతనెల 23న సూళ్ళూరపేట నియోజకవర్గ పరిధిలో పెళ్ళకూరు మండలం పునబాక గ్రామానికి చేరుకోవడంతో ఆయన యాత్ర జిల్లా నుంచి ప్రారంభమైనట్లైంది. అప్పటినుంచి 24 రోజులపాటు ఆయన జిల్లాలోనే యాత్ర సాగించారు. మధ్యలో నాలుగు రోజులు వివిధ కారణాల వల్ల పాదయాత్రకు బ్రేక్ పడింది. అయితే మొత్తమ్మీద ఆయన 245 కి.మీల మేర జిల్లాలో పాదయాత్ర చేపట్టారు. ప్రత్యేకించి ప్రతి నియోజకవర్గంలోనూ ఓ బహిరంగసభ నిర్వహించాలని, ఆ దిశగా ముందస్తు ప్రణాళికలతో ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు భారీ ఏర్పాట్లు చేపట్టడంతో నాయుడుపేటనుంచి మొదలైన బహిరంగసభలకు ఆ పార్టీ నాయకుల అంచనాలకు మించి ప్రజలు హాజరయ్యారు. ఈ విషయంలోనే అధినేతతో పాటు జిల్లా నాయకులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గూడూరు, సైదాపురం, పొదలకూరు, మోపూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం, దగదర్తి, కలిగిరి ప్రాంతాల్లో నిర్వహించిన సభలకు వైకాపా కార్యకర్తలతో పాటు ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేకించి ప్రతి బహిరంగసభ సాయంత్రం 4.30 తరువాతే ప్రారంభం కావడం, ఆయా సభలకు సంబంధించి జగన్ ప్రసంగాన్ని వినేందుకు ప్రజలు మధ్యాహ్నం 2 గంటలనుంచే మండుటెండలో నిలబడే సభ ముగిసే వరకు వేచిఉండడం, ఆయన ప్రసంగాల మధ్యలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై తనదైన శైలిలో విమర్శల బాణం వదిలినప్పుడు ప్రజలనుంచి పెద్దఎత్తున స్పందన లభించింది.



వీటితో పాటు సైదాపురం వద్ద చేనేత కార్మికుల ఆత్మీయ సమ్మేళన సదస్సు, దేవరపాళెం వద్ద ఆర్యవైశ్యుల సమ్మేళన సదస్సు, హసనాపురం వద్ద ముస్లిం మైనారిటీల సదస్సు, రేణమాల వద్ద మహిళా చైతన్య సదస్సు వంటి వివిధ సామాజిక వర్గాలకు చెందిన సదస్సులకు కూడా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆయా ప్రాంతాల్లో సదస్సులకు సంబంధించి ఆయా ప్రాంత నాయకులు చేపట్టిన ఏర్పాట్లకు మించి ప్రజలు, మహిళలు హాజరై జగన్‌కు జేజేలు పలికారు. ప్రత్యేకించి చేనేత కార్మికుల సదస్సులో జగన్ మాట్లాడుతూ వైకాపా అధికారంలోకి వస్తే చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వారిని అన్నివిధాల ఆదుకోవడంతో పాటు ముడిసరుకు కొనుగోలుకు సంబంధించి కూడా సబ్సిడీ ఇస్తామన్నారు. అలాగే వారికి ఉచితంగా ఇళ్ళు నిర్మించి ఇవ్వడంతో పాటు ప్రతి చేనేత కార్మికుడికి లక్ష రూపాయలు వ్యక్తిగత రుణాలు వడ్డీ లేకుండా అందిస్తామన్నారు. దీంతో వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని చేనేత కార్మికుల నుంచి పెద్దఎత్తునస్పందన లభించింది. అలాగే దేవరకొండ వద్ద నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాధ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య సమ్మేళన సదస్సులో జగన్ వారిపై వరాలజల్లు కురిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు జీఎస్టీ వంటి అంశాలపై వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా హసనాపురం వద్ద నిర్వహించిన ముస్లిం మైనారిటీ సదస్సుకు జిల్లావ్యాప్తంగా ముస్లిం సోదరులంతా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ముస్లిం సదస్సులో జగన్ మైనారిటీలను అన్నివిధాలా ఆదుకోవడంతో పాటు దశాబ్దాలపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వారికోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే కొండాపురం మండలం రేణమాల వద్ద నిర్వహించిన మహిళా సదస్సులో జగన్ మాట్లాడుతూ మహిళలపై వరాల జల్లు కురిపించారు. వైసీపీ అధికారంలోకి వస్తే మహిళలకు రక్షణ విషయంలో ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చి వారికి పూర్తిస్థాయి భద్రత కల్పిస్తామన్నారు. అలాగే పొదుపు సంఘాలకు సంబంధించి ఇప్పటివరకు ఉన్న రుణాల మొత్తాన్ని మాఫీ చేస్తామన్నారు. గతంలో వలె వడ్డీలేని రుణాలను అందిస్తామన్నారు. ప్రత్యేకించి మహిళల పేరుమీద పక్కా ఇళ్ళు నిర్మించి వారికిస్తామన్నారు. భవిష్యత్తులో బ్యాంకుల ద్వారా ఆ ఇంటిపై రుణం తీసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ఇలా ఆత్మీయ సమ్మేళన సదస్సులో ఆయా సామాజికవర్గాలకు చెందిన వారిని ఆకట్టుకునే విధంగా జగన్ హామీల వర్షం కురిపించారు. వీటన్నింటికీ మించి కలిగిరి వద్ద రాష్ట్రస్థాయి అత్యవసర సమావేశాన్ని నిర్వహించి ప్రత్యేక హోదాపై సంచలన నిర్ణయాలు ఆయన ఇక్కడినుంచే తీసుకున్నారు. అదేవిధంగా హోదాపై పోరుబాటకు సంబంధించిన కొన్ని కఠిన నిర్ణయాలతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రాజీనామాల సవాల్ కూడా ఇక్కడినుంచే విసిరారు. ఇలా సంచలన వ్యాఖ్యలతో అడుగడుగునా ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూ జగన్ యాత్ర జిల్లాలో విజయవంతంగా ముగిసింది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిలు జిల్లాలో జగన్ యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఆయన వెన్నంటే ఉంటూ ఎక్కడికక్కడ భారీ ఏర్పాట్లను చేస్తూ యాత్ర విజయవంతంలో కీలకపాత్ర పోషించారు. అయితే కొన్ని ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభలకు సంబంధించి ఆయా ప్రాంతాలకు చెందిన ద్వితీయస్థాయి నాయకులను వేదికపైకి ఆహ్వానించకపోవడంతో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశిస్తున్న పలువురు నాయకులకు నిరుత్సాహమే మిగిలింది.

చెన్నంపల్లి కోటలో
పంచలోహ విగ్రహాలు లభ్యం

• భారీ బందోబస్తుతో కర్నూలుకు తరలింపు



తుగ్గలి, పభ న్యూస్: కర్నూలు జిల్లా తుగ్గలి మండల పరిధిలోని చెన్నంపల్లి కోటలో శుక్రవారం పంచలోహ విగ్రహాలు లభ్యమయ్యాయి. గత సంవత్సరం డిసెంబర్13వ తేది నుంచి చెన్నంపల్లి కోటలో గుప్తనిధుల కోసం ప్రభుత్వ అధికారులు తవ్వకాలు చేపడుతున్నారు. అయితే శుక్రవారం జరిగిన తవ్వకాలతో రాముడు, లక్ష్మణుడు, సీత దేవిలకు చెందిన పంచలోహాల విగ్రహాలు దొరికాయి. ఈ విగ్రహాలు దాదాపు 30కేజీలపైగా వుండవచ్చునని అధికారులు తెలిపారు. కోటలో సీత, రామ, లక్ష్మణ విగ్రహాలు దొరికిన్నట్లు క్షణాలలో మండలవ్యాప్తంగా తెలియజేయడంతో వేలాది మంది ప్రజలు విగ్రహాలను చూసేందుకు కోటకు తరలిరావడం జరిగింది. ప్రజలు చూసిన తరువాత స్పెషల్ కలెక్టర్ సుబ్బారెడ్డి, ఆర్‌డీఓ ఓబులేసు, సీఐ విక్రమసింహాలు భారీ బందోబస్తుతో ఈ విగ్రహాలను కర్నూలుకు తరలించారు. విగ్రహాలతో పాటు పూజ సామాగ్రి అయిన గంట, చంబును, ప్లేట్లు కూడా దొరికాయి. వీటి విలువ దాదాపు కోట్లలో వుండవచ్చునని స్థానిక అధికారులు తెలిపారు. ఆర్‌డీఓ ఓబులేసు మాట్లాడుతూ అక్కడ లభ్యమైన పంచలోహ విగ్రహాలను కర్నూలుకు తీసుకువెళ్లి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ట్రెజరీ నందు భద్రపరచడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపాల్‌రావు, ఆర్ఐ మధుసూదన్‌రావు, సుదర్శన్, వీఆర్‌ఓ రవి, కాశీ రంగస్వామి, ఎస్ఐలు శేఖర్‌గౌడ్, నజీర్‌హమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగం చక్రతీర్థస్నానాలకు
పోటెత్తిన జనం

• 3 లక్షలమంది స్నానాలు



శ్రీకాకుళం(జలుమూరు), ప్రభ న్యూస్ బ్యూరో: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీముఖలింగం వద్ద వంశధారనదిలో శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమైన చక్రతీర్థస్నానాలకు భక్తులుపోటెత్తారు. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరిరోజున చక్రతీర్థస్నానాలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. గురువారం సాయంత్రం నుంచి భక్తులు వివిధ వాహనాలలో శ్రీముఖలింగంతోపాటు మిరియప్పల్లి ఇతర గ్రామాలకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాదాపు మూడు లక్షలమందికిపైగా ఈ చక్రతీర్థస్నానాలు చేసినట్లుగా అంచనావేస్తున్నారు. ప్రతి సంవత్సరం శ్రీముఖలింగంలో నిర్వహించే చక్రతీర్థ స్నానాలకు లక్షలాదిమంది భక్తులు స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. శ్రీముఖలింగేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులను ఎల్ఎన్ పేట మండలం మిరియప్పల్లి గ్రామం దరిలోని వంశధార నదిలో సంప్రదాయబద్ధంగా ఆలయ అర్చకులు వంశధార నదిలో స్నానాలు చేయించారు.

క్రీడాప్రభ

టీ20లో ఆస్ట్రేలియా రికార్డ్ బ్రేక్

- లక్ష్య ఛేదనలో భారత్‌ను అధిగమించిన ఆసీస్
- న్యూజిలాండ్‌పై ఆసీస్ 5వికెట్ల తేడాతో గెలుపు
- శివమెత్తిన ఆసీస్ బ్యాట్స్‌మన్లు.. పోర్లు సిక్సర్ల మోత



ఆక్లాండ్: బ్యాటింగ్ బద్దలు.. బంతి పగిలిపోయింది.. ఒకరికి మించి ఒకరు.. బ్యాటింగ్ బీభత్సం అంటే ఇదే. స్టేడియంలోని ప్రేక్షకుల కళ్లన్నీ ఆకాశం వైపే ఉన్నాయి. బంతి వేయడమే తరువాయి అది ఫోర్ లేదా సిక్స్‌గా మారింది. పరుగుల వరద పారింది. అందరి చూపు ఆకాశం వైపే.. బంతి ఫోర్ వెళుతుందా.. సిక్స్ పడుతుందా అని ఉత్కంఠతతో సాగింది. మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో రెండు జట్లు కలిసి చేసిన స్కోర్లు 487 పరుగులు. ఈ టీ20 మ్యాచ్ రికార్డ్‌లన్నీ తిరగరాసింది. న్యూజిలాండ్- ఆస్ట్రేలియా మ్యాచ్ క్రికెట్ చరిత్రలో సరికొత్త చరిత్రను లిఖించింది.ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ గ్రౌండ్‌లో శుక్రవారం న్యూజిలాండ్- ఆస్ట్రేలియా మధ్య ఐదో టీ-20 మ్యాచ్ జరిగింది. మొదట న్యూజిలాండ్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 243 పరుగులు చేసింది. న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ మార్టిన్ గుప్తిల్ 54 బంతుల్లోనే 105 పరుగులు చేశాడు. ఇందులో 6 ఫోర్లు, 9 సిక్స్‌లు ఉన్నాయి. కొలిన్ 33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76 పరుగులు చేశాడు. వీళ్లద్దరి భాగస్వామ్యం 181 పరుగులు. చివరికి న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ఇంత భారీ స్కోరు చేసిన న్యూజిలాండ్‌కు విజయం ఖాయం అని అందరూ అనుకున్నారు. బ్రేక్ తర్వాత ఆస్ట్రేలియా లక్ష్య ఛేదనకు దిగినప్పడు అసలు ఆట అప్పుడు మొదలైంది. డేవిడ్ వార్నర్.. 24 బంతుల్లో 59 రన్స్ చేశాడు. ఇందులో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు. వార్నర్‌ను న్యూజిలాండ్ బౌలర్ సోదీ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత షార్ట్ 44 బంతుల్లో 76 పరుగులు చేసి ఔటయ్యాడు. షార్ట్ 8 ఫోర్లు, 3 సిక్స్‌లు బాదాడు. మ్యాక్స్ వెల్ 3 ఫోర్లు, 2 సిక్స్‌ల సహాయంతో 14 బంతుల్లో 31 పరుగులు చేశాడు. ఆ తర్వాత వచ్చిన ఫిన్చ్ 14 బంతుల్లో 36 పరుగులు చేసి నాటౌట్‌గా మిగిలాడు ఇందులో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు ఉన్నాయి. స్టాయినిస్ 4 పరుగులు చేసి రనౌట్ కాగా, కేరీ ఒక పరుగుతో నాటౌట్ ఉన్నాడు. ఆస్ట్రేలియా 244 లక్ష్యాన్ని ఇంకా ఏడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించి ప్రపంచ రికార్డ్ సృష్టించింది. 2016లో వెస్టిండీస్‌తో ఆడిన టీ20లో విండీస్ ఇచ్చిన 245 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో భారత్ 244 పరుగులు చేసింది. ఇదే ఇప్పటివరకు రికార్డు. విండీస్ ఆ మ్యాచ్‌లో ఒక పరుగు తేడాతో గెలిచింది. తాజాగా ఆసీస్ 244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి కొత్త రికార్డును తనపేరిట ఆస్ట్రేలియా రాసుకుంది.

పారా సైక్లిస్టు బృందానికి క్రీడాశాఖ మంత్రి రాథోడ్ అభినందనలు



న్యూఢిల్లీ: మయన్మార్‌లోని నెప్యిదాలో జరిగిన ఆసియా పారా సైక్లింగ్ ఛాంపియన్ షిప్ క్రీడల్లో భారత పారా- సైక్లిస్టు బృందం ఒక రజతం, రెండు కాంస్య పతకాలను గెలుచు కున్నందుకు కేంద్ర క్రీడల శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మంత్రి ఒక ప్రకటనను సోషల్ మీడియాలో విడుదల చేశారు. 'ఆసియా పారా సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ క్రీడల్లో పారా అథ్లెట్లు భారత జెండాను రెపరెపలాడించడం దేశానికి గర్వకారణం. అథ్లెట్లందరికి నా శుభాకాంక్షలు. వారు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలి' అని ట్వీట్ చేశారు. దివిజ్ షా రజత పతకంను గెలువగా, బీఎస్‌ఎఫ్ జవాను హరీందర్ సింగ్, మధు బాగ్రి కాంస్య పతకంను గెలుచుకున్నారు. పారా సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(సీఎఫ్ఐ) తరపున టీం మేనేజర్‌గా వ్యవహరించిన కె దత్తాత్రేయ కూడా పతకాలు సాధించిన పారాసైక్లింగ్ బృందానికి అభినందనలు తెలిపారు. వికలాంగులైనప్పటికి వారు ధైర్యంతో పోటీలో పాల్గొని పతకాలు గెలవడం దేశానికి గర్వకారణమన్నారు.

మిథాలి, మంధానల మెరుపులు

- రెండో టీ20లో సఫారీలపై 9వికెట్ల తేడాతో విజయం
- ఫ్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ మిథాలిరాజ్

ఈస్ట్ లండన్(దక్షిణాఫ్రికా): మిథాలి రాజ్, ఓపెనర్ స్మృతి మంధాన అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ రెండో టీ 20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను మట్టి కరిపించింది. దీనితో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. శుక్రవారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్‌ను ఎంచుకుంది. భారత బౌలర్లలో స్పిన్నర్లు పూనం యాదవ్, అంజూ పాటిల్ చెరి రెండు వికెట్లు తీయగా, పేసర్లు పూజా, శిఖాలు తలో వికెట్‌ను చేజిక్కించుకున్నారు. మొత్తానికి దక్షిణాఫ్రికా జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన భారత మహిళా క్రికెటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ఓపెనర్లు మంధాన, మిథాలిలు రెచ్చిపో యారు. సఫారీల బౌలింగ్‌ను చీల్చి చెండాడారు. భారత్ 10 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 74 పరుగులు చేసింది. మంధాన తన అర్ధ శతకాన్ని 34 బంతుల్లో



మంధానల

పూర్తిచేసుకుంది. అనంతరం మరో ఏడు పరుగులు చేసిన మంధాన డేనియల్స్ బౌలింగ్‌లో వెనుదిరిగింది. మంధాన 41 బంతుల్లో 57 పరుగులు చేసింది. ఇందులో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లున్నాయి. ఆమె స్థానంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ బ్యాటింగ్‌కు వచ్చింది. మిథాలి 48 బంతుల్లో టీ20ల్లో తన 12వ అర్ధ శతకాన్ని పూర్తి చేసుకుంది. మిథాలి, కౌర్ లు సఫారీల బౌలర్లు ఏమాత్రం ఇబ్బం ది పెట్ట లేక పోయారు. భారత్ 19.1 ఓవర్లలో ఇంకా ఐదు బం తు లు మిగిలి ఉం డగానే విజయం సా ధించింది. 61 బం తుల్లో 76 పరుగులు చేసి నా టౌ ట్‌గా నిలిచి న మి థాలి రాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అ వా ర్డ్ ు లభించింది. కౌర్ ఏడు పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది.



మిథాలి

సంక్షిప్త స్కోర్లు:

దక్షిణాఫ్రికా బ్యాటింగ్: 142/7(సునె ల్యూస్ 33, నాడైన్ డి క్లెర్క్ 26)
భారత్ బౌలింగ్:పూనం యాదవ్4-0- 18-2,అంజు పాటిల్ 4-0-37- 2 భారత్ బ్యాటింగ్: మిథాలి రాజ్ 76(61 బంతులు) స్మృతి మంధాన 57(42 బంతు లు)మొత్తం 144/1(19.1 ఓవర్లు)
దక్షిణాఫ్రికా బౌలింగ్: డేని యల్స్ 4-0-21-1

సిరీస్ మనదే!

- చివరి వన్డేలో 8 వికెట్ల తేడాతో గెలుపు
- రాణించిన భారత్ బౌలర్లు
- కోహ్లీ శతకం
- ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్, ప్లేయర్‌ఆఫ్ ది సిరీస్ కోహ్లీ





సెంచూరియన్: కోహ్లీ సేన మరో అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సిరీస్‌లో చివరి మ్యాచ్‌ను కూడా గెలిచి సిరీస్‌ను 5-1 తేడాతో గెల్చుకుంటామని సవాలు చేసిన కోహ్లీ ఈ విజయంతో తనకు ఎదురులేదని చాటాడు. ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన చివరి వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 5-1 తేడాతో గెలుచుకుంది. ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మరోసారి మెరిశాడు. కెప్టెన్‌గా రాణిస్తూ, అటు బ్యాటింగ్‌లో కూడా రాణిస్తూ తనకు ఎదురులేదని చాటాడు. సెంచరీ చేయడమేకాక భారత్ విజయం సాధించేవరకు బ్యాటింగ్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. కోహ్లీకి తోడుగా రహానే బ్యాటింగ్ చేస్తూ నాటౌట్ నిలిచాడు. అద్భుత ఆటతో రాణించిన కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌లో భారత బౌలర్లు రెచ్చిపోగా, అనంతర సెషన్‌లో భారత బ్యాట్స్‌మన్లు కదం తొక్కారు. వన్డే సిరీస్‌లో అటు భారత బ్యాట్స్‌మన్లు, బౌలర్లు గొప్పగా రాణించారు. అయితే ఐదో వన్డేలో సెంచరీ చేసిన రోహిత్ శర్మ ఈసారి కేవలం 15 పరుగులు చేసి ఎన్గిడి బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచిచ్చి వెనుదిరిగాడు. ధావన్ కూడా ఎన్గిడి బౌలింగ్‌లో 18 పరుగులు చేసి జాండోకు క్యాచిచ్చి ఔటయ్యాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లీ, రహానేలు సఫారీల బౌలింగ్‌ను చితక బాదారు. కోహ్లీ 96 బంతుల్లో 129పరుగులు చేశాడు. కోహ్లీ వన్డేల్లో తన 35వ శతకాన్ని పూర్తి చేశాడు. మొత్తానికి భారత్ 32.1 ఓవర్లలో 206 పరుగులు చేసి విజయం సాధించింది. అంతకు ముందు భారత్ టాస్ గెలిచి సఫారీలను బ్యాటింగ్ చేయాలని కోరింది. అరంభం నుంచే దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లను భారత బౌలర్లు బంబేలెత్తించారు. యువ పేసర్ శార్దూల్ ఠాకూర్ అద్భుతంగా రాణించాడు. భువనేశ్వర్ స్థానంలో ఆడుతున్న ఠాకూర్ బుమ్రాతో కలిసి బౌలింగ్‌ను ప్రారంభించాడు. ఠాకూర్, ఇన్నింగ్స్ 7వ ఓవర్‌లో మూడో బంతితో దక్షిణాఫ్రికాలో తన తొలి వికెట్‌ను చేజిక్కించుకున్నాడు. బంతిని కట్ చేయబోయిన ఆమ్లా కీపర్ ధోనికి క్యాచిచ్చాడు. ఆమ్లా 10 పరుగుల మాత్రమే చేయగలిగాడు. అనంతరం పదో ఓవర్లో కెప్టెన్ మర్‌క్రమ్ వికెట్‌ను కూడా ఠాకూర్ పడగొట్టాడు. మర్‌క్రమ్24 పరుగులుచేసి ఠాకూర్ బౌలింగ్‌లో శ్రేయాస్ క్యాచ్‌పట్టగా ఔటయ్యాడు. పెహ్లూక్‌వయో, బెహ్రాదీన్ వికెట్లను కూడా ఠాకూర్ చేజిక్కించుకున్నాడు. మొత్తానికి ఠాకూర్ 8.5 ఓవర్లు బౌలింగ్ చేసి 52 పరుగులకు 4 వికెట్లు తీశాడు. స్పిన్నర్ యాదవ్ 51 పరుగులకు 1 వికెట్ తీయగా, మరో స్పిన్నర్ చాహల్ 38 పరుగులకు 2 వికెట్లు కూల్చాడు. వీరిద్దరు మొత్తం ఆరు వన్డేల్లో 33 వికెట్లు పడగొట్టారు. పేసర్ బుమ్రా 24 పరుగులకు రెండు వికెట్లు చేజిక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లలో ఓ మాదిరి స్కోర్ చేసిన వారిలో కాయో జాండో (54 పరుగులు), డివిల్లియర్స్ (30), పెహ్లూక్ వాయో (34 పరుగులు)

ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో స్పిన్నర్లు తీసిన అత్యధిక వికెట్లు

దేశాలు	ఆతిథ్య దేశం	వికెట్లు	మ్యాచ్‌లు	సంవత్సరం
శ్రీలంక, ఇంగ్లండ్	శ్రీలంక	38	7	2014
బంగ్లాదేశ్, జింబాబ్వే	బంగ్లాదేశ్	37	5	2009
బంగ్లాదేశ్,వెస్టిండీస్	బంగ్లాదేశ్,	33	5	2012
భారత్, దక్షిణాఫ్రికా	దక్షిణాఫ్రికా	33	6	2018
బంగ్లాదేశ్, జింబాబ్వే	బంగ్లాదేశ్,	32	5	2014
జింబాబ్వే, కెన్యా	జింబాబ్వే	32	5	2009

నా కెరియర్‌లో ప్రతీరోజు భారీ స్కోరు చేస్తా: కోహ్లీ

ఆడిన ప్రతీసారి ఎక్కువ పరుగులు చేయాలని కోరుకుంటున్నట్లు కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. చివరి వన్డే అనంతరం అవార్డుల ప్రదానం సందర్భంగా కోహ్లీ మాట్లాడుతూ.. ఇంకా నేను ఎనిమిది లేదా తొమ్మిదేళ్ల పాటు ఆడతానేమో. ప్రతీరోజు బాగా ఆడి ఎక్కువ పరుగులు చేయాలనుకుంటున్నాను అని కోహ్లీ అన్నాడు. ఈ వన్డే సిరీస్‌లో కోహ్లీ 558 పరుగులు చేయడమే కాక, సిరీస్‌ను 5-1 తేడాతో భారత్‌కు అందిచాడు. కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులను గెలుచుకున్నాడు. తన గెలుపు వెనుక తన భార్య అనుష్క శర్మ ఉందని కోహ్లీ అన్నాడు. కష్టకాలంలో ఆమె నా వెన్నంటే నిలిచి ప్రోత్సహిం చదన్నా డు. అంతేకాక, భారత అభిమా నులు ఇచ్చిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపాడు.

ద్వైపాక్షిక సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లు గెలిచిన సందర్భాలు

2013లో జింబాబ్వేలో 5-0, 2017లో శ్రీలంకలో 5-0
2018లో దక్షిణాఫ్రికాలో 5-1

అత్యధిక సెంచరీలు చేసిన కెప్టెన్‌లు

రికీ పాంటింగ్ 220 ఇన్నింగ్స్‌లు 22, డివిల్లియర్స్ 98 ఇన్నింగ్స్‌లు 13
రాట్ కోహ్లీ 46 ఇన్నింగ్స్‌లు 13, గంగూలి 143 ఇన్నింగ్స్‌లు 11
జయసూర్య 118 ఇన్నింగ్స్‌లు 10

దక్షిణాఫ్రికాలో ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక పరుగులు

కోహ్లీ 558 దక్షిణాఫ్రికాపై 2018 (6 ఇన్నింగ్స్‌లు)
పీటర్సన్ 454దక్షిణాఫ్రికాపై 2005(6 ఇన్నింగ్స్‌లు)
ఆమ్లా 413 వెస్టిండీస్‌పై 2015 (4 ఇన్నింగ్స్‌లు)
డు ప్లెస్సిస్ 410 శ్రీలకంపై 2017 (5 ఇన్నింగ్స్‌లు)

ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక పరుగులు

విరాట్ కోహ్లీ 558 దక్షిణాఫ్రికాపై (6 ఇన్నింగ్స్‌లు) 2018
రోహిత్ శర్మ 491 ఆస్ట్రేలియాపై (6 ఇన్నింగ్స్‌లు) 2013
బెయిలీ 478 భారత్‌పై (6 ఇన్నింగ్స్‌లు) 2013
మసాకడ్జా 467 కెన్యాపై 5 ఇన్నింగ్స్‌లు) 2009

3 సెంచరీలు ఒక సిరీస్‌లో

గంగూలి దక్షిణాఫ్రికాలో 2003 ప్రపంచకప్‌లో
వివిఎస్ లక్ష్మన్ ఆస్ట్రేలియాలో, విబి సిరీస్ 2004
విరాట్ కోహ్లీ దక్షిణాఫ్రికాలో 2018

ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక వికెట్లు

జె. శ్రీనాథ్ న్యూజిలాండ్‌పై 18 వికెట్లు 2002/03 (7)
మిశ్రా జింబాబ్వేపై 18 వికెట్లు 2013 (5)
ప్యాటర్సన్ భారత్‌పై 17 వికెట్లు 1987 (6)
మాథ్యూస్ ఆస్ట్రేలియాపై17 వికెట్లు 1994(7)
కుల్దీప్ యాదవ్ దక్షిణాఫ్రికాపై 17వికెట్లు 2108(6)

దక్షిణాఫ్రికా బ్యాటింగ్

ఏడెన్ మర్‌క్రం (సి) శ్రేయాస్ (బి)ఠాకూర్ 24, , హషీం ఆమ్లా (సి) ధోనీ (బి)ఠాకూర్10, డివిల్లియర్స్ (బి) చాహల్ 30, జోండో (సి)పాండ్యా (బి) చాహల్ 54,క్లాసెన్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 22, బెహ్రాదీన్ (సి) ఠాకూర్(బి) బుమ్రా 1, క్రిస్ మోరిస్ (సి) ధావన్ (బి) యాదవ్ 4, పెహ్లుక్‌వాయో (సి) (బి) ఠాకూర్34,మోర్కెల్(సి)శ్రేయాస్(బి) పాండ్యా20, తాహిర్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 2, ఎన్గిడి నాటౌట్0 ఎక్స్ట్రాలు: 3, (మొత్తం 46.5 ఓవర్లలో 204 ఆలౌట్)

వికెట్ల పతనం:23-1, 43-2,105-3,135-4,136-5,142-6,151-7,187-8,192-9,204-10

బౌలింగ్:

ఠాకూర్ 8.5-0-52-4 ,జస్‌ప్రీత్ బుమ్రా 8-1-24-2
హార్దిక్ పాండ్యా 10-0-39-1, యజువేంద్ర చాహల్ 10-0-51-1
కులదీప్ యాదవ్, 10-0-38-2

భారత్ బ్యాటింగ్:

రోహిత్ శర్మ (సి)క్లాసెన్ (బి) ఎన్గిడి 15, శిఖర్ ధావన్ (సి)జాండో (బి)ఎన్గిడి 15, విరాట్ కోహ్లీ(కెప్టెన్)129 నాటౌట్, ఆజింక్యా రహానే నాటౌట్ 34 ఎక్స్ట్రాలు 10, (మొత్తం 32.1 ఓవర్లలో206/ 2 వికెట్లకు)
వికెట్ల పతనం 19-1,80-2,

బౌలింగ్:

మోర్కెల్ 7-042-0, ఎన్గిడి 8-1-54-2, మోరిస్ 6-0-36-0, పెహ్లుక్‌వాయో 4-0-27-0,ఇమ్రాన్ తాహిర్ 7.1-0-42-0

వింటర్ ఒలింపిక్స్ క్రాస్ కంట్రీ రేసింగ్‌లో జగదీష్‌కు 103వ స్థానం



ప్యోంగ్‌చాంగ్: భారత అథ్లెట్ జగదీష్ సింగ్ శీతాకాల ఒలింపిక్స్‌లో బలహీనమైన ఆటను ప్రదర్శించాడు. శుక్రవారం జరిగిన పురుషుల 15కి.మీ ఫ్రీ క్రాస్ కంట్రీస్కైయింగ్‌లో 103 స్థానంతో సరిపెట్టుకున్నాడు. 26 ఏళ్ల జగదీష్ తొలిసారిగా ఈ క్రీడల్లో పాల్గొంటున్నాడు. అల్పెన్సా క్రాస్ కంట్రీ స్కైయింగ్‌సెంటలోని ఫినిష్ లైన్‌ను 43.03 నిమిషాల్లో చేరుకొని జగదీష్ తన పోటీని పూర్తి చేశాడు. జగదీష్ సమయం స్వర్ణ పతకం గెలిచిన స్విట్జర్లాండ్‌కు చెందిన డారియో కొలొగ్నా కన్నా 9:16.4 నిమిషాలు ఆలస్యంగా ఫినిష్‌లైన్‌ను దాటాడు. నార్వేకు చెందిన సిమెన్ క్రూయెజర్ 34:02.2 నిమిషాలతో రజత పతకంను గెలుచుకోగా, రష్యాకు చెందిన డెనిస్ స్పిట్‌సోవ్ 34:06.9 నిమిషాలతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రారంభంలో 1.5 కి.మీ వద్ద భారత అథ్లెట్ స్విస్ క్రీడాకారుడికంటే 40 సెకండ్లు మాత్రమే వెనుకబడ్డాడు. పోటీ సాగుతున్న కొద్దీ వీరిద్దరి మధ్య అంతరం పెరుగుతూ పోయింది. అర్ధ భాగంలో జగదీష్ 4.28 నిమిషాలు వెనుకబడ్డాడు. ఫినిషింగ్ లైన్ చేరేసరికి జగదీష్ తన స్థానాన్ని ఇంకొంచెం మెరుగు పర్చుకునే అవకాశమున్నప్పటికి నిరాశపర్చాడు. క్రాస్ కంట్రీ స్కైయింగ్‌లో అథ్లెట్లు 15 కిలోమీటర్లపాటు మంచుతో కప్పబడ్డ ప్రాంతంలో సాగాల్సి ఉంటుంది. అతితక్కువ సమయంలో ఈ దూరాన్ని పూర్తిచేసిన వారు విజేతలుగా నిలుస్తారు. ప్యాంగ్‌చాంగ్ క్రీడల్లో భారత తరపున ఇద్దరు అథ్లెట్లు మాత్రమే పాల్గొంటున్నారు. మరొక అథ్లెట్ శివ కేశవన్ ఫిబ్రవరి 11న జరిగిన పురుషుల ల్యూజ్ క్రీడలో 34వ స్థానంలో నిలిచాడు.

హాకీ వరల్డ్ కప్‌లో పాకిస్థాన్ ఆడుతుంది!

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్‌లో జరగనున్న హాకీ వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో పాకిస్థాన్ కూడా పాల్గొంటుందని అధికార వర్గాలు తెలిపాయి. వరల్డ్ కప్‌లో ఆడేందుకు పాకిస్థాన్ క్వాలిఫై అయిన సంగతి తెలిసిందే. భువనేశ్వర్‌లో ఈ ఏడాది నవంబర్ 18 నుంచి డిసెంబర్ 16 వరకూ జరిగే హాకీ వరల్డ్ కప్ టోర్నీలో పాకిస్థాన్ ఆడే అవకాశాలు లేవని తొలుత వార్తలు వచ్చాయి. భారత్- పాకిస్థాన్ మధ్య సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌లో జరిగే వరల్డ్ కప్‌కు పాకిస్థాన్ దూరంగా ఉంటుందని భావించారు. అయితే హాకీ గవర్నింగ్ బాడీ పాక్ ఈ టోర్నీలో పాల్గొంటుందని పేర్కొంది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I
శనివారం 17 ఫిబ్రవరి 2018



మహా...రుచులు!

కూరల్లో రకరకాల వెరైటీలు చేయడంలో పెద్ద సమస్య ఉండదు కానీ...చిరుతిళ్లు టిఫిన్లు లాంటివి వెరైటీగా కావాలంటే కాస్త కష్టమే. ఎందుకంటే ఇడ్లీ, వడ, దోస, ఉప్మా...ఇలా ఓ అయిదారు టిఫిన్లే తెలుగువారిళ్లలో తిరుగుతుంటాయి. ఇవి కాకుండా ఏం చేయవచ్చు....అనే ప్రశ్నకు సమాధానంగా...ఈ మహారాష్ట్ర రుచులను ప్రయత్నించవచ్చు... ఇంట్లో వారికి ఇవి నచ్చితే.. టిఫిన్లు చిరుతిళ్లలిస్టులో వీటిని కూడా చేర్చుకోవచ్చు-

కాజు కొత్తిమీర వడ

కావలసినవి

శనగపిండి- ఒకకప్పు, జీడిపప్పు- 30, పసుపు-అర టేబుల్ స్పూను, కారం- ఒక టేబుల్ స్పూను, సన్నగా తరిగిన పచ్చిమిర్చి-2, చింతపండు గుజ్జు-ఒక టేబుల్ స్పూను, ఉప్పు, నూనె- తగినంత, తాజా కొత్తిమీర తరిగినది- రెండు టేబుల్ స్పూన్లు

తయారుచేయు విధానం

◆ ఒక గిన్నె తీసుకుని నూనె తప్ప మిగిలినవి అన్నీ వేసుకుని బాగా కలపాలి. అర కప్పు నీళ్లు తీసుకుని వాటిని పోస్తూ...పిండిలో అన్నీ కలిసేలా చక్కగా కలుపుకోవాలి.

◆ పాన్ తీసుకుని అందులో నాలుగు స్పూనుల నూనె వేసుకుని సన్నని మంటమీద నూనెని కాగనివ్వాలి. తరువాత కలిపి ఉంచుకున్న పిండిని అందులో వేసుకుని ...బాగా తిప్పుతూ....అది ఉడికే వరకు పావుగంటనుండి 18 నిముషాల వరకు పొయ్యిమీదే ఉంచాలి. పిండి చక్కగా ఒక ముద్దలా తయారవుతుంది. పాన్‌ని పొయ్యిమీద నుండి దించేసి...ఒక ట్రేకి నూనెని రాసి...పిండిని దానిమీద పోసి...చక్కగా ట్రే మొత్తం విస్తరించేలా చేయాలి.
ఇది ఒక అంగుళం మందంలో ఉండాలి. దీనిని ఒక అరగంటపాటు అలాగే ఉంచితే చల్లారుతుంది. దాని ఆవిరి బయటకు పోకుండా దానికే పట్టేలా మూత పెట్టి ఉంచాలి. తరువాత ఈ మిశ్రమాన్ని రెండు అంగుళాల ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు మూకుడులో ఈ ముక్కలు మునిగేలా నూనె పోసుకుని...వీటిని బంగారు రంగు వచ్చేవరకు వేయించుకోవాలి. నూనె పీల్చుకునే పేపరు మీద వేసుకుని ...తరువాత కొత్తిమీర చెట్నీతో వేడిగా తింటే రుచిగా ఉంటాయి.

కాండీ పోహా



కాండీ అంటే ఉల్లిపాయలు. ఉల్లిపాయలతో చేసే అటుకుల తాలింపు ఇది. దీన్ని బటాటా పోహా అని కూడా అంటారు. మరాఠీలో బటాటా అంటే బంగాళదుంప అని అర్థం. ఈ కాండీ పోహా మహారాష్ట్రలో టీటైమ్ స్నాక్‌గా ఎక్కువగా తింటారు.

కావలసినవి

అటుకులు -రెండు కప్పులు, పల్లీలు-రెండు టేబుల్ స్పూనులు
జీలకర్ర- ఒక టేబుల్ స్పూను, పచ్చిమిర్చి-మూడు లేదా నాలుగు సన్నగా తరగాలి, ఉల్లిపాయ- ఒకటి (సన్నగా తరగాలి)
బంగాళదుంప - ఒకటి (చెక్కుతీసి సన్నని ముక్కలు చేసుకోవాలి)
పసుపు- అరటీస్పూను
ఉప్పు- తగినంత
నిమ్మకాయ- ఒకటి
కొత్తిమీర- తగినంత

తయారుచేయు విధానం

✶ అటుకులను కడిగి నీళ్లను పూర్తిగా వంపేయాలి. తక్కువ నీటితో కడిగితే అటుకులు పొడిగానూ, మృదువుగానూ ఉంటాయి.

✶ పొయ్యిమీద పాన్ పెట్టి...నూనె వేసుకుని పల్లీలు వేయించి పక్కన పెట్టుకోవాలి. తరువాత జీలకర్ర, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు వేసుకుని వేయించుకోవాలి.

✶ ఒక నిముషం తరువాత బంగాళదుంప ముక్కలు, పసుపు, ఉప్పు వేసుకుని సన్నని మంటమీద మరో నాలుగు నిముషాలు దుంపలు మెత్తగా మారే వరకు వేయించాలి. దుంపలను ఎంత పలుచని ముక్కలుగా చేసుకుంటే అంత తక్కువ నూనె పడుతుంది.

✶ బంగాళదుంప ముక్కలు వేగాక అటుకులను వేసుకుని అన్నీ బాగా కలిసేలా తిప్పుకోవాలి. పొయ్యిమీద నుండి దించాక నిమ్మకాయని పిండాలి.

✶ చివరగా కొత్తిమీర, పచ్చి ఉల్లిపాయ ముక్కలు వేసుకుని వడ్డించుకోవాలి. దీనిని పిల్లలకు లంచ్‌గా పెట్టినా ఇష్టంగా తింటారు.

సగ్గుబియ్యం కిచిడీ

కావలసినవి

సగ్గుబియ్యం- ఒక కప్పు, మీడియం సైజు బంగాళ దుంపలు-రెండు, వేయించిన పల్లీలు- అరకప్పు
కరివేపాకు- తగినంత , అల్లం- ఒక టీస్పూను సన్నగా తరిగిన ముక్కలు, పచ్చిమిర్చి-సన్నగా తరిగినది ఒకటి, జీలకర్ర- ఒక టేబుల్ స్పూను, పచ్చికొబ్బరి తురుము- పావు కప్పు(కావాలనుకుంటే), పంచదార- అరటేబుల్ స్పూను (కావాలనుకుంటే)
నిమ్మరసం- తగినంత, నెయ్యి లేదా నూనె-మూడు టేబుల్ స్పూనులు,ఉప్పు- తగినంత

తయారుచేయు విధానం



◆ సగ్గుబియ్యంని రాత్రే నానబెట్టుకోవాలి. లేదా మూడు నుండి ఐదు గంటలు నానితే సరిపోతుంది. తరువాత కడిగి నీళ్లని పూర్తిగా వంచేసి పక్కన పెట్టుకోవాలి.

◆ బంగాళదుంపలను ఉడికించి తోలుతీసి ముక్కలు చేసుకోవాలి.

◆ పల్లీలను వేయించి పొడి చేసుకోవాలి.

◆ సగ్గుబియ్యంలో పల్లీల పొడి, ఉప్పు, పంచదార వేసి బాగా కలపాలి.

◆ ఇప్పుడు పొయ్యిమీద పాన్ పెట్టుకుని నూనె లేదా నెయ్యి వేసుకుని జీలకర్ర వేసి వేయించాలి.

◆ తరువాత కరివేపాకు, పచ్చిమిర్చి వేసి అరనిముషం వేగాక సన్నగా తరిగిన అల్లం ముక్కలను కూడా వేసుకోవాలి. బంగాళదుంపల ముక్కలు కూడా వేసుకుని రెండు నిముషాలు వేగాక సగ్గుబియ్యం కూడా వేసుకుని బాగా కలిసేలా తిప్పాలి.

◆ సగ్గుబియ్యం బాగా ఉడికిన తరువాత తురిమిన కొబ్బరిని కూడా వేసుకుని కలియబెట్టి... పొయ్యిమీద నుండి దింపేయాలి. ఎక్కువ సమయం పొయ్యిమీద ఉంచితే సగ్గుబియ్యం మరీ ఎక్కువ పొడిగా మారుతుంది. అలా కాకుండా చూసుకోవాలి.

◆ చివరగా నిమ్మకాయ పిండుకుని, కొత్తిమీర చల్లుకుని వేడిగా వడ్డించుకుంటే రుచిగా ఉంటుంది.

బాసుందీ



చాలా తక్కువ సమయంలో తయారు చేసుకోగల స్వీటు ఇది

✶ తీయని కండెన్స్‌డ్ మిల్క్ (పాలలోంచి నీటిని తీసి పంచదార కలిపినవి) 400గ్రాములు
✶ వెన్నతీయని ఫ్యాట్ మిల్క్- అయిదు కప్పులు
✶ యాలకులు(చిన్నవి)- 5గ్రాములు
✶ జీడిపప్పు- 12 నుండి 15 వరకు
✶ పిస్తా పప్పు- 12 నుండి 15 వరకు
✶ బాదం పప్పులు- 15 వరకు
✶ కుంకుమ పువ్వు- తగినంత
✶ జాజికాయ పొడి- చిటికెడు

తయారీ విధానం

✶ పాలు, కండెన్స్‌డ్ పాలు రెండింటినీ మందపాటి గిన్నెలో పోసి బాగా కలపాలి

✶ ఎంత తీపి కావాలో దాన్ని బట్టి ఈ రెండు పాలకు సంబంధించిన పాళ్లు పెంచవచ్చు తగ్గించవచ్చు

✶ సన్నని మంటమీద ఈ పాలను బాగా కాచాలి. అప్పుడప్పుడు తిప్పుతూ అడుగంటకుండా చూసుకోవాలి.

✶ పాల మిశ్రమం చిక్కబడుతుంది. గిన్నెకు చుట్టు అంటుకున్న మీగడని తీసి లోపలికి వేస్తుండాలి.

✶ 20 నుండి 25 నిముషాల తరువాత అందులో జాజికాయ పొడి, సన్నగా తరిగిన ఇతర డ్రై ఫ్రూట్స్, యాలకులు, కుంకుమ పువ్వు కూడా వేసుకోవాలి. బాగా తిప్పి మరో నిముషం పాటు సన్నని మంటమీద ఉంచి పొయ్యిమీద నుండి దించేయాలి.

✶ చివరగా మరికొంత కుంకుమ పువ్వు వేసి అలంకరించాలి. బాసుందిని వేడిగా, గోరువెచ్చగా లేదా చల్లగా ఎలాగైనా తీసుకోవచ్చు

అందమైన బాల్కనీ కోసం..

ఇంటి బాల్కనీలో కూర్చొని లేదా నిల్చొని అలా వీధి చివరకు చూస్తు.. ఉదయం...సాయంత్రం వేళల్లో కాఫీతాగుతూ సేదదీరాలంటే ఎవరికైనా సరదానే. ప్రస్తుతం ఇంటిలోపలి అలంకరణకు ఎంతటి ప్రాధ్యాన్యత ఇస్తున్నారో..బాల్కనీల అలంకరణకు అంతటి ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే అధునాతన బాల్కనీల అందం చూడముచ్చటగా ఉంటుంది. మరి బాల్కనీలు అందంగా ఉండాలంటే ఎలా అలంకరించుకోవాలో తెలుసుకుందాం.

ది ఫారెస్ట్ థీమ్..

ప్రకృతి ప్రేమికులకు , మరికొందరికి ఫారెస్ట్ వాతావరణం అంటేచాలా ఇష్టం. అలాంటివారు తమ బాల్కనీని ఫారెస్ట్ థీమ్‌తో డెకరేట్ చేసుకుంటే భలేగా ఉంటుంది. బాల్కనీలో చిన్నచిన్న మొక్కలు, కృత్రిమ గడ్డి, వాటర్ ఫీచర్స్‌ను అమర్చుకోవాలి.రాత్రివేళ వాటి అందం ఇనుమడించేలా..సొగసైన లేట్లు ఏర్పాటు చేసుకోవాలి.



ది రా అండ్ ఎక్స్ పోజ్డ్ లుక్..

కొందరికి అందం సహజ సిద్ధంగా ఉండాలి. కొట్టొచ్చినట్ల కనిపించాలి...అనే కోరిక ఉంటుంది. ఇలాంటి వారు తమ బాల్కనీని ఎడారి,అడవి మొక్కలతో ఇండస్ట్రియల్ లైట్లతో అలంకరించుకోవాలి. ఇది చూడానికి చాలా ప్రత్యేకంగా కనిపించడమే కాదు నిర్వహణ చాలా సులభం.

డ్రింక్ అండ్ రిలాక్స్ కోసం..

కొందరికి సాయంత్రం వేళ బాల్కనీలో కూర్చొని ..తమకు ఇష్టమైన పానీయాలు సేవిస్తూ..సోఫాలో రిలాక్స్ కావడం సరదా. ఇలాంటి వారు తమ బాల్కనీలో సోఫాలు, దాని ముందు కాఫీ టేబుల్ అరేంజ్ చేసుకోలాలి. బాల్కనీ కార్నర్లలో లెదర్ బార్ స్టూల్స్ ఏర్పాటు చేసుకుంటే మరీ మంచిది. ముఖ్యంగా మధ్యపాన ప్రియులైతే బాల్కనీని చిన్నసైజు బార్‌గా ఏర్పాటు చేసుకుని సాయంత్రాలు ఎంచక్కా ఎంజాయ్ చేయవచ్చు.

ప్రకాశవంతంమైన లుక్ కోసం

మేడకు అందం రావాలంటే బాల్కనీని ప్రకాశవంతంగా అలంకరించుకోవాలి. కార్నర్లలో పొడవైన విద్యుత్ లైట్లు అమర్చుకోవాలి. బాల్కనీకి రూఫ్ ఉంటే వేలాడే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసుకోవాలి. సీటింగ్ అరేంజ్‌మెంట్ ఉన్న చోట నేలపైనా విద్యుత్ దీపాలతో అలంకరించుకోవచ్చు.

బాల్ గేమ్స్‌తో బోన్ హెల్త్ !

అంతా కార్పోరేట్ కల్చర్... ర్యాంక్ చదువుల మాయాజాలంలో పడి భావితరాల భవిష్యత్తు కూడా కార్పోరేట్ కల్చర్లో చిక్కుకుంది. తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదుకోవాలని లక్షలు వెచ్చిస్తున్నారే తప్ప, ఆరోగ్యం గురించి ఆలోచించిన దాఖలాలు కనిపించడం లేదు. కార్పోరేట్ స్కూళ్లలో దాదాపు ఆటస్థలాలు కనిపించవు. పాఠశాలలో అడుగు పెట్టింది మొదలు బడి గంట కొట్టేవరకు చదువు!.. చదువు!!.. చదువు!!.. దీనివల్ల విద్యార్థులు వ్యాయామం లేక శారీరక ధారుడ్యాన్ని కోల్పోతున్నారు. ఇతర ఆటల సంగతి అటుంచితే.. వాలిబాల్, ఫుట్ బాల్ లాంటి బాల్ గేమ్స్ పిల్లలలోని ఎముకల ఎదుగుదలకు, కండరాల పటుత్వానికి ఎంతో మేలు చేస్తుందని పరిశోధనలు వెల్లడటిస్తున్నాయి. 8- 10 సంవత్సరాల మధ్య వయస్సున్న పాఠశాల పిల్లలు గ్రుపులుగా విభజించి పరిశోధనలు నిర్వహించారు. 295 మంది విద్యార్థులపై ఈ పరిశోధనలు జరిగాయి. ఇతర విద్యార్థులతో పోల్చినప్పుడు.. టైం టేబుల్ ప్రకారం బాల్ గేమ్స్, సర్క్యూట్ శిక్షణ ఇచ్చిన విద్యార్థుల ఎముకలు ధృడంగా, కండరాలు బలంగా ఉన్నాయిని పరిశోధనలు నిర్వహించిన యూనివర్సిటీ ఆఫ్ సౌథెర్న్ డెన్మార్క్‌కు చెందిన స్పోర్ట్స్ ప్రొఫెసర్ పీటర్ పేర్కొంటున్నారు. పాఠశాల టైం టేబుల్ ప్రకారం .. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఇచ్చే వ్యాయామ శిక్షణ తీసుకున్న విద్యార్థులు, బాల్ గేమ్స్ ఆడే లేదా శారీరక ధారుడ్యం కోసం ప్రత్యేక శిక్షణ తీసుకునే విద్యార్థులను పరిశోధనల్లో భాగంగా పోల్చి చూశారు. బాల్ గేమ్స్ గ్రూప్ విద్యార్థుల్లో ఎముకల దృఢత్వం.... కాళ్లలో 7శాతం, మొత్తం శరీరంలో 3 శాతం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. మొత్తానికి ఎముకల ఆరోగ్యానికి బాల్ గేమ్స్ ఎంతగానో దోహదం చేస్తాయని పరిశోధన ఫలితాలు బల్లగుద్ది మరీ చెబుతున్నాయి. సో...తల్లిదండ్రులు ఆలోచించండి!



విటమిన్ డి లోపిస్తే....

పుట్టబోయే పాపాయికి ఊబకాయం



మాతృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకం..అంటారు పెద్దలు. అందుకోసం కలలు కంటారు మహిళలు. అయితే ఆ కల సాకారం కోసం నవమాసాలు కడుపులో బిడ్డను మోసే మహిళలు ..పుట్టు బోయే బిడ్డ భవిష్యత్తు ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. గర్భిణీగా ఉన్నప్పటి మహిళ ఆరోగ్యంతోనే పుట్టబోయే శిశువు ఆరోగ్యం ముడిపడి ఉంటుందన్న నిజం మరిచి పోవద్దు. ఇది పెద్దల మాటేకాదు పరిశోధన ఫలితాలు వెల్లడిస్తున్న సత్యాలు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలో విటమిన్ -డి లోపం ఉంటే వారి సంతానానికి ఊబకాయం వస్తుందని ఇటీవల జరిగిన పరిశోధన ఫలితాలు వెల్లడిస్తున్నాయి.
అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సౌథెర్న్ కాలిఫోర్నియాలో విటమిన్-డి మీద నిర్వహించిన పరిశోధనల్లో ఈ విషయం రూఢీ అయింది.
తగినంత విటమిన్-డి కల్గిన తల్లుల కంటే...మొదటి త్రైమాసికంలో చాలా తక్కువ స్థాయి విటమిన్-డి కల్గిఉన్న మహిళలలకు జన్మించిన పిల్లల నడుము పెద్దదిగా ఉండడం, తమ ఈడు పిల్లల కంటే బరువు ఎక్కువగా ఉండటం.. వీరిలో 2శాతం కొవ్వుకూడా అధికంగా ఉండటాన్ని పరిశోధకులు గుర్తించారు. విటమిన్ -డి లోపం ఉన్న గర్భిణులకు జన్మించిన పిల్లల నడుము అర అంగులం లావుగా ఉన్నా..ఆ ప్రభావం జీవితకాలం ఉంటుందని.. పరిశోధనలో పాల్గొన్న కాలిఫోర్ని యూనివర్సిటీ అసోషియేట్ ప్రొఫెసర్ వైయా లిడా చాట్జి (Vaia Lida Chatzi,) పేర్కొంటున్నారు.
విటమిన్ - డికి సంబంధించిన పరిశోధనల ఫలితాలను ది జర్నల్ పెడియాట్రిక్ ఒబెసిటీ లో ప్రచురించారు. 532 తల్లి-బిడ్డల జంటల మీద ఈ పరిశోధనలు నిర్వహించారు. పుట్టబోయే బిడ్డల బబెసిటిని నిరోధించేందుకు గర్భిణీ స్త్రీలు..తమలో తగిన మోతాదులో విటమిన్- డి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.


సన్ షైన్ విటమిన్

విటమిన్-డి ని సన్ షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. ఎందుకంటే 95 శాతం డి- విటమిన్ సూర్యకాంతి ద్వారా మన శరీరంలోనే ఉత్పత్తి అవుతుంది. ఇక మిగిలిన 5శాతం మన తీసుకునే బలవర్ధక ఆహారం ద్వారా లభిస్తుంది.ముఖ్యంగా గుడ్లు, ఫ్యాటీ ఫిష్, ఫిష్ లివర్ ఆయిల్, పాలు, వెన్న తదితర ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. అంతే కాదు భావితరాలను ఊబకాయం నుంచి కాపాడాలంటే.. కాబోయే తల్లులు గర్భిణిగా ఉన్నప్పుడు తమలో విటమిన్- డి తగినంతగా ఉండేలా జాగ్రత్త పడాలి.

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

నిది ధ్యాస



21-5-47

"నిన్న ఉదయం ఎనిమిది గంటలకు ఆర్య విజ్ఞాన సంఘం విషయంలో పనిచేస్తూ భగవాన్ శిష్యకోటిలో చేరిన డాక్టరు సయ్యదు శ్రీవారి దర్శనార్థం వచ్చి, భగవాన్నిట్లా ప్రశ్నించారు. "లోకమంతా ఆత్మస్వరూపమేనని భగవాన్ సెలవిస్తారే, ఇన్ని కల్లోలాలెందుకు గోచరిస్తున్నవీ లోకంలో?"

భగవాన్ ప్రసన్నవదనంతో "అదేమాయ అంటారు. వేదాంత చింతామణిలో ఆ మాయను అయిదు విధాలుగ చెప్పారు. ఆ గ్రంథం కన్నడ భాషలో నిజగుణయోగి అనేవారు వ్రాశారు. అందులో వేదాంత పరిచ్ఛేదం వేదాంత భాషకొక లక్షణ గ్రంథం వంటిదని చెప్పవచ్చును. దానికి తమిళ్ అనువాదం ఉన్నది. తమస్సు, మాయ, మోహం, అవిద్య, అనిత్యం అని మాయకు అయిదు పేర్లు. జీవచైతన్యాన్ని మరుగుపరచేది తమస్సనీ, జగద్రూపమైన తన్ను వేరుగా తోపించుకుట కారణమైనది మాయ అనీ, అట్లు తోపించు జగమున శుక్తి రజత భ్రాంతి కలిగించేది మోహమనీ, విద్యను చెరపినందున అవిద్య అనీ, సద్రూపమునకు అన్యమయినందున అనిత్యమనీ చెప్పబడింది. ఈ అయిదు మాయల వల్ల, సినీమారంగంలోవలె ఆత్మలో ఈ కల్లోలాలన్నీ గోచరిస్తవి. ఈ మాయను తొలగించేందుకే లోకమంతా మిథ్య అని చెప్పబడింది. ఆత్మ తెఱవంటిది. వచ్చిపోయే బొమ్మలు తెరను ఆశ్రయించినవే గాని, వేరుగా లేవని తెలుసుకున్నట్లు, ఆత్మావలోకన దృష్టి కలిగి దృశ్య ప్రపంచం ఆత్మకు భిన్నం కాదని తెలుసుకునేంతవరకూ, ఇదంతా మిథ్య అని చెప్పాలి గాని, దృష్టిమారితే అంతా ఆత్మగానే తోస్తుంది. అందువల్ల మిథ్యగా చెప్పినవారే తిరిగి అంతా ఆత్మ స్వరూపమే నన్నారు. దృష్టి గదా ప్రాధాన్యం. దృష్టిమారితే సృష్టిలోని కల్లోలాలు మనను బాధించవు. సాగరం కంటే అలలు భిన్నంగా ఉన్నవా? అసలు అలలెందుకు వస్తవి? అంటే ఏం చెప్పగలం. సృష్టిలో కల్లోలాలూ అంతే. అలల వలె వస్తవి, పోతవి. ఆత్మకంటే భిన్నంగా లేవని తెలుసుకుంటే, ఈ ఆందోళన ఉండదు" అన్నారు భగవాన్.

"భగవాన్ ఎన్నిసార్లిది బోధించినా, మాకు తెలియటం లేదే" అన్నారా భక్తులు దీనంగా. "అంతటా నిండి ఉన్న ఆత్మను తెలుసుకోటం చేతకాలేదంటారు. ఏం జేసేదీ? 'నేనున్నాను, నేను చేస్తున్నాను, ఇది నాది' అని చంటిబిడ్డలు గూడా అంటారు. అందువల్ల నేననేది ఎప్పుడూ ఉండే వస్తువని అందరికీ తెలుస్తూనే ఉన్నది. ఆ నేననేది ఉన్న వెనుకనే, నీవు, శరీరం, వాడు వెంకన్న, వీడు, రామన్న ఇత్యాదులు వస్తవి. ఇట్లు ఎదుట ఎప్పుడూ ప్రత్యక్షంగా ఉన్న తన్ను తానుగ నెరుగుటకు దీపం పెట్టి వెదకవలెనా యేమి? తన కన్న భిన్నంగా లేని ఆత్మ స్వరూపం 'మాకు తెలియటం లేదే' అనటం మాకు మేమెవరో తెలియటం లేదు. అనగా మేము మమ్ము ఎరుగము అన్నట్లున్నది" అన్నారు భగవాన్.

"అంటే శ్రవణమననాదుల వల్ల పరిపక్వ చిత్తులై దృశ్యమంతా మాయామయంగా భావించిన వారికి నిది ధ్యాసవల్ల యథార్థ స్వరూపం గోచరిస్తుందన్నమాట. అంతేనా భగవాన్?" అన్నారా భక్తులు. 'ఆ అదే, అదే నిది అంటేనే స్వరూపం. గురువాక్య శ్రవణ మననాదుల వల్ల స్వరూపమందు ధ్యాస కలిగి ఉండుటే నిది ధ్యాస. అనగా తదేక నిష్ఠతో దానినే చింతించుట. అట్లా చింతించగా దానియందు లీనమైపోతాడు. అప్పుడది తాను, తానుగా ప్రకాశిస్తుంది. అది సదా ఉన్నదే గదా? ఉన్నదున్నట్లు చూస్తే, ఇన్ని చిక్కులుండవు. ఉన్న తన్ను గనుటకిన్ని ప్రశ్నలెందుకో?" అన్నారు భగవాన్.

\- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభపరిణామాలు చోటు చేసుకొంటాయి.ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు, ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. శ్రమ పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు / లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవిచూస్తారు.

కుంభ రాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. శుభవార్తలు వింటారు. అవకాశాలను సద్వినియోగ పరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

శాస్త్ర పరిధిలోనే కర్తవ్యాకర్త నిర్వహణ

పూర్వజన్మ సంస్కారాలు ఈ జన్మలో ప్రభావం చూపుతాయి. ఆ సంస్కారాల కారణంగా మనం తెలిసో తెలియకో తప్పులు చేస్తాం. వాటి వల్ల హాని కలుగుతుంది. అయితే శాస్త్ర పరిజ్ఞానం ఉంటే ఆ కర్మలను సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.



మనకు ధర్మశాస్త్రం ఉంది. అలాగే వేర్వేరు సమయాలలో దానిలోని అంశాలకు అనుగుణంగా మహాత్ములు జత చేసిన ధర్మసూక్ష్మాలు వంటివి ఎన్నో ఉన్నాయి. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ధర్మాచరణ గురించి ఈ విధంగా తెలిపాడు. 'కర్తవ్యాకర్తవ్యాలను తెలుపు, విధి నిషేధాత్మక వేదవాక్యాలను వీడి, కామ ప్రేరితుడై స్వేచ్ఛానుసారం వర్తించు వానికి పురుషార్థాలు సిద్ధించే యోగ్యత కలగదు. ధర్మార్థ కామాలు సిద్ధించనందున ఇహపరలోక సుఖం గాని, పరమ పురుషార్థమైన మోక్షం గాని పొందడు'. అంటే ధర్మాచరణ ద్వారానే కర్తవ్యాలు నిర్వహించాలిగాని, ధర్మసమ్మతం కాని అకర్మలు చేయరాదని అలా చేస్తే సుఖమయ జీవితం, ఉత్కృష్ట పురుషార్థం అయిన మోక్షం లభించదని ఆయన తెలిపారు.

అధర్మ కార్యాల వల్ల, తప్పుడు పనుల వల్ల ఇహపర సుఖాలు లభించవని తెలిసి కూడ మానవుడు దిగజారిపోవడానికి కారణం బలహీనతా? స్వామి వేదాంత పురి దానికి సమాధానం ఈ విధంగా తెలిపారు. 'చాలా మంది శాస్త్ర పరిజ్ఞానం లేనందున తప్పులు చేస్తుంటారు. మనిషి పూర్వ జన్మల సంస్కారం వల్ల ప్రేరితుడై ప్రవర్తిస్తాడు. మంచి అంటే ఏమిటో తెలిసినప్పటికీ దుర్యోధనాదుల్లా సంస్కార బలం వల్ల చాలా తప్పులు చేస్తారు. కామ, క్రోధ, లోభాల వల్ల కూడా మనిషి, మంచి చెడు విచక్షణను మాని తప్పులు చేస్తాడు'.

అయితే పూర్వ జన్మ సంస్కారాలను సంస్కరించుకునే అవకాశం అందరికీ ఉంది. 'ఇది మంచి, దీనిని చేయాలి', 'ఇది చెడు, దీనిని చేయరాదు' అని అంతరాత్మ ప్రబోధిస్తూనే ఉంటుంది. కొందరు తాత్కాలిక లాభాలను ఆశించి అంతరాత్మ ప్రబోధాన్ని లెక్క చేయరు. గీతాచార్యుడు అందుకు ఒక సులువైన మార్గం చెప్పాడు. ఆయన వచించిన దాన్ని తు.చ తప్పకుండా పాటిస్తే ప్రయోజనం ఉంటుంది. అందులో ఎలాంటి సందేహం లేదు.

తస్మా చ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్య వ్యవస్థితౌ
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తు మిహార్హసి

కర్తవ్యాకర్త నిర్ణయానికి శ్రుతి స్మృతి పురాణ రూపమైన శాస్త్రాన్నే ఆశ్రయించాలి. స్వేచ్ఛారూపమున వ్యక్తమగు కామ ప్రేరణకు లొంగరాదు. కర్మ భూమి అయిన ఈ లోకంలో ముముక్షువులు, దేశ కాల వర్ణాశ్రమోచిత కర్మలను శాస్త్ర విధిననుసరించి తెలుసుకుని ఆచరించాలని ఈ శ్లోకార్థం.

పూర్వజన్మ సంస్కారాలు ఈ జన్మలో ప్రభావం చూపుతాయి. ఆ సంస్కారాల కారణంగా మనం తెలిసో తెలియకో తప్పులు చేస్తాం. వాటి వల్ల హాని కలుగుతుంది. అయితే శాస్త్ర పరిజ్ఞానం ఉంటే ఆ కర్మలను సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.

ఒక రాజుగారి ఆస్థానంలో ఉన్న పండితునికి కుమారుడు కలిగాడు. ఆ బాలుని జాతకంలో దొంగ బుద్ధి సంస్కారం ఉందని తేలింది. జ్యోతిష్యం కూడా ఒక శాస్త్రమే. అందు వలన అది విశ్వసించవలసినదే. పండితుడు సకల శాస్త్రాలను అధ్యయనం చేసినవాడు కనుక కుమారుడిని దొంగ బుద్ధి నుంచి తప్పించే ఉపాయం గురించి ఆలోచించాడు. కుమారుణ్ణి ఒక గురుకులంలో చేర్చి అతని చేత అన్ని శాస్త్రాలు అధ్యయనం చేయించాడు. పురాణేతిహాసాలను చదివించాడు. అధ్యయనం పూర్తయ్యే వరకూ గురువు దగ్గరే ఉంచాడు. ఈ విధంగా చేస్తే సత్ప్రవర్తనఅలవడి దొంగ బుద్ధి క్షీణిస్తుందని నమ్మేడు. అధ్యయనం పూర్తయ్యాక అతనిని తీసుకుని రాజుగారి ఆస్థానానికి తీసుకు వెళ్ళాడు. అక్కడ అతని కుమారుడు శాస్త్ర చర్చలలో పాల్గొని నలుగురి మన్ననలు పొందాడు. అయితే అతను రాజుగారి కోటలో ఉన్న అపార సంపదలను చూశాడు. అతని బుద్ధి మళ్ళింది. ఏదో పని కల్పించుకుని అక్కడే తచ్చాడుతూ సాయంత్రమైనా బయటకు రాలేదు. చీకటి పడిన తరు వాత అందరి కళ్లు గప్పి కోశాగార సమీపానికి వెళ్ళాడు. పూర్వ సంస్కారం జాగృతమైంది. అక్కడున్న వెండి బంగారాలు, రత్నాభరణాలు వంటి వాటిని దొంగిలించాలని తలంపు కలిగింది. ఇదే సమయం దొంగిలించమని మనస్సు ప్రబోధించింది. అయితే శాస్త్ర జ్ఞానం పుష్కలంగా ఉన్న కారణంగా ఏ లోహం దొంగిలిస్తే నర కంలో ఏ శిక్షపడుతుందో, ఏ పాపం కలుగుతుందో అతను గ్రహించాడు. బంగారం, వెండి, రత్నాలు ఇవేవీ దొంగిలించలేదు. గడ్డిని అపహరిస్తే ఏ పాపం అంటదని శాస్త్ర వచనం. అయితే దొంగి లించడం అనే సంస్కారం వల్ల కొంత గ డ్డిని మూటగట్టుకుని బయటపడ్డాడు. అది గడ్డి కాబట్టి రాజభటులు అడ్డగించలేదు.

శాస్త్ర విజ్ఞానం ఉంటే వివేకం కలుగు తుంది. వివేకం పాపకార్యం చేయకుండా అడ్డుకుంటుంది. అందువల్ల శాస్త్ర పరిజ్ఞానం అందరికీ ఉండాలి. ఇతరులకు హాని చేయకపోతే సమాజం సుస్థిరమవుతుంది.

\- గుమ్మా ప్రసాదరావు
(భిలాయ్ నుంచి)
9755110398

పరమాత్మ మనలోనే ఉంటే భయమెందుకు?



శ్రీరామచంద్రుడు శివధనుస్సు విరిచాడు. సీతారాముల కళ్యాణం జరిగింది. అప్పుడే లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల వివాహాలు కూడా వైభవోపేతంగా జరిగాయి. దశరథ మహారాజు జనకాదుల వద్ద సెలవు తీసుకుని అయోధ్యకు బయలుదేరాడు. 'దశరథుడు, రామ లక్ష్మణభరత శత్రుఘ్నులతో కలిసి ప్రయాణం చేస్తుండగా పక్షులు భయంతో వికృతమైన ధ్వనులు చేశాయి. జంతువులన్నీ ప్రదక్షిణంగా తిరగడం మొదలుపెట్టాయి. భూమి కంపించింది, పెనుగాలులు వీచి వృక్షాలన్నీ వ్రేళ్ళతో సహా పెకిలించివేయబడ్డాయి, మేఘాలు సూర్యుణ్ని ఆవరించి నలుదిక్కులా చీకట్లు కమ్మాయి. సైనికులు మూర్ఛనొందారు. (74వ సర్గ, బాలకాండము, శ్రీమద్రామాయణము). దశరథుడు ఇవన్నీ దుశ్శకునాలని తలచి తన మనసు ఏదో కీడు శంకిస్తున్నదని కులగురువైన వశిష్ఠునితో అన్నాడు. వసిష్ఠుడు శుభ అశుభశకునాలను నిశితంగా పరిశీలించి, విపత్తు వస్తుందని, అయితే అది పరిష్కారమవుతుందని తెలిపాడు. ఈ సమయంలోనే మహాతపస్వి, శత్రు భయంకరుడు అయిన పరశురాముడు వారి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. 'లోకంలో ఇద్దరు రాముల్లు ఉండకూడదు. రాముడో, పరశురాముడో ఎవరో ఒక్కరే ఉండాలి' అన్నాడు. తన వద్ద ఉన్న విష్ణు ధనుస్సును స్వీకరించి, నారి సంధించి, బాణం ఎక్కు పెట్టమన్నాడు ఎంతో అహంకారంతో. రాముడు శ్రేష్ఠమైన ఆ ధనుస్సును ఎక్కుపెట్టగానే పరశురాముని తేజస్సు తగ్గింది. నిర్వీర్యమయ్యాడు. మహేంద్రగిరి పర్వతంపైకి వెళ్ళిపోయాడు. దశరథుడు తన పరివారంతో క్షేమంగా అయోధ్యా నగరానికి చేరుకున్నాడు.

ఇది శ్రీమద్రామాయణం చదివితే మనకు తెలిసే విషయం. దీనిలో మనకు ఉపయోగపడేది ఏదైనా ఉందా అని ఆలోచించాలి. ఎక్కడికైనా బయలుదేరుతున్నపుడు పిల్లి అడ్డం వస్తే, కొంతమంది ఎదురువస్తే, ఎవరైనా తుమ్మితే అపశకునంగా భావిస్తారు. అలాగే అపశకునాలు చూసి దశరథుడు భయపడ్డాడు. ఈ అపశకునాల గురించి మన మరో ఇతిహాసమైన భారతంలోని భగవద్గీతలో ఉంది. అర్జునుడు యుద్ధం మొదట్లో దుశ్శకునాలను చూసి ఆందోళనకు గురై శ్రీకృష్ణ పరమాత్మతో 'నిమిత్తానిచ పశ్యామి విపరీతాని కేశవ' (**భగవద్గీత 1వ అధ్యాయం, 31వ శ్లోకం**) లో అంటాడు. 'ఓ కేశవా! పెక్కు అపశకునాలు కనబడుతున్నవి' అంటూ యుద్ధం చేయకపోవటమే మేలని అన్నాడు.

ఇలాంటివి ఏమి సూచిస్తాయో తెలుసుకునేందుకు దశరథునికి అవకాశముందో లేదో కాని అర్జునునికి నేర్చుకునేందుకు రామాయణ గ్రంథ ముంది. మనకు ప్రస్తుతం రామాయణం, భారతం రెండూ ఉన్నాయి. మనం వాటిని గౌరవిస్తాం, పూజిస్తాం. అయితే వాటి నుంచి తగిన పాఠాలను గ్రహించం. దశరథునికి దుశ్శకునాల ఫలితం కనబడలేదు ఎందుకు? ధర్మమూర్తి సత్యమూర్తి శ్రీరాముడు తోడై ఉన్నాడు కాబట్టి. అర్జునునికి ఈ అపశకునాలు కనబడినా విజయం ఎలా సాధించాడు? సత్యధర్మ స్వరూపుడైన శ్రీకృష్ణపరమాత్మ తోడుగా ఉన్నందున. ఆనాడు దశరథునికి రాముడు తోడుగా ఉన్నాడు, అర్జునునికి శ్రీకృష్ణుడు తోడుగా ఉన్నాడు. ఈ రోజుల్లో మనకు ఎవరు ఉన్నారనే అనుమానం వస్తుంది. ఇక్కడే ఆలోచించాలి. మనం రాముని అయోధ్యకు మాత్రమే పరిమితం చేయకపోతే ఆత్మారామునిగా మనకు అత్యంత చేరువలో ఉన్నాడు. ఇక శ్రీకృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు, ఆయన మనందరి హృదయాల్లో ఉన్నట్టు. అయినా కృష్ణుడు మన వెంట లేడే అనుకుంటే ఎన్ని గీతా పారాయణలు, గీతా జయంతులు చేస్తే ఏమి లాభం. అందరి హృదయాల్లో తానున్నట్టు, వారు మన వెంట ఉన్నట్టు భావిం చుకోవాలి.

\- రాచమడుగు శ్రీనివాసులు
9492748758

భగవద్గీత



దేహోద్భవ సంబంధ కార్యమే కర్మ

అధ్యాయం 8

శ్లోకం 3

శ్రీ భగవాన్ ఉవాచ
అక్షరం బ్రహ్మ పరమం
స్వభావో ధ్యాత్మముచ్యతే।
భూతభావోద్భవకరో
విసర్గః కర్మసఞ్జితః॥

తాత్పర్యం

శ్రీకృష్ణభగవానుడు పలికెను : నాశరహితము, దివ్యము అగు జీవుడే బ్రహ్మమని, అతని నిత్యస్వభావమే ఆధ్యాత్మమని చెప్పబడును. జీవుల దేహోద్భవానికి సంబంధించిన కార్యమే కర్మ అనబడుతుంది.

భాష్యం

బ్రహ్మము నశింపనిదై, శాశ్వతముగా ఉనికిని కలిగి ఉండి, దాని స్వభావము ఎప్పటికీ మారనటువంటిదై ఉంటుంది. బ్రహ్మము జీవుని సూచిస్తే, పరబ్రహ్మము భగవంతుణ్ని సూచిస్తుంది. జీవుడు భగవంతుని తటస్థశక్తికి సంబంధించినవాడు అనగా అతడు అంతరంగ శక్తియైన ఆధ్యాత్మిక శక్తి ఆధీనములో ఉంటే తన సహజ శాశ్వత స్వభావాన్ని కలిగి పరబ్రహ్మమును సేవిస్తూ ఉంటాడు. అట్లుకాక బహిరంగశక్తి మాయలో పడిపోతే భౌతిక మనస్సు, ఇంద్రియాలను కలిగి ఏదో ఒక శరీరాన్ని పొందుతాడు. యజ్ఞాలను చేసి స్వర్గాన్ని పొంది, పుణ్యము తరిగినంతనే భూలోకములో మానవుడుగా జన్మించి మరలా మరలా వేరు వేరు లోకాలను, శరీరాలను పొందుతూ ఉంటాడు. ఈ ప్రక్రియనే 'కర్మ' అంటారు. భక్తుడు భగవద్భక్తి వలన వేరు వేరు భౌతిక శరీరాలను పొందక శాశ్వత స్వభావమైన ఆధ్యాత్మిక శరీరాన్ని పొంది భగవద్ధామానికి చేరుకుంటాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



సుమతి శతకము

కుక్క గోవుకాదు కుందేలు పులిగాదు
దోమ గజము గాదు దొడ్డదైన
లోభి దాతగాడు లోకంబు లోపల
విశ్వదాభిరామ వినురవేమ

తాత్పర్యం: కుక్క గోవుగాదు కుందేలు పులిగాదు , దోమ గజము గాదు, దొడ్డదైన లోభి దాతగాడు లోకంబు లోపల విశ్వదాభిరామ వినురవేమ

బాలప్రభ

పొడుపు కథ

వేలెడంత ఉండదు. కానీ మనం బయటకు
వెళ్లాలన్నా ఇంట్లోకి రావాలన్నా అది
ఉండాల్సిందే. ఎవరది?

జవాబు : తాళం

ధైర్యమంత్రం

కథ



సీతాపురం నుంచి తమ తోటలో కాసిన మంచిరకం మామిడిపళ్లు తీసుకుని పట్నంలో వుంటున్న అక్క, బావల ఇంటికి వచ్చాడు సురేంద్ర.

''మామయ్యొచ్చాడు.. మామయ్యొచ్చాడు'' అంటూ సంతోషంగా వచ్చినప్పటి నుంచి సురేంద్రనే అంటిపెట్టుకుని తిరగసాగాడు ఏడో తరగతి చదివే మేనల్లుడు అభయ్.

''అక్కా... వీడ్ని ఊరెళ్లేటప్పుడు నాతో తీస్కెళ్తా'' అన్నాడు సురేంద్ర.

''లేదు లేరా. వాడికి ఈ పదిరోజుల తర్వాత వేసవి సెలవులిచ్చేస్తున్నారు కదా, అప్పుడు నేను, మీ బావగారు వీడ్ని తీస్కుని వస్తాం లే'' చెప్పింది సుజాత.

ఇంతలో సురేంద్ర బావగారు కూడా వచ్చాడు. ఊళ్లోని విశేషాలు, కుశలం అడిగాడు.

ఈ లోపు ''అభయ్. వంటగదెళ్లి ఫ్రిజ్‌లో పెరుగు గిన్నె తేవటం మరిచిపోయా వెళ్లి తీసుకురా నాన్నా'' అంది సుజాత కొడుకుతో.

వెంటనే ''అమ్మో! ఒక్కడ్నే వెళ్లను బాబూ. నాకు భయం'' అన్నాడు అభయ్.

''అరె! వంటింట్లో కెళ్లడానికి భయమా?'' ఆశ్చర్యపోయాడు సురేంద్ర.

''ఏంటోరా వీడి మధ్య వాడి గదిలోకి, పూజ గదిలోకి, చివరకి కెళ్లాలన్నా పగలు రాత్రి తేడా లేకుండా భయపడ్తున్నాడు. ఈ మధ్య టీవీలో ఏదో దయ్యం సినిఆ చూసిన దగ్గర్నుంచీ'' చెప్పింది సుజాత విచారంగా.

వద్దన్నా వినకుండా చూడటం దేనికి? ఇలా భయపడటం దేనికి? అయినా మగపిల్లాడివి భయపడితే అంతా నవ్వుతారు'' అన్నాడు సుజాత భర్త.

అది విని ముఖం ముడుచుకున్నాడు తప్ప భయం వదిలి వంటింట్లోకి మాత్రం వెళ్లలేదు అభయ్.

ఆ రాత్రి అభయ్ సురేంద్ర దగ్గరే పడుకున్నాడు.

నీకొక విషయం చెప్పనా అభయ్? చిన్నప్పుడు నేను నీకంటే ఎక్కువ భయపడే వాడ్నట. అప్పుడు ఓ స్వామీజీ దగ్గరికి మా అమ్మ తీసుకెళ్తే నాకాయన ధైర్య మంత్రం చెప్పాడు. అంతే అప్పట్నుంచీ ఏ భయం లేకుండా పోయింది నాకు'' చెప్పాడు సురేంద్ర.

''అవునా? అయితే నాకూ నేర్పవా మామయ్యా ప్లీజ్' అని బ్రతిమాలాడు అభయ్.

''ఇది చెవిలో చెబుతాను. కావాలంటే నువ్విప్పుడే పరీక్షించుకో నీకే తెలుస్తుంది'' అని చెవులో మెల్లగా మంత్రం చెప్పాడు సురేంద్ర.

''ఇప్పుడు నాకు ధైర్యం వచ్చిందని ఎలా తెలుస్తుంది? అడిగాడు అభయ్.

'' ఈ మంత్రం మనసులో చెప్పుకుంటూ వంటింట్లోకి మంచినీళ్లు తీసుకురా చూద్దాం'' అన్నాడు సురేంద్ర.

అలాగే చేశాడు అభయ్. ''నిజమే మామయ్యా నాకీ మంత్రం చెప్పుకుంటుంటే అస్సలే భయం వెయ్యలేదు'' అన్నాడు ఆశ్చర్యంగా.

''ఆ మరే. నేను కూడా ఈ మంత్రం చెప్పుకుంటూ అర్థరాత్రైనా సరే పొలాలు, చేల దగ్గర ఒఉరిగా కాపలా వుండేవాడ్ని. తెలుసా?'' చెప్పాడు సురేంద్ర.

''అవును నిజమే. ఊరికొచ్చినప్పుడు చూశాను కదా? అయితే నీకన్నా ధైర్యవంతుడ్నైపోతా నేను కూడా కదా?'' ఉత్సాహంగా అన్నాడు అభయ్.

''అవటం కాదు ఇప్పుడే అయిపోయావ్ కదా వంటింట్లోకెళ్లొచ్చి ''సురేంద్ర అనగానే అభయ్ గుండె తెలియని ధైర్యంతో పొంగింది. మర్నాడు సురేంద్ర ఊరెళ్లిపోయాడు.

'' ఏమిట్రా సురేంద్రా.. మన అభయ్‌కి నువ్వేదో ధైర్యమంత్రం చెప్పావటకదా? వాడినప్పుడు హాయిగా రాత్రి పగలని లేకుండా తోడు రమ్మనకుండా వెళ్లడం చూసి మా ప్రక్కింటావిడ అడిగితే నువ్వేదో మంత్రం చెప్పావని అన్నాడట. ఆవిడేమో కాస్త నన్ను కనుక్కుని చెప్పమంది'' అడిగింది సుజాత.

అది విని బిగ్గరగా నవ్వాడు సురేంద్ర ''అయ్యో పిచ్చి అక్కయ్య నేనేదో నోటికొచ్చింది చెప్పాను పిల్లాడికి నమ్మకం కలుగేలా. వాడిలోని భయాన్ని దూరం చేయగలగాలని. అంతేగానీ మంత్రం లేదు తంత్రం లేదు'' చెప్పాడు సురేంద్ర.

''అవునా? మంచి పనే చేసావ్. సరే వాడికి చెప్పిందే చెప్పరా ఆ పిల్లాడికి చెప్పాలి'' అడిగింది నవ్వుతూ సుజాత.

''సరే విను. ధైర్యే సాహసే లక్ష్మీ అని చెప్పా అంతే'' చెప్పాడు సురేంద్ర.

నిజమేరా. నువ్వు చెప్పిన మంత్రంలో కాదు పిల్లలకు నమ్మకంగా, ఓపికగా నచ్చజెప్పడమే ముఖ్యం. అప్పుడే వాళ్లలో మనం ఆశించినంత మంచి మార్పు వస్తుంది'' అంది సుజాత ఆనందంగా.

పక పక

చిల్లర లేదు



జడ్జి: భార్యను ఒక చెంపదెబ్బ కొట్టినందుకు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తున్నాను

ముద్దాయి: మరో చెంపదెబ్బ కొడితే..?

జడ్జి కోపంతో: ఎందుకు?

ముద్దాయి: నా దగ్గర చిల్లర లేదు. రెండు వేల రూపాయల నోటు ఉంది మరి.


ఇది ఏం స్టేషన్



యాత్రికుడు ట్రైన్ నుంచి దిగాడు. సన్నీతో అడిగాడు ''ఇది ఏం స్టేషన్''?

సన్నీ: పిచ్చివాడా ఇది రైల్వే స్టేషన్ కనబడటం లేదా?

దుకాణం తెరిచాడు




సంజయ్: మీ తమ్ముడు ఇవ్వాళ రేపు ఏం చేస్తున్నాడు?

శ్రీను: ఒక జెవలరీ దుకాణాన్ని తెరిచాడు, కానీ ప్రస్తుతం జైలులో ఉన్నాడు.

సంజయ్: అలా ఎందుకు?

శ్రీను: జెవలరీ దుకాణానికి కన్నం వేయడానికి గునపాలతో తెరిచాడు.

డిలీట్



రమేష్: ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా డబ్బులు ఎలా సంపాదించాలనుకుంటున్నావా?

సురేష్: అవును

రమేష్: వెంటనే ఈ రెండింటిని డిలీట్ చేసి పనిలో నిమగ్నం కావాలి

యుద్ధాలలో ఏనుగులు



ప్రాచీన కాలం నుంచే ఏనుగులకు మానవులతో సంబంధం ఉంది. మహారాజులు అడవులలో క్రూరమృగాలు, ముఖ్యంగా పులుల్ని వేటాడటం కోసం ఏనుగుల మీద వెళ్లేవారు. కొన్ని దేవాలయాల్లో ఊరేగింపుల్లో ఏనుగుల్ని ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జంతు ప్రదర్శనశాలలో, సర్కస్‌లలో ఏనుగులే ప్రధాన ఆకర్షణలు. భారీ శరీరం, తొండం కలిగిన జంతువు ఏనుగున్న విషయం అందరికి తెలిసిందే. ప్రస్తుతం భూమిపై సంచరించే జంతువులన్నింటిలోకి ఏనుగు పెద్దది. అంతేకాదు. బలశాలీ కూడా.

ఏనుగు గర్భకాలం 22 నెలలు. ఏనుగు 70 సంవత్సరాలు కంటే ఎక్కువగా జీవిస్తుంది. దీన్ని హిందూ దేవాలయాల్లో పూజకు కూడా ఉపయోగిస్తారు. ఇవి పూర్తిగా శాఖాహార జంతువు. ప్రాచీన భారతదేశంలో మొదటిసారిగా ఏనుగులను మచ్చిక చేసుకున్నారు.

ఆఫ్రికా, ఆసియా ఏనుగులని రెండు రకాలుగా ఏనుగులను పిలుస్తుంటారు. ఆఫ్రికా ఏనుగులు ఆఫ్రికా ఖండంలో 37 దేశాలలో విస్తరించి ఉన్నాయి. ఇవి ఆసియా ఏనుగులకంటే పెద్దవిగా ఉంటాయి. వీటి వెనుక భాగం పుటాకారంలో ఉంటుంది. వీటి చెవులు చాలా పెద్దవిగా ఉంటాయి. విశేషమేమిటంటే, వీటి చెవులు ఆఫ్రికా ఖండం ఆకారంలో ఉంటాయి. ఆడ, మగ ఏనుగులు రెండూ దంతాలు కలిగి ఉంటాయి.

ఆసియా ఏనుగులు ఆఫ్రికా ఏనుగుల కంటే చిన్నవి. చెవులు చిన్నవిగా ఉంటాయి. మగ ఏనుగులకు మాత్రమే పెద్ద దంతాలుంటాయి. మొత్తం ఏనుగులో 10శాతం మాత్రమే ఆసియా ఏనుగులు. జన్యువ్యత్యాసాల కారణంగా ఏనుగులకు మూడు ఉపజాతులుగా విభజించారు. ఆసియాలో ఉన్న ఏనుగులన్నింటిలో మన దేశంలోనే ఏనుగులు ఎక్కువ. అంటే 36,000 వరకు ఉన్నాయని అంచనా. ఇవి భారతదేశం నుండి ఇండోనేషియా వరకు విస్తరించి ఉన్నాయి. ఇవి ఇంచుమించు 5,000 కి.గ్రా బరువు ఉంటాయి. ఏనుగులు కష్టపడి పనిచేస్తాయి. అడవులలో భారీ వృక్షాలను పడగొట్టడానికి, తరలించడానికి ఉపయోగిస్తారు. ఇలాంటి పనులకు ముఖ్యంగా ఆడ ఏనుగులను ఉపయోగించేవారు. యుద్ధాలలో కూడా ఏనుగులను ఉపయోగించేవారు. దీనికి మగ ఏనుగులు మాత్రమే పనికొస్తాయి. భారీ పనులకోసం, యుద్ధ ఖైదీలను వీటి పాదాల క్రింద తొక్కించడానికి కూడా ఏనుగులను వాడేవారు. ఏనుగులు చాలా పెద్దగా, బలంగా కనిపిస్తాయి కానీ బుద్ధిహీనులుగా కూడా పేరుంది. కానీ కొన్ని ఏనుగులు తెలివిగా ప్రవర్తిస్తాయి.

బాలల జీవితానికి బాలసాహిత్యం పునాది

బాలసాహితీ బంధువులు-40

బాల సాహిత్యం అనగానే మనకు గుర్తొచ్చే మొదటి పదిమందిలో ఒకరు బెహరా ఉమామహేశ్వరరావు తాతయ్య.

విజయనగరం జిల్లా పార్వతీపురంలో 14 ఆగస్టు 1949న పుట్టారు. అమ్మ సువర్ణమ్మ, నాన్న సీతారామస్వామి ఎం.ఎ, ఎంఇడితో పాటుగా రాష్ట్రీయ భాషా ప్రవీణ్(హిందీ) చదివారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులుగా పార్వతీపురంలోనే జీవితం గడుపుతున్నారు.

1978 సంవత్సరం నుండి రచనా వ్యాసంగం ప్రారంభించారు. ఎక్కువగా బాలమిత్ర, బుజ్జాయి, బొమ్మరిల్లు పత్రికల్లో ప్రచురించబడ్డాయి. కొన్ని రచనలు సర్వశిక్షా అభియాన్ వారు ప్రచురించిన పుస్తకాల్లో ప్రచురించబడటం విశేషం. కొన్ని కథలకు బహుమతి కూడా పొందారు. తాను పనిచేసిన పాఠశాలల బాలలకు కథలు, గేయాలు, పాటలు రాసేందుకు తగిన శిక్షణ ఇచ్చి బాలలచే రాయించటంలో సఫలీకృతులైనారు. ఇప్పటివరకు 750కి పైగా రచనలు చేశారు. వీటిని కాకులు చేసిన మేలు. మంచి శిక్ష, మా మంచి మాస్టారు, డబ్బు తెచ్చిన తంటా, గురువుమాట, బస్టీకాకులు, బంటీ స్నేహం, బడిగంటలు, బాలవీర, యోగివేమన, పురాణ కథలు, మన భారత ప్రధానమంత్రులు, భక్తకబీరు, బహుమతి, శ్రమవిలువ, మంత్ర మహిమ పేర్లతో 16 పుస్తకాలుగా ప్రచురించి బాలలకు అందించారు.

1985లో రాసిన జంతులోకం, పక్షి రాజ్యం నవలలు బాలలను విశేషంగా ఆకర్షించాయి. జంతువులు పక్షులే పాత్రలుగా అనేక కథలు, గేయాలు రాశారు. అంతరించిపోతున్న గేయ కథా ప్రక్రియను తిరిగి తన రచనల ద్వారా నిలబెట్టారు. ఉపాధ్యాయునిగా సేవలందిస్తూ 2007లో జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా అప్పటి భారత రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతుల మీదుగా పురస్కారం అందుకోవటం విశేషం.

బాల సాహిత్యంలో ఎంతోకాలంగా చేస్తున్న కృషిని గుర్తించి ప్రభుత్వం తరపున సాహితీ సంస్థల ద్వారా పలుమార్లు సత్కారం పొందారు. 2016లో డాక్టర్ రావూరి భరద్వాజ బాలల విజ్ఞాన పీఠం సత్కరించగా, 2018 ఫిబ్రవరి 4న కరీంనగర్‌లో ప్రతిష్టాత్మక వాసాల నరసయ్య బాలసాహిత్య పురస్కారం అందుకున్నారు. బాలల జీవితానికి బాలసాహిత్య పునాది. బాలలు మంచిని గ్రహించి చెడును విడిచిపెట్టే ప్రక్రియలో బాలసాహిత్యం ఉండాలి అంటారు బెహరా ఉమామహేశ్వరరావు తాతయ్య.




చిరునామా
బెహరా ఉమామహేశ్వరరావు
రాయగడరోడ్, పార్వతీపురం (పో)
విజయనగరం జిల్లా- 535501
ఆంధ్రప్రదేశ్
సెల్ : 9247647232



నిర్వహణ: పైడిమర్రి రామకృష్ణ
సెల్ : 9247564699

బంగారు పలుకు



పిరికితనం మనిషిని
నిర్వీర్యుడిని చేస్తుంది
ఆత్మ విశ్వాసం
మానవుడిని
విజయపథం వైపు
నడిపిస్తుంది


- స్వామి వివేకానంద


చింటుగాడి కథలు




















రచన: రాంకీ
బొమ్మలు: జానకీరాం

న్యూజిలాండ్ జాతీయ దినోత్సవం

హాయ్ ఫ్రెండ్స్.. ఎలా ఉన్నారు.. న్యూజిలాండ్‌లోని ఒక ముఖ్యమైన విషయం చెప్పాలనుకుంటున్నాను. ప్రపంచపటం మీరు ఎప్పుడైనా చూశారా? చూడండి... అందులో క్రింది భాగంలో ఆస్ట్రేలియా ఉంటుంది. దాని క్రింద న్యూజిలాండ్ ద్వీపం కనిపిస్తుంది. పొడవుగా చిన్నగా ఉంటుంది కదా.. అది.. ఇది రెండు ద్వీపాల కూడలి. దక్షిణ ద్వీపం. ఈ మొత్తం దేశ జనాభా ఎంతో తెలుసా.. ఇంచుమించు 48 లక్షల మంది. ఇక చరిత్రలోకి వెళితే ఇక్కడ తరతరాలుగా మావోరీలు అనే గిరిజన తెగవారు నివసించేవారు. వారు విశాలమైన ఈ భూభాగంలో ఎంతో హాయిగా జీవించేవారు.. మొత్తం కొండలు, మైదానాలు వ్యవసాయం వారి ప్రధాన వృత్తి. ఇక్కడ ప్రకృతే వారి సహజ సంపద. ఇదిలా ఉండగా ఈ ద్వీపంపై బ్రిటీష్‌వారి కన్నుపడింది. దీన్ని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా రూపొందించాలనుకున్నారు. ఇంకేం మావోరీలతో చర్చించి ఈ భూభాగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది 1840 ఫిబ్రవరి 6 వతేదీన దీనిపై మావోరీలు, బ్రిటీష్ అధికారుల మధ్య సంతకాలు చేసుకున్నారు. అప్పటి నుంచి ఆ రోజును జాతీయ దినోత్సవంగా జరుపుకుంటారు. ఆ రోజున అన్ని కార్యాలయాలకు సెలవు ప్రకటిస్తారు. ఒకరికొకరు అభినందించుకుంటారు. అంతే తప్ప పతాకావిష్కరణలు, ప్రభాతభేరీలు, ఊకదంపుడు ఉపన్యాసాలు, అమలుకాని హామీలు ఏమీ ఉండవు. ఫలితంగా మొత్తం దేశాన్ని ఒక ఆదర్శవంతమైందిగా తీర్చిదిద్దారు. ప్రపంచానికే పర్యాటక కేంద్రంగా



తీర్చిదిద్దారు. ప్రపంచంలోని అన్ని దేశాల వారు ఇక్కడ నివసిస్తుంటారు. పర్యాటకులుగా వచ్చిపోతుంటారు. అందమైన సరస్సులు, ఆకట్టుకునే సుందరమైన ప్రదేశాలు, సముద్రతీరాలు, జలపాతాలు.. ఇలా ఎన్నెన్నో కనువిందు చేస్తుంటాయి. అందరి ముఖాల్లో సంతృప్తి, సంతోషం తొణికిసలాడుతుంది. నిజాయితీకి మారు పేరు ఇది. ఒకరిని ఇబ్బంది పెట్టాలని, మోసగించాలని ఎవరూ అనుకోరు. ఎవరు కనిపించినా చిరునవ్వుతో పలుకరిస్తారు. మరి మీరు కూడా పెద్దయ్యాక ఎప్పుడైనా ఇక్కడికి రావడానికి ప్రయత్నించండి. సరేనా

- వేదాంతసూరి



నయనతార

అనుష్క

విజయాలతో హ్యాపీస్

సినిమారంగంలో పదికాలాల పాటు మనజాలాలంటే మంచి పాత్రలు లభించడం...అవి పండటంతో పాటు విజయాలు సైతం వరిస్తేనే వాటికి సార్థకత చేకూరి నటీనటుల కెరీర్ మూడు పువ్వులు..ఆరుకాయలుగా విరాజిల్లుతుందని అంటారు. స్వీయానుభవంతో ఎందరో ఆర్టిస్టులు ఈ సక్సెస్ ఫార్ములాను పలు సందర్భాలలో చెబుతుండటం తెలియంది కాదు. పేరు తెచ్చుకున్న నటీనటులు కూడా సక్సెస్ లేకపోతే విలవిలలాడిపోతుంటారు. సక్సెస్‌నే ఏకైక మంత్రంగా పఠిస్తూ ముందుకు సాగుతుంటారు. ఈ నూతన ఏడాదిలో ఇప్పటివరకు విజయాలను కైవసం చేసుకున్న కథానాయికల విషయానికి వస్తే...తమిళంలో లేడీ సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్న నయనతార తెలుగులో కూడా పలు చిత్రాలలో నటించిన విషయం వేరుగా చెప్పనక్కరలేదు. గత కొంతకాలంగా అడపాదడపా తెలుగు చిత్రాలనే అంగీకరిస్తున్న ఆమె గతేడాది నటించిన బాబు బంగారం చిత్రం ఆశించినంతగా ఆడలేదు. తాజాగా బాలకృష్ణ సరసన నటించిన జైసింహా చిత్రం ఆమెకు విజయాన్ని అందించింది. సంక్రాంతి సందర్భంగా వచ్చిన ఈ చిత్రానికి ప్రేక్షకాదరణ లభించడంతో నయన్ ఖాతాలో హిట్ నమోదైంది. ప్రస్తుతం ఆమె తమిళంలో చేతినిండా చిత్రాలతో పాటు తెలుగులో సైరా నరసింహారెడ్డి చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తంమీద ఆమె టాలీవుడ్‌లో విజయదరహాసంతో ముందుకు సాగుతోంది.

ఇక మరో అగ్ర కథానాయిక అనుష్క. గతేడాది బాహుబలి-2లో దేవసేన పాత్రలో మరింతగా ఒదిగిపోయి, ఆ చిత్ర విజయంతో అందరి దృష్టిని మరోసారి ఆకర్షించింది. తాజాగా ఆమె నటించిన మరో భారీ చిత్రం భాగమతి జనవరి నెలాఖరులో విడుదలై, విజయవంతంగా ప్రదర్శింపబడింది. ఆమె కెరీర్‌లో మైలురాళ్లుగా నిలిచిపోయిన అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి చిత్రాల సరసన ఈ చిత్రం కూడా చేరింది. ఇందులో ఉన్నతాధికారి చంచలగా, భాగమతిగా రెండుకోణాలు కలిగిన పాత్రలో అనుష్క నటన అద్భుతం అన్న పేరొచ్చింది. నూతన ఏడాదిలో శుభారంభంగా ఆమెకు లభించిన మరో విజయమిది.

ఇప్పుడిప్పుడే కథానాయికగా గుర్తింపు పొందుతున్న రాశీఖన్నా నటించిన రెండు చిత్రాలు ఈ ఏడాదిలో వెంట వెంటనే విడుదల కాగా వాటిలో ఒక చిత్రం విజయం సాధించింది. ఇప్పటివరకు కమర్షియల్ చిత్రాల కథానాయికగా నటిస్తూ వచ్చిన ఆమె తొలిసారి పూర్తిస్థాయి ప్రేమకథాచిత్రం తొలిప్రేమలో నటించింది. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రంలో మూడుకోణాలున్న పాత్రలో రాశీఖన్నా మెరిసింది. పాత్రోచితంగానే కాకుండా ఆ సినిమా విజయం సాధించడంతో రాశి ఇప్పుడు అందరి దృష్టిని మరింతగా ఆకర్షిస్తోంది. రవితేజ సరసన ఈ భామ నటించిన టచ్ చేసి చూడు పరాజయం పాలవ్వడం రాశికి కొంత నిరాశను కలిగించింది. అయితే దాని తర్వాత తొలిప్రేమ విడుదల కావడంతో ఇప్పుడామె సక్సెస్ మూడ్‌లో మహదానందంతో ఉంది. వీరిసంగతి ఇలావుంటే...ఈ ఏడాది ఇంతవరకు విడుదలైన చిత్రాలలో విజయాన్ని అందుకున్న నాలుగోభామ రష్మిక మండన్న. లోగడ కన్నడంలో వచ్చిన కిర్రాక్‌పార్టీ చిత్రం ద్వారా ఆమె కథానాయికగా పరిచయమైంది. తెలుగులో నాగశౌర్య కథానాయకుడిగా నటించిన ఛలో చిత్రం ద్వారా ఆమె టాలీవుడ్ అరంగేట్రం జరిగింది. ఇటీవల విడుదలైన ఈ తొలి చిత్రం రష్మికకు పాత్రపరంగా పేరు తెచ్చిపెట్టడంతో పాటు విజయాన్ని అందించడంతో ఇప్పుడామె పేరు టాలీవుడ్‌లో హాట్‌టాపిక్ అయ్యింది. ఛలో చిత్రం విడుదలకు మునుపే ఆమె మరో చిత్రంలో నటిస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా పరశురామ్ దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ నిర్మిస్తున్న చిత్రంలో రష్మికే కథానాయిక. మొత్తంమీద ఈ ఏడాదిలో లభించిన విజయాలు ఈ నలుగురు భామలను సంతోషంలో ముంచేశాయి. ఇక ఈ ఏడాది రాబోయే సినిమాలు మిగతా కథానాయికలకు ఎలాంటి విజయాలను అందిస్తాయో వేచిచూడాల్సిందే.



రష్మికమండన్నా



రాశీఖన్నా



తొలిప్రేమకు చిరు అభినందనలు

వరుణ్ తేజ్, రాశీ ఖన్నా జంటగా దర్శకుడు వెంకీ అట్లూరి రూపొందించిన చిత్రం తొలిప్రేమ. ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి తొలిప్రేమ చిత్ర బృందాన్ని అభినందించారు. తమ కుటుంబమంతా వరుణ్ తేజ్ నటనను చూసి గర్విస్తోందని చిరు చెప్పారు. ఈ ఉదయం తొలిప్రేమ చిత్ర బృందాన్ని తన నివాసానికి పిలిపించుకుని సినిమా పట్ల తన అనుభూతిని తెలిపారు. చిరంజీవి మాట్లాడుతూ...తొలి ప్రేమ ఆలస్యంగా చూశాను. చాలా స్ఫూర్తివంతంగా అనిపించింది. నా సోదరుడు పవన్ సినిమా టైటిల్‌తో రావడంతో సినిమా చూడలనే ఆసక్తి కలిగింది. ప్రస్తుతం యువతలో మనం చూసే కథ ఇది. కథ కంటే కథనం బాగుంది. ఇలాంటి సినిమా చేయడం కొత్త దర్శకుడికి సవాలు లాంటిది. వెంకీ చక్కగా తెరకెక్కించాడు. తెలుగు పరిశ్రమ గర్వపడే సినిమా ఇది. చూసిన నటీనటులైనా కొత్తగా వాళ్ల పాత్రలను దర్శకుడు మలిచాడు. వెంకీ లాంటి ప్రతిభ గల నవతరం దర్శకులు మన పరిశ్రమకు మరింత మంది రావాలి. అప్పుడే టాలీవుడ్ మిగతా పరిశ్రమల సృజనాత్మక చిత్రాలకు పోటీనిస్తుంది. వరుణ్ ఎత్తుకు నృత్యాలు బాగుంటాయా అని సందేహించాను. కానీ ఇందులో చిన్న చిన్న స్టెప్పులు బాగా చేసుకుంటూ వచ్చాడు. వాళ్ల నాన్న నాగబాబుకు వరుణ్ ఇచ్చిన బహుమతి ఈ సినిమా. అన్నారు. నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ...33 ఏళ్ల క్రితం చిరంజీవి గారిని కలుద్దామని మద్రాసు వెళ్లాను. ఇవాళ వాళ్ల వారసులతో కుటుంబ సభ్యులతో సినిమాలు చేసి విజయాలు అందుకోవడం సంతోషంగా ఉంది. అన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్‌తేజ్, దర్శకుడు వెంకీ అట్లూరి, సంగీత దర్శకుడు థమన్, నిర్మాత బాపినీడు తదితరులు పాల్గొన్నారు.



నాగార్జున

పాతికేళ్ల తర్వాత నాకో కొత్త హీరో దొరికాడు

- రాంగోపాల్ వర్మ

పాతికేళ్లు వెతికిన తర్వాత నాకో కొత్త హీరో దొరికాడు. ఇంతకీ అతనెవరో కాదు అక్కినేని నాగార్జునే. ఇంతకుముందు చూడని రియలిస్టిక్ యాక్షన్ హీరోగా నాగార్జునను చూస్తారు అంటూ దర్శకుడు రాంగోపాల్‌వర్మ ట్వీట్ చేశారు. తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ వర్మ సరిగ్గా 25 సంవత్సరాల క్రితం ఫిబ్రవరి 16న అంటే ఇదేరోజు మా ఇద్దరి కాంబినేషన్‌లో రూపొందిన శివ చిత్రీకరణ ప్రారంభమైంది అని ఆ ట్వీట్‌లో ఆయన పేర్కొన్నారు. నాగార్జున, వర్మల కలయికలో ఓ చిత్రం ఈ మధ్యనే ప్రారంభమై, ప్రస్తుతం శరవేగంగా షూటింగ్‌ను జరుపుకుంటున్న విషయం తెలిసిందే. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో నాగార్జున పోలీస్ అధికారి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్‌లో బిజీగా ఉన్న వర్మ ఈ నూతన చిత్రంలోని నా కొత్త హీరో నాగ్ స్టిల్‌ను పోస్ట్ చేస్తున్నానని వివరిస్తూ రెండు ఫొటోలను పెట్టడంతో పాటు పైవిధంగా స్పందించారు. వర్మ చెప్పినట్లుగానే నాగ్ కొత్తగా కనిపిస్తున్నారు.

యూనిట్ సభ్యులను సత్కరించిన ఛలో నిర్మాతలు

ఒక సినిమా రిలీజ్ అయ్యాక, ఆ సినిమాకు పనిచేసిన సాంకేతిక నిపుణుల గురించి నిర్మాతలు ఆలోచించరు. పనిచేశారు డబ్బులిచ్చేశాం అనే ధోరణితోనే ఉంటారు. కానీ 24 విభాగాల కార్మికులను సినిమా విజయంలో భాగస్వాములను చేసూ వారిని ప్రత్యేకంగా సత్కరించి ఛలో నిర్మాతలు కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర ప్రసాద్, ఉషా నిర్మాతలుగా ఛలో సినిమా తెరకెక్కింది. నాగశౌర్య, రష్మి జంటగా నటించగా, వెంకి కుడుముల దర్శకత్వం వహించారు. ఛలో సినిమా భారీ విజయాన్ని పొందింది. రెండు వారాలకి 23.31 కోట్లు వసూలు చేసింది. ఈ సందర్భంగా నిర్మాత ఉష ముల్పూరి ఈ చిత్రానికి పనిచేసిన యూనిట్‌ను సత్కరించారు. దర్శకుడికి కారు బహుమతిగా అందజేశారు.

నిర్మాత మాట్లాడుతూ తెరమీద కనిపించేవారి వెనుక వందలాది మంది శ్రామికుల కష్టం ఉంటుందని నిర్మాతలుగా మారాక మాకు తెలిసింది. అందుకే విజయంలో వారిని భాగస్వాములను చేస్తూ ప్రతి ఒక్కరిని సత్కరించుకున్నాం. దర్శకుడు వెంకి కుటుముల కథను చెప్పడం, మేము ప్రొడక్షన్ చేయడం జరిగింది. మా సంస్థకు ఇంత మంచి చిత్రాన్ని ఇచ్చిన దర్శకుడికి కారు బహుమతిగా ఇవ్వడం జరిగింది అని చెప్పారు.

ఈ చిత్రం తీసే అవకాశం ఇవ్వడమే నాకు గిఫ్ట్, ప్రేక్షకులు బ్లాక్‌బస్టర్ హిట్ చేయడం డబుల్ గిఫ్ట్ అని దర్శకుడు వెంకి పేర్కొన్నారు. నాగశౌర్య పరిచయం కాకపోతే నాకు ఈ జీవితం లేదు. సినిమాకు పనిచేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.





చెన్నై చిన్నోడు పాటలు విడుదల

జీవీ ప్రకాష్ కుమార్, నిక్కీ గల్రానీ జంటగా నటించిన తమిళ చిత్రం తెలుగులో చెన్నై చిన్నోడు పేరుతో అనువాదమవుతోంది. వీడి లవ్‌లో అన్నీ చిక్కులే అనేది ఉపశీర్షిక. శూలిని దుర్గా ప్రొడక్షన్స్ పతాకంపై వి. జయంత్ కుమార్ ఈ చిత్రాన్ని టాలీవుడ్‌లోకి తీసుకొస్తున్నారు. యశ్వంత్ సాయికుమార్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఎం రాజేష్ దర్శకత్వం వహించిన చెన్నై చిన్నోడు ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు చిత్ర పరిశ్రమ వాసులు పాల్గొన్నారు. బిగ్ సీడీ విడుదల అనంతరం నిర్మాత జయంత్ కుమార్ మాట్లాడుతూ...మా తాత దగ్గర నుంచి సినిమా రంగంతో నాకు అనుబంధం ఉంది. ఆయనను చూసే పరిశ్రమలో ఉండాలన్న ఆసక్తి కలిగింది. తొలిసారిగా ఓ తమిళ చిత్రాన్ని చెన్నై చిన్నోడుగా మీ ముందుకు తీసుకొస్తున్నాం. తెలుగు సినిమాలాగే ఎక్కడా రాజీ పడకుండా నిర్మాణాంతర కార్యక్రమాలు చేశాం. పూర్ణాచారి అర్థవంతమైన సాహిత్యాన్ని అందించారు. ఆద్యంతం కడుపుబ్బా నవ్వించే వినోదాత్మక చిత్రమిది. ప్రకాష్ రాజ్ పోలీసు పాత్ర చిత్రానికి ప్రధాన ఆకర్షణ అవుతుంది. నటులు జీవా ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. జీవీ ప్రకాష్ కథానాయకుడిగా నటించడంతో పాటు మంచి సంగీతాన్ని అందించారు. అన్నారు.

కొత్త కుర్రాడు

ఆకాష్ తాజాగా నటించిన చిత్రం కొత్తగా ఉన్నాడు. ఆకాష్ సరసన ప్రియ, సోనియా కథానాయికలుగా నటించారు. ఎం.రాధా దర్శకత్వం వహించారు. రాజా మీడియా వరల్డ్ సమర్పణలో జై బాలాజీ మూవీ మేకర్స్ పతాకంపై ఎం.కె.రాజా నిర్మిస్తున్నారు. యు.కె.మురళి సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఆడియోతో పాటు ట్రైలర్‌ను కూడా విడుదలచేశారు. సినిమా టైటిల్‌లానే ఈ చిత్రంలో ఆకాష్ కొత్తగా కనిపిస్తున్నారని, దీంతో అతనికి మంచి విజయం రావాలని వేదికపై పాల్గొన్నవారంతా ఆకాంక్షించారు.

హీరో ఆకాష్ మాట్లాడుతూ, లండన్ నేపథ్యంలో జరిగే ఈ చిత్రకథలో ఆంధ్ర కుర్రాడిగా, తెలంగాణ కుర్రాడిగా రెండో కోణాలున్న పాత్రలో నటించానని చెప్పారు. విక్రమ్ నటించిన అపరిచితుడు కోవలో ప్రేక్షకులను ఈ చిత్రం అలరింపజేస్తుందని అన్నారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే కూడా తానే సమకూర్చానని ఆకాష్ వివరించారు. పాటలన్నీ బాగా కుదిరాయని సంగీత దర్శకుడు యు.కె.మురళి తెలుపగా, ఈ చిత్రంతో తొలిసారిగా నిర్మాతగా సినీరంగంలోకి అడుగుపెడుతున్నానని, ఇది తనకు మంచి శుభారంభం అవుతుందన్న అభిప్రాయాన్ని యం.కె.రాజా అన్నారు. ఇంకా ఈ వేడుకలో నిర్మాతలు సురేష్ కొండేటి, జైరామ్, దినేష్ మాడ్నే, బాల్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి, వర్ధమాన దర్శకుడు రవిశర్మ, హీరోయిన్లు ఆర్తిసురేష్, సుమ, లక్కీ, కొరియోగ్రాఫర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆకాష్, ప్రియ



ఎందుకో ఏమో తొలిపాట

నందు, నోయల్, పునర్నవి నటిస్తున్న చిత్రం ఎందుకో ఏమో. మహేశ్వర క్రియేషన్స్ పతాకంపై కోటి వద్దినేని దర్శకత్వంలో మాలతి వద్దినేని నిర్మిస్తున్నారు. మొదటి పాటను దర్శకుడు బోయపాటి శీను ఆవిష్కరించారు. టైటిల్ క్యాజీగా ఉందని, పాట బావుందని ఆయన ప్రశంసించారు. నందుకు హీరోగా మంచి పేరు తేవాలని ఆశిస్తున్నాను అన్నారు. దర్శక, నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా సినిమాను పూర్తిచేశారని హీరో నందు చెప్పారు. విడుదలైన పాట తన ఫేవరేట్ అని పేర్కొన్నారు.



దర్శకుడు మాట్లాడుతూ సినిమాలో మొత్తం నాలుగు పాటలున్నాయి. ప్రవీణ్ ఒక్కోపాటని ఒక్కో విధంగా కంపోజ్ చేశారు. ఇటీవలే వినాయక్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. మార్చిలో సినిమాను విడుదల చేస్తాం అని చెప్పారు.

దర్శకుడు పూర్తిస్వేచ్ఛనిచ్చి మంచి పాటలు చేయించుకున్నారని సంగీత దర్శకుడు ప్రవీణ్ చెప్పారు.